


వంబర్ 1975

ఆంధ్రప్రదేశ్

50



ఆంధ్రప్రదేశ్

సంపుటి : 20

నవంబర్, 1975
కార్తీక—మార్గశిర, 1897

సంచిక : 1

ప్రధాన సంపాదకులు
శ్రీ రాజ్యం సిన్హా

సంపాదకులు
యన్. వి. గోపాలశాస్త్రి

రాష్ట్ర అవతరణోత్సవ ప్రత్యేక సంచిక

లవణ జలధిని తఱచి వేయర
నవధనాలను అందుకోరా
అవధరింపుము స్తవము చేయుము
భువనకాంతిగ హారతెత్తుమురా
ఓ ఆంధ్రపుత్రా !
కువలయాలను వెలుగు నింపుమురా !

— అడివి బాపిరాజు

మొదటి కవరు పేజీ : ప్రగతి పుష్ప పరిమళాలు
(ముఖచిత్రం : శ్రీ డి. పి. త్రిలోయల్కా సౌజన్యంతో)
మధ్యపేజీల్లో : మహావీర జయంతి
రెండో కవరు : పాల ప్రాజక్టులో అమృత కలశాలు
చివరి కవరు : విజయేందిర (కవిత)

సాలు చందా : ఆరు రూపాయలు
వెల: 50 పైసలు
రిజిస్టరు నెం: హెచ్/హెచ్ డి. 81

ఈ సంచికలో..

పేజీ

తెలుగమ్మ తెలుగు
తెలుగో తెలుగు

"సోమశర్మ సూరి"

తెలుగమ్మ ! తెలుగు !
తెలుగో ! తెలుగు !
అలికిడీ నిలకడా, అపు
రూపమవు తావు
పాల్కడలి పరవళ్ల వెలుగు !

ఊరి అమ్మల కెల్ల, నేరుగా,
మా అమ్మ, పంచి పెట్టేమించు
నెలుగు ! ఇరుగూరి, పొరు
గూరి వాకటుల, చీకటుల,
పరుగులెత్తించేటి, వెలుగు !
అందు, కరువులం దీర్చేటి,
వెలుగు ! అచటి, మరువు
లం బోకార్పు, వెలుగు !

ఉలుకు, పలుకూ లేని, ఊహ,
పోహ లేని, బలు సోమరుల
మార్చు తెలుగు ! వెలకట్ట
గా లేని, చెలి కారముల
గూర్చి కలికి తేనెల జార్చు
వెలుగు!

బుల్లి పాపలకైన, మణ
తాతలకైన, ఉల్లాస మొ
లికించు, తెలుగు ! హల్లీస
కములలో, వెలుగు ! పూల
పల్లకీ లెక్కించు, వెలుగు !

అంగారములలోన, బంగా
రముల నేర్చి, సింగారము
లగూర్చు తెలుగు ! దండి
ముంగారు పటలకు వెలుగు !

మందార మకరంద మాధుర్య
ముల చిందు, బృందారకుల
విందు, తెలుగు ! సాధు, గో
బృందాల, సంపదల, వెలుగు !

ఏమన్న, వేదమై, వేమన
ప్రసాదమై, సామాన్య
వలరించు, తెలుగు ! వాని
ధీమాన్య గావించు, వెలుగు !

తేజోధికులమనే, రాజాధి
రాజులను, పూజారులను,
జేయు, తెలుగు ! గుండె,
బేజారు లెత్తించు, వెలుగు !

కసి వేడి, అసివాడి, కవ
గూడువేళ, రక్కసి దాడి,
చేయించు, తెలుగు ! ఏ
దెస, రౌడి, మాయించు, అస
మానమగు, నెలుగు ॥

సేబాసనగ, జాలు, నే బాస
నేని, తమి, ఆపోసనము
బట్టు, తెలుగు ! మధుర బాషా
నను, వెలార్చు, అలుగు ! విశ్వ
దీపాల, వెలిగించు, వెలుగు !

ప్రగతి పందెంలో పరుగు

—ముఖ్యమంత్రి సందేశం



భారత దేశంలో జరిగిన జాతీయ ఉద్యమ పోరాటంలో భాగంగా ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుండి తెలుగు ప్రాంతాలను విడదీసి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రంగా చేయాలనే ఉద్యమం చాలా కాలం కొనసాగిన ఫలితంగా ఆంధ్ర రాష్ట్రం 1953 లో ఏర్పడింది ఆ ఆదర్శం ఫలించినప్పటికీ ఇంకా అప్పటికీ తెలంగాణా ప్రాంతంలో ఒక కోటి మందికి పైగా తెలుగుమాట్లాడే ప్రజలు నైజాము రాష్ట్రంలో ఉంటూ ఉండేవారు నైజాము రాష్ట్రంలోని ప్రాంతాలను కూడా కలిపి పెద్ద రాష్ట్రంగా అవతరింపచేయాలని తెలుగు ప్రజలు వాంఛించారు చివరకు 1956 నవంబరు 1 వ తేదీన మన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం అవతరించిన సంగతి అందరికీ తెలిసినదే

ఆంధ్రప్రదేశ్ అవతరణ జరిగిన తరువాత మన రాష్ట్రంలో ఎంతో అభివృద్ధి వచ్చిందనే విషయం అంగీకరించకతప్పదు ఈనాడు మనం మన రాష్ట్రాన్ని వెనుక బడిన రాష్ట్రంగా చెప్పుకొంటున్నప్పటికీ 1956 తో పోల్చుకొన్నట్లయితే ఈనాటి పరిస్థితులు ఎంతో అభివృద్ధికరంగా ఉన్నాయి ఇదివరకు జరిగిన పారిశ్రామిక ప్రగతి మనకు సంతృప్తికరంగా లేదనేది యథార్థం అయినప్పటికీ హైదరాబాదు, గుంటూరు, వరంగల్లు, విజయవాడ, విశాఖపట్టణం, కర్నూలు మొదలగు ప్రధాన పట్టణాలలో ఇప్పుడు అనేక పరిశ్రమలు పనిచేస్తూ ఉండడం మనం చూస్తూనే ఉన్నాము అనేకచోట్ల పారిశ్రామిక వాడలు పనిచేస్తున్నాయి. అదేవిధంగా వ్యవసాయంలో కూడా అధిక పంటలు పండించడంలోనూ, మేలు రకం విత్తనాలను తయారు చేసుకొనడంలోనూ, రైతులకు వ్యవసాయం కొరకు కావలసిన పరపతి సౌకర్యాలు విరివిగా కల్పించడంలోనూ ఎంతో అభివృద్ధి జరిగింది

మనం ఏ పని చేయదలచుకొన్నా ప్రజలతో సంప్రదించి అన్ని వర్గాలను సంతృప్తిపరిచే విధంగా సంక్షేమ చర్యలు తీసుకోవలసివుంటుంది 25 సంవత్సరాలకు పైగా స్వాతంత్ర్యం అనుభవిస్తుప్పటికీ దేశ వ్యాప్తంగా ఎంతో ఎక్కువగా జరుగలేదని ఆందోళన చేయడం అర్థరహితం. ఎందుకంటే ఒక వైపు మన దేశం సాధించిన ప్రగతిని చూసి విదేశాలవారు మెచ్చుకొంటూ ఉండగా మన దేశంలోని కొన్ని స్వార్థపర వర్గాలవారు విమర్శించడం, హింసాత్మక దౌర్జన్య చర్యలకు దిగడం ఇది ఒక అపూర్వమైన విచిత్రమైన పరిస్థితి ప్రస్తుతం మనం ఇటువంటి గడ్డు పరిస్థితి నుంచి బయటపడటానికి దేశాన్ని తిరిగి సౌభాగ్యవంతమైన ప్రజాస్వామ్య దేశంగా తీర్చిదిద్దుకోవడానికి సంకల్పించి పనిచేస్తున్నాము.

ఆర్థిక పరిస్థితి మెరుగయింది

మన రాష్ట్రం రెండుసార్లు రకరకాల ఆందోళనలను జరిపి ఎంతో నష్టపడింది కాని ఇటీవల జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా తెలుగు జాతి అంతా ఒక్కటే అనీ తెలుగు సంస్కృతి అంతా ఒక్కటే అనీ, మనందరం ఒక తల్లి బిడ్డలం అన్నటువంటి సమైక్యతా భావం ప్రజలలో పాతుకొన్నది ఇతోధికంగా మనం అభివృద్ధి చెందడానికి ఇది మంచి పునాది మన రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి యిప్పుడు చాలా మెరుగ్గావుంది ఆర్థిక క్లిష్టత అనేది ఎల్లప్పుడూ వుండే సమస్య అయినప్పటికీ, యింతకు ముందు మనకు రిజర్వు బ్యాంకులో తీర్చవలసిన ఓవర్ డ్రాఫ్టు మొత్తం చాలా ఎక్కువగా ఉండేది కాని క్రమంగా దానిని మనం తీర్చుకొన్నాము. ఇప్పుడు మనకు ఓవర్ డ్రాఫ్టు ఏమాత్రం లేదు అందువల్ల మన ఆర్థిక పరిస్థితి చాలావరకు మెరుగు పడిందనే అనుకోవచ్చు.

వెనుకబడిన వర్గాలు

ఈనాడు ప్రధానంగా రాష్ట్రస్థాయిలోగానీ జాతీయ స్థాయిలోగానీ, శతాబ్దాలుగా సమాజంలో అట్టడుగున పడిఉన్న సామాన్య ప్రజానీకాన్ని ఉద్ధరించడానికి అవసరమయినటువంటి కృషి జరుగుతున్నది హరిజనులు, గిరిజనులు, ఇతర వెనుక బడిన వర్గాల ప్రజల సంక్షేమం కోసం రకరకాల పథకాలను నిర్ణయించుకొని

ప్రభుత్వం అమలు జరుపుతున్నది. మన ప్రధాని ప్రకటించిన 20 సూత్రాల పథకంలో కూడా ఈ విషయానికే అత్యంత ప్రాధాన్యం ఇవ్వబడింది.

భూసంస్కరణలు

మన రాష్ట్రంలో పల్లెసీమల్లో నివసిస్తున్న నిరుపేద వర్గాలవారికి ప్రయోజనకరం అయినటువంటి అనేకఆర్డినెన్సు లను ఇటీవలనే జారీచేయడం కూడా జరిగింది. రాష్ట్రంలో భూసంస్కరణలు త్వరితగతిలో అమలు జరగడానికి కృషి ప్రారంభమైంది. ఎంత భూమి అదనంగా లభిస్తున్నదో తేల్చడానికి మరికొంత కాలం పట్టినప్పటికీ భూమిలేని నిరుపేద లకు కొంత భూమి తప్పకుండా లభిస్తుందనే విశ్వాసం ఇప్పుడు అందరిలోను కలిగింది. అదేవిధంగా గ్రామాల్లో నివసించడానికి వసతిలేని హరిజనులకూ, వ్యవసాయకూలీలు, చిన్న రైతులు, చేతిపని వృత్తుల వారు మొదలగువారికి ఇండ్ల స్థలాలు మంజూరు చేయడం, ఇప్పుడు నివశిస్తున్నయిండ్లపై వారికి హక్కు కల్గించడం, ఋణభారంతో బాధపడుతున్న నిరుపేదప్రజలకు కొంత కాలంపాటు ఋణాలు చెల్లింపవలసిన అవసరం లేకుండా మారటోరియం ప్రకటించడం మొదలగు అనేక చర్యలు గైకొనడం జరిగింది. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల విషయంలో కూడా ప్రభుత్వం ఉదారంగా వ్యవహరించి వారి అవసరాలను తీర్చడానికి సిద్ధంగా ఉన్నది. ఏకసభ్య వేతన సంఘం సమర్పించిన జీతాల సవరణ నివేదికలోని అంశాలను ప్రభుత్వం పూర్తిగా ఒప్పుకోవడం ఇందుకు నిదర్శనం. ఇకముందు కూడా ప్రభుత్వం రాష్ట్ర ఉద్యోగుల సంక్షేమ కార్యక్రమాలపట్ల శ్రద్ధ వహిస్తున్నదని హామీ ఇస్తున్నాను. మరొక ముఖ్యవిషయం త్వరలోనే మన రాష్ట్రంలో చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికై ఒక ప్రత్యేక సంస్థను స్థాపించాము. హైదరాబాదు నగరంలోనూ రాష్ట్రంలోని యితర ప్రాంతాలలోనూ ఫిలిం పరిశ్రమను అభివృద్ధి పరచడానికి ప్రభుత్వం ఆసక్తితో ఉంది. ఈవిధంగా సర్వతోముఖమైన అభివృద్ధి సాధించడానికీ, దేశం మొత్తం మీద మన రాష్ట్రానికి ఒక సుస్థిరమైన స్థానాన్ని కల్పించడానికీ కృషి జరుగుతూ వుంది. ఈ కృషిలో రాష్ట్ర ప్రజలందరు పాల్గొంటున్నందుకూ, ప్రభుత్వాన్ని పూర్తిగా బలపరుస్తూ ఉన్నందుకూ నా కృతజ్ఞతలు.

ఇది నా దేశం-ఇది నా రాష్ట్రం

మన ప్రధానమంత్రి ప్రతిపాదించిన కార్యక్రమం అమలు పరచుకుని దేశంలో క్రమశిక్షణతో కూడిన పురోభివృద్ధి సాధించడం మన అందరి కర్తవ్యం. మనకు ఉన్నటువంటి కొన్ని అలవాట్లను పూర్తిగా తగ్గించుకొని, " ఇది నా దేశం, ఇది నా రాష్ట్రం, ఇది నాకు జరుగుతున్న అభివృద్ధి " అనే భావాన్ని ఏర్పరచుకొని దేశ వ్యాప్తంగానూ, మన రాష్ట్రంలోనూ జరుగుతున్న ప్రభుత్వ కృషికి ప్రజలు దోహదం చేస్తూ, తెలుగుజాతి ఈ విషయంలో దేశంలోని ఇతరులకెవరికీ తీసిపోనివిధంగా కర్తవ్యదీక్షతో నడుం బిగించి నిలువవలసిన తరుణం ఆసన్నమైనది. ఆంధ్రప్రదేశ్ అవతరించి ఇప్పటికి 19 సంవత్సరాలు నిండి 20 వ సంవత్సరములో ప్రవేశించాము. ఈ రెండు దశాబ్దాల కాలంలో జరిగిన ప్రగతి, నేను మొదట్లో మనవి చేసినట్లు ప్రశంసాపాత్రమైనది. అయినా ఇంకా మనం ఎంతో ముందుకు పోవలసివుంది. ఈ ప్రగతి పందెంలో మనం ముందుగా పరుగెత్తుదాం. ఈ కృషిలో ప్రభుత్వంతో మనస్ఫూర్తిగా సహకరించాలని రాష్ట్ర ప్రజలను సవినయంగా అభ్యర్థిస్తున్నాను.

పదునాలుగో తేది

యాదుంచుకోవాలి మన మందరం-వచ్చే
పదునాలుగో తేది బహుసంబరం

పదునాలుగో తేది అది నెహ్రూ జన్మతిథి
అది నవంబరులోది, అది బాలలందరిది

చాచాజీ హృదయమ్ము స్వచ్ఛతకు నిలయమ్ము
పూచినట్టి గులాబి పూల నును పరిమళము

గాంధీకి వారసుని కమలా మనోహరుని
ఇందిరా జనకునందరు బాలలకు సఖుని

పాలకుడుగా జనుల నేలు ఘనుడేయైన
బాలలందొక్కడుగ భాసించు చాచాను

భారత ప్రథమ ప్రధానికివె జేజేలు
భావి భారత దేశ పౌరులవి వేవేలు

యాదుంచుకోవాలి మన మందరం-వచ్చే
పదునాలుగో తేది బహు సంబరం

— శ్రీ దమ్మ తానయ్య



చలనచిత్ర సీమలో ఉత్తమ ప్రమాణాలు

శ్రీ పిడతల రంగారెడ్డి

భారతీయ చలన చిత్ర పరిశ్రమ ప్రపంచ సినీ జగత్తులో ప్రముఖ స్థానాన్నే ఆక్రమిస్తోంది ఇక్కడ యీ రంగంలో పెట్టే పెట్టుబడి గాని, సాంకేతిక పరికరాలక్రింద చేసే ఖర్చుగాని, నటీ నటులు, తదితరులకు యిచ్చే మొత్తాలుగాని గణనీయంగానే వుంటాయి ఎంతో పురోగమించిన తూర్పు, పశ్చిమ దేశాల్లో చలన చిత్ర రంగంలో పెట్టే పెట్టుబడులతో పోల్చితే మనది తక్కువేమీకాదు.

ఈ చలనచిత్ర పరిశ్రమ దినదిన ప్రవర్ధమానమై యీ నాటి స్థితికి రావడానికి ప్రయివేటు రంగం ప్రధాన భూమిక ధరించింది. ఆదిలో అనేక శ్రమలకు ఓర్చి చలనచిత్ర పరిశ్రమకు పునాదులు వేసిన ప్రారంభకుల కృషిని యీ సందర్భంలో విస్మరించడానికి వీల్లేదు. ఈ విషయాన్నే ప్రస్తావిస్తూ చలనచిత్ర విచారణసంఘం (1950) యీ విధంగా అంది." చలనచిత్ర పరిశ్రమకు పునాదులు వేసిన ప్రారంభకులకు సరియైన పరికరాలు లేకపోయినప్పటికీ, యీ వృత్తికి సరియైన, గౌరవప్రదమైన సాంఘిక పరిగణన లభించనప్పటికీ, విదేశీ వస్తువులకు, తత్సంబంధమైన వాటికి ఆదరణ మృగ్యమైనప్పటికీ యిటువంటి అననుకూల పరిస్థితుల్లో ఎదురీది నిలదొక్కుకోగలిగారనే సత్యాన్ని మనం గుర్తుంచుకోవాలి. ప్రభాత్, బొంబేటాకీస్ న్యూథియేటర్స్ వంటి సంస్థలు యిటువంటి అననుకూల పరిస్థితుల్లో కాలానికి ఎదురీది చలన చిత్ర పరిశ్రమాభివృద్ధికి విశేషంగా దోహదం చేశాయి వాటి కృషిని అభినందించక తప్పదు

చలనచిత్ర పరిశ్రమకు ప్రోత్సాహ, సహకారాలను అందించే వుద్దేశంతో ప్రభుత్వం యీ శతాబ్ది యాభయ్యవ పడిలో ముందుకొచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో చలనచిత్ర బహుమతులు, ఋణాలు, సబ్సిడీలు, ప్రోత్సాహక బహుమతులు, ఇంకా అనేకానేక రాయితీ సౌకర్యాలు, కల్పించబడ్డాయి. చలన చిత్ర శిక్షణ సంస్థలు ప్రారంభించబడ్డాయి మన రాష్ట్రప్రభుత్వం కూడా ఆంధ్రప్రదేశ్ లో చలనచిత్ర పరిశ్రమ శీఘ్రంగా అభివృద్ధి చెందడానికి నిర్మాణాత్మక చర్యలు చేపట్టింది. వీటికి పరిశ్రమలో సర్వత్రా హర్షామోదాలు వ్యక్తమయ్యాయి

రాష్ట్ర బహుమతులు

రాష్ట్రప్రభుత్వం చేపట్టిన చర్యలలో ప్రధానంగా పేర్కొనవలసినవి—లక్ష రూపాయల సబ్సిడీ, ఉత్తమ తెలుగు చలనచిత్రాలకు ఏటా యిచ్చే స్వర్ణ, రజత, కాంస్య నంది బహుమతులు, గ్రామీణ ప్రాంతాలలోనూ, చిన్నచిన్న పట్టణాలలోనూ సినిమా హాళ్ళను నిర్మించడానికి ఋణసహాయానికి సంబంధించిన పథకాలు. చలన చిత్ర అభివృద్ధి సంస్థ ఏర్పాటు కావడంతో ఈ రంగంలో నూతనాధ్యాయం ప్రారంభమైనట్టుగా భావించవచ్చు కృష్ణా గోదావరి జలాలతో పావనమయిన యీ పుణ్యస్థలిలో చలనచిత్ర పరిశ్రమ సమగ్రాభివృద్ధికీ, సర్వతోముఖ వికాసానికీ యీ చలనచిత్ర అభివృద్ధి సంస్థను బహుశా ఏకైక ప్రతినిధిగా పేర్కొనవచ్చు

మన చలనచిత్ర నిర్మాతలు ఉత్తమ ప్రమాణాలుగల చిత్రాలను నిర్మించేందుకు దోహదం చేయాలన్నది ప్రభుత్వ ఆశయం. ఉత్తమ ప్రమాణాలుగల చిత్రాలంటే ఏమిటి? సంవత్సరాలక్రితం—అంటే యీ శతాబ్ది యాభయ్యోపడిలో న్యూథియేటర్స్ సంస్థకు సంబంధించిన అతిరథ మహారథులనదగిన దేవకీబోస్, సినిమాలను గూర్చి ఒక బహిరంగ సభలో "సినిమాలున్నాయ్ జాగ్రత్త" అంటూ ప్రేక్షకులకు హెచ్చరిక చేశాడు. ఆ తర్వాత దానినిగూర్చి ఆయనే వివరించాడు. " సినిమా చాలా శక్తివంతమయిన సాధనం జనం మీద దీని ప్రభావం ఎంతో గాఢంగా వుంటుంది నిర్మాత తను తీసేచిత్రం కథను ఎన్నుకోవడంలోగాని, చిత్రీకరణలోగాని, చెప్పే తీరులోగాని ఎంతో ఆలోచించి పరిశ్రమించాల్సి ఉంటుంది. అంటే యువకులు గానివ్వండి, వృద్ధులు కానివ్వండి వాళ్ళ మనసులు కలుషితం కానివ్వని ఉత్తమ ప్రమాణాలుగల చక్కని చిత్రాలనే నిర్మాతలు నిర్మించాలి " అని ఆయన వివరించారు.

ఉత్తమ ప్రమాణాలుగల చిత్రాలు, చక్కని చిత్రాలు అంటే ఏమిటో వివరించి చెప్పడం కొంచెం కష్టమే అవి యివీ అంటూ స్పష్టంగా నిర్వచించి ఏమీ లేవు వాటిని ఉదాహరణలు యిచ్చి చెప్పడం మటుకు చెప్పవచ్చు.

ఈ సందర్భంలో హెచ్.ఎమ్.రెడ్డి, బి.ఎన్.రెడ్డి, కె. సుబ్రహ్మణ్యం, దేవకీబోసు, పి.సి. బారువా, హిమాంశురాయ్, వి. శాంతారామ్ వంటి మార్గదర్శకుల అడుగుజాడల్ని, వారి చిత్రాలనూ ఉదహరించక తప్పదు. వారి తొలి రోజుల చిత్రాలలో ఆనాటి కాలానికి, ఆ యా ప్రాంతీయ సంస్కృతులకు సంబంధించిన యితివృత్తాలు దర్శనమిస్తాయి. అవి యించుమించు వారి పరిణతి చెందిన ప్రతిభావ్యుత్పత్తులకు దర్పణం పట్టుతాయి.

ఈ నాటికి కూడా వందేమాతరం, సుమంగళి, దేవత, మల్లీశ్వరి, త్యాగభూమి, బాలయోగిని, అమరజ్యోతి, ఆద్మీ, పడొసి, దేవదాసు చిత్రాలను మనం చిత్రకళాఖండాలుగా పరిగణిస్తుంటాం. ఈ శతాబ్ది ముప్ఫయిల్లోనూ, నలభైల్లోనూ తీసిన చిత్రాలైనప్పటికీ చలనచిత్ర పరిశ్రమ చరిత్రలోనే యివి మైలురాళ్ళుగా నిలిచిపోయాయి. ఇతివృత్తంలోగాని, సాంకేతిక విలువల్లోగాని, దర్శకత్వ ప్రతిభలోగాని ఉన్నత ప్రమాణాలువున్న చిత్రాలు కావడంచేత యీనాటికీ వాటి పేర్లను మనం గుర్తుంచుకున్నాం.

రాయ్ ప్రవేశం

ఈ శతాబ్ది ద్వితీయార్ధ ప్రారంభంలో కూడా ఉత్తమ ప్రమాణాల చిత్రాలు వచ్చాయి. సత్యజిత్‌రాయ్ చలనచిత్రరంగంలో ధ్రువతారలాగ అడుగుపెట్టాడు. ఆయన అపూర్వ చిత్రత్రయం—పథేర్ పాంచాలి, అపరాజిత, అపూర్ సంసార్ చలనచిత్ర జగత్తులో మైలురాళ్ళుగా వాసికెక్కాయి. ఉత్తమ ప్రమాణాలుగల చిత్రాలు రూపొందడంలో యీ రంగంలో మహారథులనదగిన వ్యక్తుల వ్యక్తిత్వమూ, వారి మేధా సంపదా ప్రధానంగా కారణమయ్యాయి.

ఉత్తమ ప్రమాణాలుగల చిత్రాల నిర్మాణం గురించి యిక్కడ ముచ్చటిస్తున్న ప్రస్తుత సమయంలో సెక్స్ యితివృత్తాల గురించి, పెద్ద తారలతో తీసే చిత్రాల గురించి, భారీ సెట్ల నిర్మాణాల గురించి, అతిగా సంగీతం చొప్పించే చిత్రాల గురించి—యీవిధమైన బాక్సాఫీస్ హిట్ ధోరణుల జోలికి నేను పోదలచుకోలేదు అయితే ఒక విషయం చెప్పక తప్పదు. ఇటువంటి ధోరణులు మాత్రం అంత ఆరోగ్యకరమైనవికావు. వీటిని అరికట్టడం అవసరం మనిషిలోని నీచప్రవృత్తిని ప్రకోపింపజేయక ఉత్తమాభిరుచులను ఉద్దీపింపజేయడానికి సినిమా దోహదం చేసే విధంగా చూడాల్సిన బాధ్యత పరిశ్రమలోని వారిమీద వుంది.

చలనచిత్ర పరిశ్రమలో కూడా ప్రయివేటు రంగమూ, పబ్లిక్ రంగమూ—యీ రెండు కూడా శాంతియుత సహజీవనం సాగిస్తూ, భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని పరిపుష్టం చేయడంలో దేనికది గణనీయమైన కృషి చేయడానికి ఆస్కారం వుంది. ఈ సందర్భంలో కేంద్ర రేడియో, సమాచార మంత్రిత్వశాఖవారి ఫిల్మ్స్ డివిజన్‌ను ఒక దృష్టాంతంగా పేర్కొనవచ్చు. భారత దేశంలో ప్రణాళికా యుగంలో దేశవ్యాప్తంగా అమలు జరుగుతోన్న అభివృద్ధి కార్యక్రమాలను గురించి ప్రజలకు తెలియజెప్పడంలో ఫిల్మ్స్ డివిజన్‌వారి చిత్రాలు విశేషంగా దోహదం చేస్తున్నాయి. వారు నిర్మించిన గౌతమబుద్ధ, ఖజురహో, జీవన సంగీతం వంటి డాక్యుమెంటరీలకు అంతర్జాతీయ బహుమతులు, ప్రముఖుల ప్రశంసలు లభించాయి.

ఈ విజయాలతో ఉద్దీప్తమై ఆంధ్రప్రదేశ్ చలనచిత్ర అభివృద్ధి సంస్థ డాక్యుమెంటరీ చిత్రాల నిర్మాణాన్ని కూడా చేపట్టి, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవాన్నీ, శిల్పకళా ప్రాభవాన్నీ తెరకెక్కించి అశేష ప్రేక్షకులకు మనో, నయనోల్లాసం కల్పించ దలచింది. తెలుగు డాక్యుమెంటరీ చిత్రాలు ఒకనాటికి తప్పక అంతర్జాతీయ బహుమతుల్ని అందుకోగలవనీ, అందరి మన్ననలకు పాత్రం కాగలవని నా ప్రగాఢ విశ్వాసం ఆ సుదినం మరెంతో దూరంలోలేదని నా నమ్మకం.



మానవాళికి దారిచూపే దీపకళిక

మహావీరుడు

డా. బెజవాడ గోపాలరెడ్డి

వర్ధమాన మహావీరుడు జన్మించి ఇరవై అయిదు శతాబ్దాలు గడిచినప్పటికీ ఆయన ప్రవచనాలు నేటికి కూడా నిత్యసత్యాలుగా, ముక్తిదాయకాలుగా భాసిస్తున్నాయి. దేశ కాలాలతో నిమిత్తం లేకుండా మానవజాతికంతకూ అన్నివేళలా శిరోధార్యాలుగా పరిగణింపబడుతున్నాయి. జైనధర్మాన్ని ప్రవచించిన ప్రవక్త ఆయన. సర్వమానవ సమానత్వాన్ని, సత్యప్రవృత్తిని, నిరాడంబర జీవనాన్ని అనేకాంతదృష్టిని, కారుణ్య దృక్పథాన్ని ఆయన బోధించాడు. ఆయన ప్రతిపాదించిన తత్వం కేవలం వ్యక్తులకోసమే కాదు. సంపూర్ణ సమాజంకోసం కూడా. ఆయన వివరించిన ధర్మాలు పరలోకసాధకాలు మాత్రమేకాక యీ వాస్తవ జగతిలో హితం కలిగించేవి కూడా. కనిపించని దేవునికన్నా కనిపించే మానవుని గురించే మహావీరుడు యోచించాడు. ప్రాణంలేని వస్తువులకన్నా ప్రాణంవున్న జీవుల గురించే ఆలోచించాడు. అందుకే ఆయన బోధలు మానవాళి సంక్షేమకాలు. ప్రాణికోటికి రక్షా కవచాలు. అవి మానవత, భూత దయ ప్రాతిపదికగా గలవి. వ్యక్తి వికాసంతోపాటు భగవంతునిగా మానవుని తీర్చిదిద్దగల మంత్రాక్షరాలంతటి శక్తివంతమైనవి. ఉత్తమోత్తముడైన పరిపూర్ణ మానవునిలోనే దైవాంశ ఆపాదించి, సర్వోత్కృష్ట గుణగణాలను ఆయనలో వీక్షించి సమున్నతమైన గౌరవాన్ని మానవునికి కల్పించింది జైన మతం. అంతటిగొప్ప మతానికి మహావీరుడు చిట్టచివరి ప్రవక్త. జైనమతంలోని ఇరవైనలుగురు తీర్థంకరుల్లోనూ ఆయనే కడపటివాడు. మహావీరునికి ముందున్న తీర్థంకరుడు పార్శ్వనాథుడు అహింసామార్గాన్ని బాగా ప్రచారంలోకి తీసుకువచ్చాడు.

వర్ధమాన మహావీరుడు జన్మించేనాటికి సంఘం ఎంతో లోపభూయిష్టంగా వుండేది ఒకవైపున శ్రమణ ధర్మము, మరోవైపున వైదిక ధర్మము ఒకదానితో ఒకటి పోటీలు పడుతుండేవి. శరీరాన్ని కష్టపెట్టే జ్ఞానరహితమైన సాధనమార్గం; ప్రాణుల్ని హింసించే యజ్ఞయాగాదుల హింసామార్గం—యీ రెండూ సమాజం మీద చెరగని ముద్రవేసి రాజ్యమేలుతున్నకాలమది దబ్బున్నవారు దరిద్రుల్ని కొనుక్కుని బానిసలుగా పెట్టుకుని పశువులకన్నా హీనంగా దండించే రోజులవి. మానవులందరూ ఒకటే, అందరూ సమానమనే సిద్ధాంతం అడుగున పడిపోయి. జాతివాదం ఉచ్ఛనీచ భావానికి దోహదం చేసింది. మనిషి విలువ అతని అధికారం మీదా, సంపదమీదా, పుట్టిన జాతిమీదా ఆధారపడి చలామణీ కావడం మొదలెట్టింది. ఈ జన్మలో కర్మఫలాన్ని అనుభవిస్తేకాని ఆ కర్మ క్షయంకాదనే ధోరణి వ్యాపించడంతో కర్మసిద్ధాంతం మనిషిని నిర్వీర్యుణ్ణి చేసింది.

ఇటువంటి పరిస్థితుల్లో వర్ధమాన మహావీరుడు జన్మించాడు. రాజకుటుంబంలో పుట్టి ముప్పయ్యేళ్లు భోగభాగ్యాలమధ్య యిష్టా యిష్టాలతో గడిపి, మహాభి నిష్క్రమణం చేసి పన్నెండున్నర సంవత్సరాలు సాధనలో గడిపి, నలభై మూడోఏట కైవల్యంపొంది, 72వ ఏట నిర్వాణం చెందాడు.

తన ముప్పయ్ ఏళ్ళ కైవల్య—కాలంలోనూ మహావీరుడు ఎన్నో జనపథాలు పర్యటించాడు. ఎన్నెన్నో బోధలు చేశాడు. ఆయన ధర్మాలు, బోధలు జనాన్ని ఆకర్షించాయి ఆయన రాక కోసం ప్రజలు ఎదురుచూశారు. ఆయన వాక్కు విని ప్రజలు తరించారు.

మహావీరుడు చెప్పిన హింస అంటే కేవలం ప్రాణం తీయడమేకాదు, మనసును కష్టపెట్టడం కూడా హింసకిందే లెక్క. ఏ జీవాన్ని చంపినా, ఎవరికి బాధకలిగించినా, ఎవరిని కోపించినా, చివరకు ఎవరిని బానిసగా చేసినా హింసా చర్యలకిందే లెక్క అని ఆయన పేర్కొన్నాడు. మనసును హింసించినా శరీరాన్ని హింసించినా హింసే అన్నాడు. అహింసా ధర్మాన్ని ఆచరించడంవల్ల సమతా ధర్మం పాలించినట్టవుతుందని ఆయన బోధించాడు.

దుఃఖం తనకు ఎలా అప్రియమో యితర ప్రాణులకు కూడా దుఃఖం అప్రియమే. ఆ విషయాన్ని తెలుసుకొని ప్రవర్తించడమే అహింస. ఈ సత్యాన్ని గుర్తించి, యితర ప్రాణులు ఏవిధంగా మనకు హింతం కల్పిస్తూ నడచుకోవాలని ఆశిస్తామో ఆ విధంగానే మనమూ వారికి మేలు చేకూరుస్తూ ప్రవర్తించాలి. అంతేకాదు ఏప్రాణిని వధించినా అది ఆత్మవధే అవుతుంది. ఏప్రాణిపై దయ ప్రకటించినా అది తనమీద తాను దయచూపుకున్నట్టే అవుతుంది. అందువల్ల హింసను విషానికి సమానంగానూ, ముల్లుకు సమానంగానూ భావించి దాన్ని పరిహరించాలి—అని వివరించాడు మహావీరుడు.

సత్యమే శాశ్వత ధర్మం

సత్యమనేది శాశ్వత ధర్మం. దాన్ని ఆచరించాలంటే అబద్ధాలు ఆడకపోవడమే కాదు, మనసును, శరీరాన్ని, వాక్కును ఋజువుగా వుంచమన్నాడు. మనసులో ఒకమాట, పైకొక మాట పలకవద్దన్నాడు.

దుఃఖానికి మూలం మోహం. మోహానికి కారణం కోరికలు. అందువల్ల దుఃఖాన్ని తొలగించుకోదలచినట్టయితే కోరికల్ని అదుపులో పెట్టుకోవాలన్నాడు మహావీరుడు.

జాతి వాదాన్ని ఆయన ఒప్పుకోలేదు ఆచార, వ్యవహారాది కర్మలవల్లనే బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు ఏర్పడతారని బోధించాడు. వర్ణ వ్యవస్థ మనుషులు చేసిన ఏర్పాటనీ, అది ఈశ్వర కల్పితం కాదనీ ఆయన పేర్కొన్నాడు.

కర్మ ప్రభావంనుంచి తప్పుకోవడం మానవుని చేతిలోనే వుంది. తన సుఖదుఃఖాలకు తానే బాధ్యుడు, వాటికి దేవుణ్ణి కర్తను చేయడం పొరపాటు. మానవుడు సాధనద్వారా కర్మబంధ విముక్తుడౌతాడనేది మహావీరుని ప్రవచనం. కర్మకు, పురుషార్థానికి అవినాభావ సంబంధం వుంది. పురుషార్థంతో కర్మ ఫలాన్ని తగ్గించుకోనూవచ్చు, లేదా హెచ్చించుకోనూవచ్చు అనడంలో పురుష ప్రయత్నాన్ని మహావీరుడు నొక్కి చెప్పాడు. 'మన చేతుల్లో ఏముంది, అదృష్టం ఎలావుంటే అలా జరుగుతుందనే' నిరాశావాదాన్ని, ప్రయత్నలేమితో ఏర్పడే నిస్తబ్ధతను ఆయన గర్హించి మానవ ప్రయత్నం వుండాలనే వాస్తవ దృష్టిని ప్రసాదించాడు స్థూల జగత్తులో యీ దృష్టి అవసరం ఎంతయినా వుంది. ఆధునిక కాలానికి అక్షరాలా యిది అవశ్యం అనుసరణీయం. మంత్రాలకు చింతకాయలు రాలవనీ, కష్టపడి పనిచేస్తేనే కాలం కలసివస్తుందనే సిద్ధాంతాన్ని పరోక్షంగా ఆయన ప్రవచనం వ్యక్తం చేస్తోంది.

క్రాంతదర్శి

మహావీరునిలోని గొప్పతనం అదే. ఆయన క్రాంతదర్శి. తన కాలానికి మాత్రమే కాక రానున్న కాలాలకు కూడా ఆయన బోధలు నిత్య హరితాలు. అంతటి ముందుచూపుగల దృష్టి ఆయనది. కనుకనే రెండున్నర వేల సంవత్సరాల తర్వాత కూడా ఆయన వాణి జీవించే వుంది. వ్యవస్థలో మార్పువచ్చి, కాల పరిస్థితుల్లో భిన్నమైన పరిణామాలు సంభవించి, సరికొత్త సమాజావిర్భావానికి ప్రయత్నిస్తోన్న వర్తమాన ఆధునిక వైజ్ఞానిక సమయంలో కూడా మహావీరుని ప్రవచనాలు అర్థాన్ని కోల్పోలేదు. పురుష ప్రయత్నం ఆనాడూ, యీనాడూ ఏనాడూ కావలసినదే. అటువంటి నిత్య సత్యాలు ఆయన బోధల్లో అనేకం వున్నాయి. జాతి భేదాన్ని ఆనాడే ఆయన నిరసించాడు. తన సంఘంలో సమస్త జాతుల వారికీ ప్రవేశం కల్పించాడు. అతని ధర్మశాసనంలో రాజవర్గంతో పాటు కార్మిక వర్గం కూడా దీక్ష పొందగలిగింది. 'మీరు బ్రాహ్మణ, క్షత్రియ, ఉగ్రపుత్ర, లిచ్ఛవి మొదలైనవాటిలో ఏ జాతిలోనైనా, ఏ కులంలోనైనా పుట్టివుండవచ్చు. కాని ప్రస్తుతం సమత్వ ధర్మం అవలంబించి, పరివ్రాజకులైనారు. అహింసను పాటిస్తూ యితరులు పెట్టే అన్నం తింటున్నారు. అటువంటప్పుడు యీ జాతి అభిమానాలూ, కులాభిమానాలూ ఎందుకు మీకు ?' అని తన అనుయాయుల్ని ప్రశ్నించాడు. జాతిగాని, కులంగాని బలం యీయలేవు. బలం చేకూర్చగలిగింది విద్య, సచ్చరిత్ర మాత్రమే అని ప్రవచించాడు. అవే మోక్షానికి దారి చూపిస్తాయని పేర్కొన్నాడు.

సరిహద్దులు లేని సమాజం

జాతి, కుల, మత భేదాలతో మనుషులు ఎక్కడికక్కడ సరిహద్దు గీతలు గీసుకుని సంకుచిత పరిధుల్లో యిరుక్కుపోయిన యీ వర్తమాన కాలంలో మహావీరుని బోధనలకు మరింత అర్థమూ, ప్రాముఖ్యమూ వున్నది.

ఆయన జాతి భేదాన్ని మాత్రమే కాదు బానిసత్వాన్ని కూడా గర్హించాడు. ఆయన కాలంలో బానిస విధానం బాగా ప్రచారంలో వుండేది. మహారాజు కుమార్తె కూడా బానిసగా అమ్ముడుపోయిన సంఘటనలు వున్నాయని చందన బాల వృత్తాంతం వల్ల అర్థమవుతుంది. ఆ బానిస పద్ధతిని నిర్మూలించడానికి ఆయన అయిదు నెలల ఇరవై అయిదు రోజులు గృహస్థుల భిక్షను తిరస్కరించి ఉపవాసం చేసి, చివరకు ప్రజల తప్పును ప్రజలే గుర్తించేటట్టు చేశాడు. ఆయన ప్రయత్నంవల్లనే నాటి బానిస పద్ధతికి స్వస్తి జరిగింది. అక్షరాలా అటువంటి బానిసవిధానం యీనాడు లేకపోయినా వెట్టిచాకిరి పద్ధతి దేశంలో యింకా అనేకచోట్ల కొనసాగుతూనే వున్న యీ రోజుల్లో భగవాన్ వర్ధమానుని బోధలు, ప్రచారం ఎంతయినా అవసరం.

మహావీరుని ప్రవచనాలు ఆత్మానుభూతితో వెలువడ్డ వాక్కులు. భోగలాలసత, ఆకాంక్ష, అశాంతి, హింస అనేవి మనిషిని చుట్టుముట్టిన చీకట్లు. ఈ చీకట్లను పారద్రోలి ఆత్మజ్యోతిని జాజ్వల్యమానంగా ప్రకాశింపజేయడానికి మహావీరుడు ప్రయత్నించాడు. సత్యం, ధర్మం, శాంతి, అహింస, సంయమనం, సమత, నిరాడంబరత, సాధనలద్వారా మనిషిని మనీషిగా తీర్చిదిద్దడానికి కృషి చేశాడు. పన్నెండేళ్ల సాధన ఫలితం కైవల్యం. ఆ కైవల్యం పొందిన తర్వాత ముప్పయ్ ఏళ్లపాటు ఆయన ప్రవచనం చేశాడు. ఎన్నో విషయాలమీద అనుభవంతోనూ, జ్ఞానంతోనూ తత్వబోధ చేశాడు. ఆయన వాక్కులు చీకటిలో కొట్టుమిట్టాడేవానికి దివ్య జ్యోతులు. ఆ జ్యోతులు అనంతంగా వెలుగుతూనే వుంటాయి. దేశ కాలాలతో నిమిత్తం లేకుండా మానవ జాతి వున్నంతవరకు నిరంతరంగా వెలుగుల్ని ప్రసాదించి దారి చూపుతూనే వుంటాయి.

★

చేనేతరంగాన్ని పునరుద్ధరిద్దాం



డాక్టర్ ఆర్. వి. రావు

గత 9 మాసాల నుండి చేనేత పరిశ్రమ మనరాష్ట్రంలో ముందంజవేసింది. ఈ శాఖ మంత్రిప్రయత్నాల వల్ల, దక్షిణరాష్ట్రాలన్నీ కలసి, యీ పరిశ్రమాభివృద్ధికి పని చేయటానికి సిద్ధంగా వున్నాయి. భారతప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ, 20 అంశాల ఆర్థిక ప్రణాళిక లో చేనేత పరిశ్రమాభివృద్ధికి గొప్పస్థానం యివ్వటమే గాక, ఒక కొత్త అభివృద్ధి ప్రణాళిక కూడా త్వరలో ప్రవేశ పెట్టబడునని సూచింపబడ్డది. దీనిలో చేనేత పరిశ్రమకు ఉజ్వల భవిష్యత్తు గలదని చెప్పాలి. దీనికి కారణం భారత దేశంలోని కుటీర పరిశ్రమలలోకెల్లా, చేనేత పరిశ్రమ సామాన్య ప్రజల కోరికలు నెరవేర్చుటయే గాక, కోట్లాది చేనేత పారిశ్రామికులకు వారి కుటుంబాలకు ఉపాధి సౌకర్యం కలుగచేస్తోంది. అంతేగాక, బట్టల ఎగుమతి వలన, దేశానికి విదేశ మారకము కూడా సంపాదిస్తోంది.

ఈ శాఖ మంత్రి శ్రీ కేశవులుగారు, చేనేత పరిశ్రమాభివృద్ధికి గొప్ప చేయూత నిచ్చారు. ఇది చరిత్రలో కనీ వినీ ఎరుగనిది అని చెప్పాలి. ఈమధ్యనే ఢిల్లీలో మాట్లాడుతూ, కావలసిన నూలు, సరసమైనధరకు సరఫరాచేయటానికి, యూనియన్ కామర్సు మంత్రివర్గము, మాస్టర్ వీవర్సుకూడా సూత్రరీత్యా వప్పుకొన్నారని చెప్పారు. దానితో, సహకార రంగంలో లేని వారికి కూడా తగు లాభం కలుగుతుంది. ఈ చర్య వలన లక్షలాది చేనేత పారిశ్రామికులకు కావలసిన నూలు సరసమైన ధరకు దొరుకుతుంది. మధ్యస్థులు వారిని దోచుకోటానికి వీలులేదు. ఈ విషయంలో దక్షిణాది రాష్ట్రాలన్నీ త్వరలో సమావేశమై, ఒక మిల్లుకు, యింకొక మిల్లుకు, తయారు ధర వేరు గనుక, వీటిని క్రోడీకరించి ఒక నిర్ణయానికి రాగలరన్నారు. కొన్ని రకాల చీరలు, ధోతీలు, చేనేత పరిశ్రమకు ప్రత్యేకించడం జరుగుతుందనీ, గ్రామీణ చేనేత సహకార సంఘాలు, వాటిని అమ్మడం జరుగుతుందనీ శ్రీ కేశవులుగారు చెప్పారు. చీరలు, ధోతీలు చేనేత సహకార సంఘాలు తయారు చేయబోయే కంట్రోల్ బట్ట, వారే పంపిణీ (distribution) చేస్తే, రహదారి ఖర్చులు, కేంద్ర సంఘం ఖర్చులు పోయి, గ్రామీణ చేనేత పారిశ్రామికులకు, యింకా ఎక్కువ లాభం రాగలదు. ఇవన్నీ చేనేత పరిశ్రమకు శుభసూచనలని చెప్పాలి.

గ్రామీణ జీవితంలో గొప్ప స్థానం


మన గ్రామీణ జీవితంలో, చేనేత పరిశ్రమకు ఉన్నతస్థానం వుంది. ఇది కుటీర పరిశ్రమ అయినా, దీనికి గొప్ప ప్రాచీనత, వైభవం, విదేశాల్లో ప్రాముఖ్యతవుంది. తెలుగు వారు చేనేత కళాసృష్టికి పెట్టింది పేరు. భారత దేశం-ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ నూలు పట్టు ఉన్ని వస్త్రాల తయారీకి అనేక శతాబ్దములుగా పేరెక్కింది. మన వస్త్రాలు ప్రపంచంలో తూర్పు పడమటి దేశాల్లో కూడ పేరెన్నికగాంచినాయి. మన సరకుల అందచందాలే, దీనికి కారణం. కలంకారీ వస్త్రాలకు విదేశాలలో అప్పుడు, యిప్పుడు, కూడ గిరాకీ వుంది; మన దేశం సందర్శించిన యాత్రికులు, మన సరకులు చూసిన పెద్ద మనుషులు, యిచ్చిన అభిప్రాయాలు చదివితే మన చేనేత పరిశ్రమల సరకులవిశిష్టత తెలుస్తుంది. ఎరిత్రియను సముద్రానికి చెందిన పెరిప్లస్ వ్రాసూ, బందరు ప్రాంతంలో

మస్లినులు, యితర రంగుల బట్టలు, లభ్యమయ్యేవని, తూర్పుతీరం వాటికి పెట్టింది పేరని చెప్పాడు. ఫ్రెంచి తత్వజ్ఞుడు రూసో, మసులాలో తయారయే అద్దకం బట్టలంటే, అక్కడి వారికి ఎంతో యిష్టమన్నాడు. కలంకారీ అద్దకం గురించి పురాణములలో కూడ పేర్కొనబడింది. 1618–22 సం॥ లలోని, ఇంగ్లీషు ఫ్యాక్టరీ, రికార్డుల ప్రకారం, వరంగల్‌లో నేసిన బట్టలు పారశీక దేశంలో చాలా కొనే వారని తెలుస్తుంది. నర్సాపురం, పశ్చిమ గోదావరి జిల్లాలో గొప్ప ఓడలు నిర్మించి, అక్కడి నుండి చేనేత బట్టల వ్యాపారం చేసేవారట.

బ్రిటిషుప్రభుత్వ కాలంలో, మన కుటీరపరిశ్రమలు ముఖ్యంగా చేనేతపరిశ్రమ నశించింది. కాని స్వాతంత్ర్యం వచ్చాక చేనేత పరిశ్రమకు ముఖ్యప్రోత్సాహం యిచ్చాం. మన చేనేతపరిశ్రమకు ఎట్టి కష్టాలు వచ్చినా, ఓర్చుకోగల శక్తి వుంది. అందుచేతే, యిప్పటి వరకు నిలిచింది.


6 లక్షలకు పైగా మగ్గాలు

మన రాష్ట్రంలో 6 లక్షలకు పైగా చేనేత మగ్గాలున్నాయి. ముప్పైలక్షల మందికి పైగా, జీవనాధారమైన యీ పరిశ్రమ, కుటీర పరిశ్రమలలో మొదటి స్థానం అలంకరిస్తోంది. కట్టుబట్టలలో చీరకు యీ నాటికి ప్రాధాన్యతవుంది, 1,012 రకాలకు పైగా తీరు తీర్పుగా కట్టడానికి వీలైన యీ చీర, వస్త్రధారణంలో భారత జాతీయతకు చిహ్నంగా ప్రపంచమంతటా పేరుగాంచింది. ప్రపంచంలో ఎక్కువ మందికి, ఆంధ్రప్రదేశ్ చీర లంటే



ఉన్ని కార్పెట్లు

ఎంతో యిష్టం. చీరలలో అందం, ఆకర్షణ కూడా వుంది. అందుకే అంటారు మనవాళ్ళు "చక్కనమ్మ చిక్కినా అందమే, సన్నబట్ట చినిగినా అందమే". ఆంధ్రదేశంలో తయారయే వస్త్రాలకింత ప్రాముఖ్యం రావటానికి కారణం అందం ఒక్కటేకాదు. నేసిన వస్త్రంలో ప్రతి అంగుళంలోను, యంత్ర సహాయం లేకుండా, మానవుడు చూపే పనితనానికి, కళా నైపుణ్యానికి ప్రత్యక్ష నిదర్శనాలుగా నిలుస్తాయి. ఉప్పాడలోను, సిద్ధిపేటలోను నేసే బట్టా, డిజైను చీరలు, పోచంపల్లి, చీరాల, మంగళగిరిలో తయారయ్యే చిటికె చీరలు, వేటపాలెం, నక్రేకల్‌లో నేసే మదరాసు ఛేతి రుమాళ్ళు, నారాయణపేట, గుంటూరు, వెంకటగిరి, గద్వాలలో నేసే మేలిరకం చీరలు, మోరి, నారాయణవరంలో నేసే సన్న ధోవతులు, ఎమ్మిగనూరు, సికింద్రాబాదులో నేసే రంగుల గుడ్డలు, పరదాలు, దుప్పట్లు, చీరాల పేరాలలో నేసే ఆసియా రుమాళ్ళు, జనగాంలో తయారయే పూసల చోళీలు, వాడకందార్ల అభిమానాన్ని చూరగొన్నాయి. దేశంలోనేగాక, విదేశాలలో కూడా మెప్పు పొందాయి. ఇవి గాక, కలంకారీ అద్దకాలు, బందరు, కాళహస్తి



బందరు కలంకారీ అద్దకాలు

పట్టణాలలో వున్నాయి. వాటికి వాడే రంగులు చెట్లనుండి, మొక్కల నుండి తీస్తారు. ఇవిగాక ధర్మవరం, ఆర్మూరు, పెద్దాపురం, నారాయణపేటలలో, నిగనిగలాడే పట్టుచీరలు నేస్తారు. వీటి పనితనం చూపర్లను ఆకట్టుకొంటుంది. వాటి నిగనిగలు, రంగుల ఎంపిక, అలంకారాలు చూస్తే, ఏ శుభకార్యానికైనా అనువైనవనే అనిపిస్తుంది. పట్టుదారం బహు ప్రాచీన కాలంనుండీ ప్రపంచానికి తెలుసు. మనదేశంనుండి విదేశాలకు ఎగుమతి అయ్యేది. శుభకార్యాలకు, పుణ్య సంస్కారములకు ఇది శ్రేష్ఠం. ముడిపట్టు మన రాష్ట్రంలో, మంత్రి కేశవులుగారి ధర్మమా అంటూ తయా

రవుతోంది. ఇప్పటివరకు పట్టుకాయలు మనం కర్ణాటక రాష్ట్రానికి అమ్మి, వారు వాటి నుండి దారంతీస్తే, దాన్ని మనం కొంటూవుండే వారం. కాని యిప్పుడు పట్టుకాయలనుండి, సిల్కుదారం, మన రాష్ట్రంలోనే తయారుచేసి కొంటున్నాం. దీనికై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక సహకార ఫెడరేషన్ స్థాపించింది.

మార్కోపోలో తన పర్యటనలో దక్కనులో అతిసున్నితమైన, మేలిరకం బట్టను, సాలిగూటి పనితనంతో పోల్చవచ్చనీ, ఏ దేశం రాజులైనా, రాణులైనా, ఆ బట్టలను సగర్వంగా ధరిస్తారనీ వ్రాశాడు. 1639 లో కుతుబ్‌షాహి రాజు, పర్షియా రాయబారి ఇరాన్‌కు పోయే సందర్భంలో అతనికి అమూల్యమయిన కస్‌బాయి వస్త్రాన్ని, బహూకరించాడు. దాన్ని నేయటానికి 6 సంవత్సరములు పట్టిందట. ఇప్పటికీ దానికి అంతర్జాతీయ ప్రశంసలు ఎక్కువగా వున్నాయి. హిమ్రులో నూలు పోగులతో కృత్రిమ పట్టు పోగులతో కలిపి శాలువలు, తెరగుడ్డలు నేస్తారు. లండనులోని హైకమీషరు కార్యాలయంలోను, రాష్ట్రపతి నిలయంలోను వీటిని విరివిగా వుపయోగించారు. దీనికి ఖద్దరు దారంకూడ ఉపయోగించవచ్చును. యీ పరిశ్రమ అభివృద్ధికి కీ. శే. పద్మజ నాయుడుగారు చాలా తోడ్పడ్డారు.

విశిష్టత

చరిత్ర ప్రారంభంనుండి, వస్త్ర రంగంలో మన చేనేత బట్టలు యీ విధంగా నిలిచాయి. వీనికి ప్రత్యేకత, విశిష్టత, వుంది. అందుచే వీటిలో జీవమూ, శక్తి ఉట్టిపడినాయి. వాటి నిరాడంబరమయిన జానపద కళ, స్ఫుటమైన రంగులకూర్పు ఆకర్షణీయమైన డిజైనులు, వాటికి సహజమైన శోభనిస్తాయి. ఈ ఫ్యాషన్ల ప్రపంచంలో చేనేత వస్త్రాల అందాన్ని, ఆనందాన్ని ఇనుమడింప చేస్తాయనడంలో సందేహంలేదు. ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంలో జరిగిన చేనేత బట్టల ప్రదర్శనను చూసి విదేశీ ఆంధ్రులు, విదేశీయులు ఎంతో సంతోషించారు.

ఈ కృషికంతకు మూలం ఆ మగ్గాలమీద ఆడే అమృత హస్తాలకళా నైపుణ్యమేనన్న విషయం విస్మరించరాదు. భారత జాతి యావత్తు దానికి జోహారులు అర్పిస్తున్నది. ఈ పోటీ ప్రపంచంలో కూడా చేనేత పరిశ్రమ, స్వశక్తిమీద నిలబడుతున్నదంటే, తర తరాల వారసత్వం ఇచ్చిన బలమే అని చెప్పాలి. ఈ చేనేతవస్త్రాలు మన జాతి సంస్కృతికీ, నాగరికతకు శాశ్వత చిహ్నాలుగా వెలుగొందుతూ ఉంటాయి. ఇటువంటి ప్రతిష్టాకరమైన పరిశ్రమకు సర్వవిధాలా ప్రోత్సాహం యివ్వటం మన ధర్మం, కర్తవ్యం.

ప్రభుత్వ చర్యలు

మన రాష్ట్రంలో రిబేటు యీ మధ్యనే తీసివేశారు. దీనికి బదులు ప్రభుత్వం యీ పరిశ్రమకు తాత్కాలిక సౌకర్యం కాకుండా, శాశ్వత సౌకర్యాలను చేకూర్చటకు ప్రయత్నాలు చేస్తున్నారు. మనకు 6 లక్షల బేళ్ల దారం కావలిస్తే, మన మిల్లులలో 1¼ లక్షల బేళ్లు మాత్రమే తయారవుతున్నాయి. మిగతాది యితర రాష్ట్రాలనుండి హెచ్చు ధరలకు తెచ్చుకుంటున్నాం. ఇప్పుడు మన రాష్ట్రంలోనే హెచ్చుదారం తీయుటకు మిల్లులను స్థాపింపనున్నాం. అంతేకాక మన చేనేత బట్టలు విదేశాలకు ఎగుమతిచేసినా, యిప్పుడు మదరాసు రేవుపట్టణం నుండి పోవుటవల్ల వారిపేరే పైకి వస్తోంది. కనుక మనం విశాఖపట్టణం, కాకినాడ రేవు పట్టణాలను ఉపయోగించాలి. మనం ఉపయోగించే పద్ధతులు మారాలని, నవీన శాస్త్రసమ్మతములైన మగ్గాలు వాడాలని మంత్రిగారి ముఖ్యవాదన. దీనిలో చాలా సత్యముంది. అంతేకాక చిన్న చిన్న మిల్లులు కూడ స్థాపించటానికి ప్రయత్నాలు జరుగుతూవున్నాయి. 1,50,300 కదుళ్లతో, దారంతీస్తే, అవికూడ ఆర్థికంగా నడుపవచ్చునని, ఆర్థిక దృష్ట్యా తేలింది. దీనితో యీ పరిశ్రమ వికేంద్రీకరణ మవుతోంది. అంతేకాక ప్రభుత్వం రెడీమేడ్ బట్టలు తయారు చేయటానికి ఒక పథకం ప్రవేశపెట్టింది. సహకార పద్ధతులపై యీ పరిశ్రమ నడుస్తుంది. మన చేనేత బట్టలను యితర రాష్ట్రాలకొని, రెడీమేడ్ బట్టలుగా మార్చి అమ్ముతున్నారు. ఈ మధ్యనే కేంద్ర సంఘం స్థాపించబడింది. దీనితో మనకు విదేశీమార్కెట్టు లభించడమేగాక, వేలాది వెనుకబడ్డ దర్జీలకు ఉపాధి సౌకర్యంలభిస్తుంది. నిలువవుండి, మురికిపడివున్న బట్టల అమ్మకంలో ప్రభుత్వంఎంతో సహాయపడింది. గొప్ప ఆర్థికసహాయం చేసింది. ఆర్థికంగా వెనుకబడ్డ వారికి గొప్పసహాయం లభించింది.

ఈ నాడు ఆంధ్రప్రదేశ్ చేనేత పరిశ్రమలో తీసికొన్న చర్యలు, దక్షిణాది రాష్ట్రాలలోనే గాక, భారతదేశం హర్షం పొందాయి. భారత ప్రధాని 20 అంశాల ప్రణాళికలో, చేనేత పరిశ్రమకు ఉన్నత స్థానం యివ్వబడింది. ఇట్లు జరుగుట యిదే మొదటిసారి, దీనికి కారణం లేకపోలేదు. యిది భారత దేశపు ముఖ్యమైన కుటీర పరిశ్రమ. దీనిపై కోట్లాది వెనుకబడ్డ చేనేత పారిశ్రామికులు ఆధారపడుతున్నారు. ఈ శాఖను నిర్వహించుచున్న దక్షిణాది రాష్ట్ర మంత్రులు ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ చేనేత మంత్రి శ్రీ కేశవులుగారి కృషి ఫలించుచున్నది. అత్యవసర పరిస్థితిలో, యీ పరిశ్రమ అభివృద్ధిచేయటానికి చాలా వీలున్నది. గ్రామ సీమలోవున్న కోట్లాది చేనేత పారిశ్రామికులకు యీ పరిశ్రమ ఉపాధి యిస్తున్నది. భారత, రాష్ట్ర ప్రభుత్వాలు, దేశంలో కావలసిన బట్టలు విదేశీ మార్కెట్టు, యీ రెండు విషయాలలోను, ఎంతవరకు చేనేత పరిశ్రమకు దోహదమివ్వాలన్న విషయం తీవ్రంగా ఆలోచిస్తున్నారు. దీనికి కావలసిన పరపతి, పెట్టుబడి సమస్యలు మనం ఆలోచించి వీటికి కొత్త సంస్థలు ఏర్పాటు కావలిస్తే ఏర్పాటుచేయాలి. ఇప్పుడు 220 మిలియన్ల మీటర్లు మాత్రమే, చేనేత సెక్టార్‌లో తయారవుతోంది. 5వ ప్రణాళికాకాలంలో 300లకు పెంచటానికి ప్రయత్నం జరుగుతోంది. భారత ప్రభుత్వం, కొత్త మిల్లులను రాష్ట్రాలలో స్థాపించుటకు అనుజ్ఞయిస్తోంది.

హర్షణీయమైన భారత ప్రభుత్వ నిర్ణయం

భారత ప్రభుత్వం ప్రధాని 20 అంశాల ప్రణాళిక క్రింద, యీ పరిశ్రమకు చేయూత నివ్వటానికి నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసికొంటూనే వుంది. ఇట్టి పరిస్థితులలో చేనేత పరిశ్రమకు చెడ్డరోజులు పోయాయని, ఉజ్వల భవిష్యత్తుగలదని వ్రాయాలి

తెలుగు నాట సాంఘికోద్యమాలు

— శ్రీ జె. వీరాస్వామి

(సెప్టెంబరు సంచిక తరువాయి)

ఆయన సమకాలికులలో, ఆయనతో సన్నిహితంగా పనిచేసిన మహనీయులలో ముఖ్యంగా పేర్కొనవలసినవారు రఘుపతివెంకటరత్నం, దేశరాజు పెద బాపయ్య, చిలకమర్తి లక్ష్మీనరసింహం, పైడా రామకృష్ణయ్య మొదలైన వారు. ఉపనిషత్కాలంలోని మహర్షులతో సాటిరాదగిన వాడు రఘుపతి వెంకటరత్నం. సచ్ఛీలమూ, సౌజన్యమూ మూర్తీభవించిన వారు. అద్వైతుల సమభావమూ, వైష్ణవభక్తుల ప్రేమతత్వమూ సూఫీల దర్శనమూ, ముప్పేటగా ఆయనలో ముడిపడ్డాయి. అందుకే ఆంధ్రదేశం, రఘుపతిని బ్రహ్మర్షి అని కీర్తించింది. వేశ్యావృత్తిని, చట్టం ద్వారా రూపుమాపటానికి, దేవదాసీ వ్యవస్థను నిర్మూలించడానికి, అంటరానితనాన్ని నాశనం చేయడానికి, రఘుపతి ఎంతగానో కృషిచేశాడు. ఆయన అతిపవిత్రమైన, అత్యంత నిర్మలమైన బహు పరిశుద్ధమైన జీవితాన్ని గడిపాడు. దిక్కులేకుండా, ఒకానొక రైల్వే ప్లాట్‌ఫారం మీద వదిలివేయబడిన అనాథ శిశువులను చేరదీసి, రఘుపతి వెంకటరత్నం, అభిమాన పుత్రికలుగా పెంచి పెద్దచేసి, విద్యా బుద్ధులుచెప్పించి తనబిడ్డలుగానే ఆయన పెళ్ళిచేశాడు. విద్యార్థులలో, ఉన్నత భావాల కోసం పవిత్ర శీలంకోసం, జీవిత సార్థక్యతకోసం, ఆయన జీవితకాలమంతా కృషి చేశాడు. ఆయన ప్రభావ పరిధిలోకి వచ్చిన వాళ్ళెవ్వరూ ఆయనను మరువలేరు. వీరేశలింగం విడిచిపెట్టిపోయిన, విద్యా, సాంఘిక, సాంస్కృతిక, మత సంస్కరణలను, రఘుపతి చేపట్టి, ఫలితాలను సిద్ధింపచేశాడు. హరిజనోద్ధరణకోసం, ఏకేశ్వరోపాసన, సర్వమత సమానత్వం, సర్వ మానవ సోదరభావం, మొదలైన గొప్ప ఆశయాలకోసం, రఘుపతి వెంకటరత్నం ఎంతగానో కృషి చేశాడు. అయితే ఆయన బ్రహ్మ సమాజ ఆదర్శాలను, జీవితంలోనూ, రచనలలోనూ ఎక్కువగా ప్రచారం చేశాడు. చీకటింట్లో, అఖండజ్యోతిగా ఆయన జీవితం తెలుగుదేశాన్ని ప్రభావితం చేసింది.

దేశిరాజు పెద బాపయ్య

దేశిరాజు పెద బాపయ్య, ధర్మ సంగ్రామం చేసిన మహావీరుడు. బ్రహ్మ సమాజధర్మాలను తెలుగు దేశంలో ప్రబోధించడంలో, రఘుపతి వెంకట రత్నం ఎంతగానో కృషి చేయగా, స్వయంగా జీవితంలో అన్ని కష్టనష్టాలను లెక్క చేయకుండా ఆచరించి చూపటానికి పూనుకొన్న మహా పురుషుడు దేశిరాజు పెద బాపయ్య. బాహ్యాడంబర మైన, కర్మకాండనంతా విసర్జించి సర్వ మానవ సోదరత్వాన్ని, చేతలలో ప్రదర్శించి, చూపిన వాడు పెదబాపయ్య. ఈయన ఇరవై ఆరు సంవత్సరాల పిన్న వయసుననే మరణించక పోయినట్లయితే, సంఘానికి, దేశానికీ, ఇంకెంతో సేవ చేసి ఉండేవాడు. జంజెం తీసివేసి అనుష్ఠానిక బ్రహ్మ సమాజికుడు కావడానికి వీరేశలింగానికి మార్గ దర్శకుడైనవాడు పెద బాపయ్య. దానినిబట్టి, పెదబాపయ్య వ్యక్తిత్వం ఎటువంటిదో అర్థం చేసుకోవచ్చు. తారుణ్యపు జీవితాన్ని కూడా, సంఘ సంస్కరణం కోసం, తాను నమ్మిన విశ్వాసాల కోసం, సిద్ధాంతాలకోసం త్యాగం చేశాడు. బంధువులంతా వెలివేసినా, ప్రేమాస్పదురాలైన భార్యను కాపురానికి పంపించక పోయినా, అత్తమామలెంత వత్తిడి చేసినా తానునమ్మిన ఆదర్శాలకోసం. సర్వస్వం త్యాగంచేసిన మహాపురుషుడు దేశిరాజు పెదబాపయ్య, వ్యాధిగ్రస్తుడైనా, ఎవరూ తనకు సహాయం రాకపోయినా, సంఘం బహిష్కరించినా, ఆదర్శాలను వదులుకోనివాడు. తన తరువాత సంఘ సంస్కరణ కార్యక్రమాలన్నిటికీ నాయకత్వం వహించి, ఎంతో సాధిస్తాడనుకొన్న దేశిరాజు పెద బాపయ్య అకాలమృత్యువు వాతబడిపోయినాడని, ఎంతగానో దుఃఖించాడు వీరేశలింగం. ఇట్లానే తానెన్నో ఆశలు పెట్టుకొన్న, సత్తిరాజు మృత్యుంజయరావు కూడా, చిన్నతనంలోనే మరణించాడని వీరేశలింగం బాధపడ్డాడు.

చిలకమర్తి లక్ష్మీనరసింహం, సంఘ సంస్కరణాభిమాని. కాంగ్రెసువారు హరిజనోద్యమాన్ని చేపట్టడానికి కూడా ముందే రాజారామ్మోహనరాయల వారి పేరిట రాత్రి పాఠశాలలను స్థాపించి, పంచములకు విద్యా ప్రదానం చేయడానికి పాటుపడినవాడు. వీరేశలింగంగారి, సంస్కరణోద్యమాలన్నిటినీ అభిమానించినవాడు. బ్రహ్మ సమాజధర్మాలను, ఈయన అభిమానించాడు. పైడా రామకృష్ణయ్య గారు, వితంతు వివాహోద్యమానికి ఆరోజుల్లోనే ముప్పదివేల రూపాయల విరాళమిచ్చి తోడ్పడ్డాడు. ఈయన కాకినాడలో ఉండేవారు. విద్యాధికుడు. సంఘ సంస్కరణాభిమాని. అలాగే వీరేశలింగానికి కుడిభుజంలా పనిచేసి, ఆలోచనలు చెప్పి, ఆయన చేపట్టిన సమస్త కార్యక్రమాలలోను, సహాయం చేసినవాడు, బసవరాజు గవర్రాజు. వీరేశలింగం సంఘ సంస్కరణోద్యమం కొనసాగిస్తున్న రోజులలో, ఆనాటి విద్యార్థులంతా, ఆయనను బలపరచారు. పీఠాధిపతుల బహిష్కరణలను తిరస్కరించారు. ఉన్నవ లక్ష్మీనారాయణ, టంగుటూరి ప్రకాశం, పట్టాభి సీతా

రామయ్య, కొండ వెంకటప్పయ్య, అయ్యదేవర కాళేశ్వరరావు, కొమర్రాజు లక్ష్మణరావు, మొదలైన నాయకులంతా కూడా, వీరేశలింగం సాగించిన సంఘ సంస్కరణోద్యమాలను బలపరచినవాళ్లే.

అటు తరువాత 1920వ సంవత్సరం నుంచి స్వాతంత్ర్య సంగ్రామం త్రివిధ బహిష్కారంతో, సహాయ నిరాకరణంతో, హరిజనుల సమస్త సాంఘిక హక్కులను సాధించే ఉద్యమంతోనూ ముమ్మరంగా కొనసాగింది.

మాలపల్లి నవల

అంతకుపూర్వం ఇంచుమించు రెండు దశాబ్దాలు కొమర్రాజు లక్ష్మణరావు, మొదలైనవాళ్లు విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలిని స్థాపించి, సాంస్కృతికోద్యమాన్ని నడిపారు. ఇంచుమించుగా, అదే కాలంలో దివ్యజ్ఞాన సమాజం కూడా, తెలుగుదేశంపై తన ప్రభావం చూపింది. ముఖ్యంగా రాయలసీమ ప్రాంతంలో, హిందూ సాంస్కృతిక పునరుజ్జీవనం రూపంగా, జ్ఞాన సమాజం కొంత బలపడింది. అయితే స్వాతంత్ర్యోద్యమం ఎప్పుడైతే వేగాన్ని పుంజుకొన్నదో, అన్ని ఉద్యమాలూ, నదులన్నీ సముద్రంలో కలిసి నట్టుగా, స్వాతంత్ర్యోద్యమంలోనే అంతర్భాగాలుగా కలిసిపోయినవి. 1921 వ సంవత్సరంలో ఉన్నవ లక్ష్మీనారాయణ గారి 'మాలపల్లి' అనే మహోత్తమ గ్రంథం వెలువడింది. 'మాలపల్లి' కలిగించిన రాజకీయ సంచలనం, చాలా ఎక్కువే అయినా సంఘ సంస్కరణ ప్రబోధమే, ఆ రచన ప్రధానాశయం. హెచ్చు తగ్గులు, ఏ రంగంలో ఉన్నా ఆ దేశం బాగుపడదని ఆయన ప్రబోధించాడు గుణ శీలం ప్రధానం కాని, కులాన్నిబట్టి మానవులను వేరుపరచరాదని మాలపల్లి మహోదాత్తంగా ప్రబోధిస్తుంది. 'మలిన దేహుల మాలలనుచును, మలినచిత్తుల కధిక కులముల నెలవొసంగిన, వర్ణ ధర్మ మధర్మంబే' అని దురాచారులను నిరసించాడు. బసవరాజు అప్పారావు, హరిజనులపట్ల అత్యాచారాలను నిరసిస్తూ పాటలు వ్రాశాడు. మంగిపూడి వెంకటశర్మ, తన రచనలద్వారా, హరిజనోద్ధరణంకోసం, ఉద్బోధించాడు. హరిజనుల దేవాలయ ప్రవేశంకోసం పెద్దలంతా కృషిచేశారు. మద్యపానం వర్జించటానికికూడా, ఆనాటి స్వాతంత్ర్యోద్యమ కార్యకర్తలెంతగానో కృషి చేశారు. అప్పటి బహిరంగ సభల్లోను, సినిమాలలోను, ఊరేగింపులలోను, మద్యపానంవల్ల కలిగే అనర్థాల ప్రచారం కావటం చూడవచ్చు. "రంగూన్ రౌడి", "పాని సంసారి" మొదలయిన బహుళ ప్రచారం పొందిన నాటకాలలో మద్యపానం వేశ్యావృత్తి, సంఘాన్ని ఎలా నాశనం చేస్తున్నవో నిరూపించడం జరిగింది.

కవిరాజు

"కన్యా శుల్కం" వంటిదే "వరవిక్రయం" కూడాను. వరవిక్రయం గూర్చి కాళ్ళకూరివారు వ్రాసిన నాటకం చాలా ప్రసిద్ధిని పొందింది. 'కవిరాజు' త్రిపురనేని రామస్వామి, తెలుగు దేశంలొ మూఢ విశ్వాసములపై దాడిచేసి కుల మత, జాతి విచక్షతను నేలల మట్టముగావించుటకు తన రచనలద్వారా, సంస్కరణోద్యమమునకు కృషి చేశారు. ఆర్థిక విధానమునను సరించి వివాహపద్ధతివుండవలెననీ, వివాహము దైవ నిర్ణయముగా భావింపరాదనీ, ప్రజలకు తెలిసిన భాషలో వివాహ విధానముండవలెననీ ప్రబోధించారు.

కవిరాజు భావప్రదానమును కొనసాగించినవాడు ఆవుల గోపాలకృష్ణమూర్తి. వర్ణాంతర వివాహమును ప్రోత్సహించాడు. తన పెండ్లినాడే సహపంక్తి భోజనము చేయించాడు. కాలక్రమాను గుణంగా, భావపరిణామం జరగాలని దృఢపరిచారు.

కాలానుగుణంగా మారుతూ, కడవరకు పెరిగిన ధన్యజీవి తాపీ ధర్మారావు. అనేక గ్రంథ రచనలద్వారా సాంఘిక దురాచారాలను బట్టబయలుచేసిన మానవతావాది. "దేవాలయములమీద బూతు బొమ్మలెందుకు?" "పెళ్లి దాని పుట్టు పూర్వోత్తరాలు" మొదలగు గ్రంథములద్వారా సమాజంలో కనువిప్పు కలిగించాడు.

వందలాది వర్ణాంతర వివాహాలుచేసి, హరిజనోద్ధరణకు, సాంఘిక పురోభివృద్ధికి తన జీవితాన్ని అంకితం చేశాడు శ్రీ అరిగే రామస్వామి ; వారి పిల్లలకు వర్ణాంతర వివాహాలు చేశారు. వీరు సికిందరాబాదు నాస్తవ్యులు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వములో సాంఘిక సంక్షేమ మంత్రిగా పనిచేశారు.

మహాత్మగాంధీ అడుగుజాడల్లో సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొన్న స్వాతంత్ర్యయోధుడు శ్రీ ఫ్రాంక్లిన్ రాం మహమ్మద్. మానవులంతా ఒకటే జాతి అంటూ, మతసహనమూ, మత సామరస్యము, సర్వమానవ సౌభ్రాతృత్వమునకు చిహ్నంగా తన పేరును పెట్టుకున్నారు.

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత, సమసమాజ నిర్మాణం అచిరకాలంలో జరుగుతుందని అందరూ ఆశించారు. కాని ఎన్నో అవాంతరాలువచ్చాయి. ఆశాభంగాలు ఎదురయినాయి. స్వాతంత్ర్యం రాకపూర్వం, యువతరంలో తీవ్రంగా కనిపించిన ఆవేశనా, పట్టుదలా, ఒక ఆదర్శం కోసం అంకితమైపోదామనే తపనా, సంఘటిత కృషీ, స్వేచ్ఛా భారతంలో, క్రమక్రమంగా, లోపించి పోతూవుండటమే సాంఘిక సంస్కరణోద్యమాలు సత్వర ఫలితాలను సాధించలేకపోవడానికి కారణం.

సంఘంలోని అసమానతలు, మూఢనమ్మకాలు, బాహ్యాడంబరాలు, కర్మకాండలు, స్వార్థప్రచారాలు కొనసాగుతూనే వున్నాయి. బాబాలు, యోగులు, శక్తి సంపాదనకు నరబలులూ, మహిమలకు పూజా పునస్కారాలు, రోజు రోజుకూ వృద్ధి కావటం జరుగుతూనే ఉన్నది. హృదయశుద్ధి మాత్రం కనబడటంలేదు. ఆధ్యాత్మికత పేరిట కర్మకాండ, బూటకాలు కొనసాగిపోతూనేవున్నాయి. స్వార్థపరుల ఆటలు నిరాటంకంగా సాగుతూనేవున్నాయి. చిత్తశుద్ధి లేని శివపూజలు, భాండశుద్ధిలేని పాకాలు వ్యర్థమని వేమన్న ఏనాడో హెచ్చరించాడు.

గోరా హేతువాదం

చిత్తశుద్ధివుంటేచాలు శివపూజ అక్కరలేదని, కీ. శే. గోపరాజు రామచంద్రరావుగారు (గోరా) హెచ్చరించారు. స్వాతంత్ర్యా

నంతరం కొత్త ఆశయాలతో, ఆదర్శాలతో గోరా సంఘసంస్కరణోద్యమాన్ని నిర్విరామంగా కొనసాగించారు. సర్వానర్థాలకు, హేతువాదానికి నిలువజాలని నమ్మకాలే మూలమని ఆయన గాఢ విశ్వాసం. మనిషినే దేవుడుగాచూడటమే నాస్తికత్వ సారాంశం. "మనిషిచేసిన రాయి రప్పకు మహిమకలదని సాగి మొక్కుతూ మనిషినే కనిష్టంగా చూస్తావేల?" అని గురజాడ ప్రశ్నించినట్లు, గోరా కూడా, సాంఘిక అసమానతలకు జన్మ, పునర్జన్మలూ, కర్మ సిద్ధాంతాలు, కొట్టివేయడానికి నాస్తికత్వ ఉద్యమాన్ని ప్రబోధించారు. శ్రీ గోరాగారు, సామాన్య హరిజనునకు తన కుమార్తెనిచ్చి, వివాహంచేసి, హరిజనుడని పిలువబడే 'కవిరాజు' గుర్రం జాషువా గారి కుమార్తెను కోడలిగాచేసికొని, ఆదర్శాలను అమలు జరిపి చూపించారు. శ్రీ గోరాగారు ఎన్నో సాంఘిక దురాచారాలను గర్హిస్తూ, ప్రపంచంలో నాస్తిక వాద స్థాపనకు అగ్ర తాంబూలాన్ని పుచ్చుకొని ప్రపంచ నాస్తిక సభలు జరిపి హేతువాదాన్నీ, మానవతనూ, బలపరుస్తూ, సాంఘిక విప్లవ నాయకులుగా వర్ధిల్లారు. పూలదండల బదులు కాయగూర దండలు మంచివనీ తద్వారా కాయగూరల అభివృద్ధిని సూచిస్తూ, పంది మాంసం, గొడ్డుమాంసం భక్షణ ఉద్యమాలు జరిపీ, వివిధ ఆహార పద్ధతులూ, మతాలూ, మానవులను విడదీసే శక్తులుగా పనిచేయరాదనీ చాటి చెప్పుతూ, సర్వమానవ సామరస్యానికీ, సౌభాగ్యానికీ, నిరంతరం కుటుంబ సభ్యులతో సహా కృషిచేశారు.

కుల నిర్మూలనోద్యమం

ఆంధ్ర దేశంలో ఇటీవలి కాలంలో కుల నిర్మూలనోద్యమం చురుకుగా పని చేస్తున్నది. కుల వ్యవస్థను నిర్మూలించే ధ్యేయంతో, 1971 వ సంవత్సరంలో కుల నిర్మూలన సదస్సు ఫలితంగా "ఆంధ్రప్రదేశ్ కుల నిర్మూలన సంఘం" స్థాపించబడింది కుల, వర్గ, వర్ణ విచక్షతల కతీతంగా, నవసమాజ దృక్పథంతో, యువతీ యువకులు ముందుకు వస్తుంటే, వారిని ప్రోత్సహించటమే కాక, ఆ ఆశయ సిద్ధికోసం ఈ సంఘం కృషి చేస్తున్నది. వివిధ కులాలనబడే వాటి మధ్య ఇచ్చిపుచ్చుకోవటాలు ఇతోధికంగా కొనసాగితేకాని కుల దృక్పథం సమసిపోదనీ, ఈ విధంగా కుల చిహ్నమయిన నామానుబంధాలు, అంటే రెడ్డి, శాస్త్రి, నాయుడు, మొదలైనవి కూడా పాటించకపోతే, క్రమక్రమంగా, కులరహిత సమాజం ఏర్పడుతుందనేది కుల నిర్మూలన సంఘ పరమాశయం.

సంఘం స్థాపించిన అనతికాలంలోనే 1972 వ సంవత్సరంలో ప్రభుత్వం కూడా ముందుకు వచ్చి అప్పటి సాంఘిక సంక్షేమశాఖ మంత్రి శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారి ప్రోత్సాహ ఆధ్వర్యబలంతో చారిత్రాత్మక మైన సాంఘిక సంస్కర్తల సదస్సు రాష్ట్ర స్థాయిలో జరుపబడ్డది. దేశంలో యిటువంటి సదస్సు జరగడం యిదే మొదటిసారి. కులాంతర, మతాంతర వివాహాలను పరి పరి విధాల ప్రోత్సహించాలనీ, స్త్రీ విద్య, అభ్యుదయ కార్యక్రమాలు, వితంతు, పతిత స్త్రీ ఉద్ధరణ కార్యక్రమాలు కుల ప్రసక్తి లేకుండా ఆర్థికంగా, సాంఘికంగా బలహీనంగా వున్న వర్గాలన్నింటి ఉద్ధరణా జరగాలనీ, ఒకే కులంలో వివాహాలను నిషేధించాలనీ కూడా యీ సదస్సు గట్టి అభిప్రాయాలను వ్యక్తంచేసింది.

ప్రఖ్యాత సాంఘిక సంస్కర్త కందుకూరి వీరేశలింగంగారి 125 వ జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించింది. ఆయన ముఖ చిత్రంతో తపాలా బిళ్లలు కూడా 15-7-1974 వ తేదీన కేంద్రప్రభుత్వం విడుదలచేసి సంఘ సంస్కరణలయెడల, తన ప్రగాఢ విశ్వాసాన్ని వ్యక్తపరచింది. ఆ సందర్భంలో వర్ణాంతర వివాహం చేసికొన్న దంపతులను రాష్ట్రప్రభుత్వం సన్మానించి ఒక కులాంతర వివాహం కూడా జరిపింది. వర్ణాంతర వివాహం చేసికొన్న రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి శ్రీ భాట్టం శ్రీరామమూర్తిగారు గూడా సన్మానింపబడ్డారు.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు గారి ప్రభుత్వం, కులాంతర, మతాంతర వివాహాలు చేసికొన్న దంపతులకు నగదు బహుమతులు, తదితర ప్రోత్సాహక వసతులు 15-7-74 తేదీ నుంచి కలుగజేస్తూ కుల నిర్మూలనోద్యమానికి చేయూత నిస్తున్నది. సాంఘిక సంక్షేమ మంత్రి శ్రీ భాట్టం శ్రీరామమూర్తి గారు ఈ ఉద్యమానికి ఎంతో సహకారాన్ని, చేయూతను ఇస్తున్నారు. కుల నిర్మూలన సంఘం రేడియో ప్రసంగాలు, వార్తా పత్రికలలో వ్యాసాలు, కరపత్రాలు, సభలు, సమావేశాలు మొదలైన ప్రచార సాధనాలద్వారా సాంఘిక విప్లవాన్ని కొనసాగిస్తున్నది. ఈ మూడు సంవత్సరాలలోనే రాష్ట్రంలో పది జిల్లాలలో జిల్లా సంఘాలు ఏర్పడి దాదాపు 50 వర్ణాంతర వివాహాలు జరుపబడినవి. కులాంతర, మతాంతర వివాహాలు చేసికొన్న యువతీ యువకులకు సంఘం అండదండలనిస్తున్నది. బస్సులు, రైళ్ళు, సినిమాలు, కాఫీహోటళ్ళు, మొదలైన ఆధునిక సామాజిక సౌకర్యాల వల్ల అంటరానితనాన్ని చాలావరకు అరికట్టినా, అంటరానితనం పాటించేవారిని, చట్టాలద్వారా శిక్షార్హులను చేసినా, ప్రజల మానసిక దృక్పథాలలో ఎంతో మార్పు రావలసి వుంది. ప్రభుత్వం కూడా ప్రత్యేక హరిజన కాలనీలు నిర్మించే పద్ధతి విడిచిపెట్టి మిశ్రిత గృహవసతులు అన్ని బడుగు వర్గాల ప్రజలకూ ఏర్పరచాలి. ప్రభుత్వ కార్యకలాపాలు మత ప్రమేయం లేకుండా సాగాలి.

మానసిక పరివర్తనకు మూఢ విశ్వాసాలను, మూఢనమ్మకాలను పోగొట్టడానికి యువతీ యువకులు, పెద్దలైనవారు, వెనుకబడిన వివిధ సంఘాలు సంస్కరణాభిలాషులంతా సంఘటితంగా కుల నిర్మూలన, స్త్రీల అభ్యుదయం వివిధ మతాల సామరస్యం, సాంఘిక దురాచార నిర్మూలన, సర్వమానవ సౌభ్రాతృత్వం పెంపొందించే యీ చారిత్రాత్మకమైన సాంఘికోద్యమాలను దేశం నలుమూలలా వ్యాపింపచేయటానికి సర్వ విధములా కృషి చేయాలి.

జైన మత మహాప్రవక్త

శ్రీ మహావీర స్వామి

—శ్రీ కల్యాణసింగ్

జైన మతాన్ని స్థాపించినవాడు వర్ధమాన మహావీరుడనే అభిప్రాయం లోకంలో సర్వసామాన్యంగా వ్యాపించి ఉంది, కాని జైనమతం అన్నది అనాదినుంచీ ఉన్నదని జైనుల విశ్వాసం.

సత్యాన్ని ఒక నిర్దిష్ట కాలంనుంచి జాడపట్టడం సాధ్యం కాదు. కనక జైనమతం ఏదో ఒక కాలానికి పరిమితం కాదని వారి ఉద్దేశం. జైనమతం ఏ ఒక్కరు కాని స్థాపించినట్టిది కాదు. దానిని ఉద్ధరించి ప్రపంచింప జేసినవారు ఇరవైనలుగురు తీర్థంకరులు. ఈ తీర్థంకరులలో చివరివాడు వర్ధమాన మహావీరుడు. ఇరవైమూడవ తీర్థంకరుడు పార్శ్వనాథుడు. మహావీరునికి రెండు శతాబ్దులకు పూర్వం ఉండినవాడు. ఇరవై రెండవ తీర్థంకరుడు అరిష్టనేమి. శ్రీ కృష్ణుని బంధువు. ఆయన కలియుగా రంభంలో ఉండినవాడు. ఇక మొదటి తీర్థంకరుడు ఋషభదేవుడు. ఆయన కృతయుగారంభంలో ఉండినవాడని జైనుల నమ్మకం. చారిత్రికాధారాలు గల జీవిత వివరాలు మనకు లభ్యంగా ఉన్నది చరమ తీర్థంకరుడైన మహావీరునికి సంబంధించి మాత్రమే.

తీర్థంకరులు

'తృ' ధాతువుతో 'థ' ప్రత్యయం కలిసి 'తీర్థ' శబ్దం ఏర్పడింది. తీర్థంఅంటే దాటించేది అని అర్థం. తీర్థంచేసే(స్థాపించే)వాడు తీర్థంకరుడు. అంటే ప్రాణులను సంసార దుఃఖ సాగరాన్ని దాటించేవా డన్నమాట. అసంఖ్యాక జన్మల శ్రమ, యోగసాధన ఫలితంగా లభించే పదవి అది. తీర్థంకరులు అగురూపదేష్టలు. అంటే ఏ గురువు దగ్గరా ఉపదేశం పొందినవారు కారు, వారు జీవన్ముక్తులు. వారి ఆత్మ సచ్చిదానంద శుద్ధం. వారి శరీరం కూడా శుద్ధం. వారి అంతరంగంలో రాగ ద్వేషాది వికారాలు ఉండవు. ఇరవై నలుగురు తీర్థంకరుల పేర్లు ఇవి: ఋషభదేవుడు, అజిత నాథుడు, సంభవనాథుడు అభినందనుడు, సుమతి నాథుడు, పద్మప్రభువు, సుపార్శ్వుడు, చంద్రప్రభువు, సువిధినాథుడు, శీతలనాథుడు, శ్రేయాంసుడు, వాసుపూజ్యుడు, విమలనాథుడు, అనంతనాథుడు, ధర్మనాథుడు, శాంతినాథుడు, కుంతునాథుడు, అరనాథుడు, మల్లినాథుడు, మునిసువ్రతుడు, నమినాథుడు, అరిష్టనేమి, పార్శ్వనాథుడు, మహావీరస్వామి.

త్రిరత్నాలు

వీరు ప్రవచించిన మత సిద్ధాంతాలు త్రిరత్నాలు, అవి సమ్యక్ దర్శనం, సమ్యక్ జ్ఞానం, సమ్యక్ చారిత్ర్యం. సృష్టి స్థితి లయ కారకుడైన ఒక దేవుడున్నాడని జైనమతం అంగీకరించదు. జినులే (జయించినవారు) ఆరాధ్యులు. జినులే ముక్తిమార్గాన్ని కనిపెట్టి సాధించినవారు. వారే శరణ్యులు. జినులు సాధారణ మానవులే, దృఢ సంకల్ప శక్తి వల్ల కర్మ బంధాలనుంచి విముక్తి పొందినవారు. అలాంటి జినుడే తీర్థంకర మహావీరుడు.

ముక్తిని సాధించడానికి సమ్యక్ జ్ఞానం అవసరం. ఇందులో ఐదు దశ లున్నాయి. ఇంద్రియాలద్వారా గ్రహించేశక్తిని 'మతి' అంటారు. ఇంద్రియాలద్వారా గ్రహించిన అంశాలనుంచి కలిగే స్పష్ట జ్ఞానం 'శ్రుతి', తరవాత 'అవధి' జ్ఞానం. దీనివల్ల దూరాన్న ఉన్న విశేషాలనూ, భవిష్యద్విషయాలనూ తెలుసుకోవచ్చును. నాల్గవది 'మనః పర్యాయం'—పరుల భావాలను తెలియజేసే జ్ఞానం. ఐదవది 'కేవల జ్ఞానం'. (సర్వజ్ఞత్వం). దీనిని సాధించినవారే జినులు

ఇక సమ్యక్ చారిత్ర్యం. సమ్యక్ జ్ఞానం వల్ల ముక్తి మార్గం లభిస్తుంది. సమ్యక్ చారిత్ర్యంవల్ల ముక్తి సిద్ధిస్తుంది. ఇందులోని అంశాలు ఐదు—అహింస, సత్యం, వస్తేయం (ఇతరులు తనకు ఇవ్వని దానిని తీసుకోక పోవడం), బ్రహ్మచర్యం, అపరిగ్రహం (ఆస్తిని కలిగి ఉండకపోవడం).

స్యాద్వాదం

జైన మతానికి విశిష్టత కలిగించే సిద్ధాంతం స్యాద్వాదం. 'స్యాత్' అనే సంస్కృత అవ్యయానికి 'ఐ ఉండవచ్చును' అని అర్థం. అది సంభావ్యతను తెలియజేస్తుంది. సుప్రసిద్ధ వైజ్ఞానికుడు ఐన్‌స్టైన్ సాపేక్షతా సిద్ధాంతం (రెలేటివిటి థియరి) ప్రతిపాదించాడు. అది భౌతిక శాస్త్ర రంగంలో విప్లవం తెచ్చిపెట్టింది. "మనం సాపేక్షిక సత్యాన్ని మాత్రమే తెలుసుకోగలం. సంపూర్ణ సత్యాన్ని తెలిసిన వాడు విశ్వద్రష్ట మాత్రమే"—అన్నాడు ఐన్‌స్టైన్. ఈ సిద్ధాంతాన్ని సరళంగా బోధ పరచడానికి ఐన్‌స్టైన్ హాస్య ధోరణిలో ఇలా అన్నాడు: "ఒక పురుషుడు తన ప్రియురాలితో మాట్లాడుతూ ఉంటే ఒక గంట ఒక నిమిషం లాగా తోస్తుంది. కాలుతున్న పొయ్యిమీద కూర్చున్న మనిషికి ఒక నిమిషం ఒక గంటలాగ అనిపిస్తుంది. ఇదే, సాపేక్షతా వాదం."

సాపేక్షతా వాదాన్నే వేల సంవత్సరాల పూర్వం జైనమతం ఆధ్యాత్మిక రంగంలో స్యాద్వాద రూపంలో ప్రతిపాదించింది.

యథా అనామికాయాః కనిష్ఠా మధికృత్య దీర్ఘత్వం మధ్యమా మధికృత్య హ్రస్వత్వమ్. చిటికెన వ్రేలూ, ఉంగరపు వ్రేలూ చూపెట్టి ఇందులో ఏది పెద్దది అంటే ఉంగరపు వ్రేలు అంటాము. మధ్యవ్రేలూ, ఉంగరపువ్రేలూ చూపెట్టి ఏది పెద్దది అంటే మధ్యవ్రేలు పెద్దది అంటాము. ఇందాక పెద్దది అన్న ఉంగరపు వ్రేలే ఇప్పుడు చిన్నది అంటున్నాము అది పెద్దది అనడం సత్యమా ? చిన్నది అనడం సత్యమా ? రెండూ సత్యాలే కాని అవి సాపేక్షిక సత్యాలు మాత్రమే.

ప్రతి వస్తువు విషయంలోనూ స్వపర ద్రవ్య క్షేత్ర కాల భావాలనుబట్టి 'అవును' అనవచ్చును. 'కాదు' అనవచ్చును. ఈ పాత్ర మట్టితో చేసిందా ? అవును. బంగారంతో చేసిందా ? కాదు. ఇది హైదరాబాదులో చేసిందా ? కాదు. విశాఖపట్నంలో చేసిందా ? అవును. బంగారంతో చేసిందా ? కాదు మట్టితో చేసిందా ? అవును. ఇది వేసవిలో చేసిందా ? అవును. శీతా కాలంలో చేసిందా ? కాదు.

ఉత్పత్తి వ్యయ ద్రవ్య యుక్తం సత్. ఉత్పత్తి వినాశ ద్రవ్యతాది విరుద్ధ లక్షణాలు ఒకే వస్తువులో ఎలా కపిపిస్తున్నాయి ? ఒక స్వర్ణకారుడు బంగారు కలశాన్ని విరగగొట్టి బంగారు కిరీటం చేస్తున్నాడనుకొందాం. అక్కడికి ముగ్గురు వ్యక్తులు వచ్చారు. ఒకనికి స్వర్ణ కలశం కావాలి. అతనికి విచారం కలిగింది తనకు కావలసిన కలశం నాశం అవుతూవుంది కదా అని. రెండవ వానికి కిరీటం కావాలి. అతనికి సంతోషం కలిగింది తనకు కావలసినది ఉత్పత్తి అవుతూ ఉంది కదా అని. మూడవవానికి వట్టిబంగారమే కావాలి. అది కలశమైనా, కిరీటమైనా బంగారమే కనక అతనికి మధ్యస్థభావం.

అనంత ధర్మాత్మకం సత్. వస్తువు అనేక ధర్మాలతో కూడినది. దానిని చాలా దృక్కోణాల నుంచి చూడవచ్చును. మనం ఒక వస్తువుయొక్క ఒక భాగాన్ని మాత్రమే చూడ గలుగుతాం. అప్పుడు మన దృశ్యం, మన పరిశీలనం, పాక్షికమూ, తాత్కాలికమూ మాత్రమే అవుతుంది. ఏనుగు, గుడ్డివాళ్ళ కథ ఇందుకు ఉదాహరణం. చెవులు తడివినవాడు ఏనుగు చేటలాగ ఉందంటాడు. కాలు తాకినవాడు స్తంభంలాగ ఉందంటాడు. ఏది నిజం ? రెండూ సత్యాలే. కాని పాక్షిక సత్యాలు. ఏదీ సమగ్ర సత్యం కాదు. సంసార జీవులు పాక్షిక సత్యాన్ని మాత్రమే గ్రహించగలరు. ముక్త జీవులకే కేవల (సంపూర్ణ) జ్ఞానం, కేవల (సంపూర్ణ) దర్శనం సిద్ధిస్తాయి.

విశ్వంలో రెండు తత్వాలు

ఈ విశ్వంలో రెండు తత్త్వాలు ఉన్నాయి—జీవ తత్త్వం: అజీవ తత్త్వం. జీవ తత్త్వం చైతన్య సహితం; అజీవతత్త్వం చైతన్య రహితం. అజీవతత్త్వ సంపర్కం వల్లనే జీవ తత్త్వానికి బంధం కలుగుతుంది. కర్మ అజీవ తత్త్వం. జీవ సహజమైన లక్షణం పైకిపోవడం. కర్మాణువులు జీవుని క్రిందికి లాగుతూ ఉంటాయి. కర్మాణువులు తొలగిపోయే కొలదీ జీవి తేలికఅయి పైకి తేలుతుంది. కర్మ నిశ్శేషమైపోయినప్పుడు జీవ సిద్ధి క్షేత్రాన్ని చేరుతుంది. అదే నిర్వాణం, అప్పుడు జనన మరణాలు ఉండవు. అఖండానందమే.

శుభ కర్మల వల్ల పుణ్యమూ, అశుభ కర్మల వల్ల పాపమూ కలుగుతాయి. పుణ్యాలు హెచ్చే కొలదీ సుఖం హెచ్చుతుంది. పాపం వృద్ధి పొందేకొలదీ దుఃఖ వృద్ధి పొందుతుంది. పాపమూ, పుణ్యమూ రెండూ నిశ్శేష మైపోయినప్పుడు ఆత్మకు ముక్తి కలుగుతుంది. ' కర్మ జీవిలోనికి ప్రవేశించడం ఆస్రవం ఆ కర్మను ప్రవేశించకుండా అరికట్టడం సంసరం. ఇదివరకే నిలవ ఉన్న కర్మను తోడివేయడం నిర్జర, శుభ కర్మల వల్ల సంసరాన్ని, తపశ్చర్య వల్ల నిర్జరనూ సాధింపవచ్చును.

జైన సిద్ధాంతాన్ని క్లుప్తంగా చెప్పాలంటే: జీవాజీవ సంపర్కం వల్ల కొన్ని శక్తులు ఉద్భవించి జనన మరణాలకూ, సుఖ దుఃఖాలకూ, వివిధ అనుభవాలకూ కారణం అవుతున్నాయి. సదాచారం వల్లా, తపశ్చర్య వల్లా ఈ సంసార క్రమాన్ని నాశనం చేసి ముక్తిని పొందవచ్చును.

ఆత్మాస్తి కర్మాస్తి పరాభవోస్తి
మోక్షోస్తి తత్సాధక హేతురస్తి
ఇత్యేవ మంతఃకరణే విధేయా
దృఢ ప్రతీతి సువిచారణాభిః

ఆత్మ ఉంది. (అది శరీరంకంటె భిన్నమైనది.) కర్మ ఉంది. కర్మ ఆత్మను ఆక్రమిస్తుంది. మోక్షం ఉంది. దాన్ని సాధించే మార్గం ఉంది. ఈ విషయాలను మనస్సులో పర్యాలోచన చేసి దృఢ విశ్వాసాన్ని పొందడమే కర్తవ్యం.

మహావీరస్వామి

జైన మతాన్ని ఉద్ధరించిన అంతిమ తీర్థంకరుడు మహావీర స్వామి. ఆయన క్రీస్తుపూర్వం 599లో జన్మించాడు. ఆయన తండ్రి కుండగ్రామ ప్రభువైన జ్ఞాతృక క్షత్రియరాజు సిద్ధార్థుడు. తల్లి త్రిశలా ప్రియకారిణి, వైశాలి ప్రభువైన చేటకుని కుమార్తె. ఆయన జననం చైత్ర శుద్ధ త్రయోదశి సోమవారం రాత్రి ఉత్తర ఫల్గుణీ నక్షత్రంలో. తల్లి దండ్రులు పెట్టిన పేరు వర్ధమానుడు. ఆ శిశువు గర్భంలో పడినప్పటినుంచీ రాజమందిరంలోనూ, నగరంలోనూ, రాజ్యంలోనూ ధనధాన్యాలు వృద్ధిపొందాయి. కనుక వర్ధమానుడని పేరు పెట్టారు.

విద్యాభ్యాస కాలంలోనే వర్ధమానుడు జైనేంద్ర వ్యాకరణం రచించాడు. ఒకనాడు ఒక బ్రాహ్మణుడు వచ్చి బాలునిదగ్గర తన సందేహాలు తీర్చుకొన్నాడు. అప్పుడు ఆ బ్రాహ్మణుడన్నమాటలు ఇవి:

ఆ బాల కాలా దపి మామకీనాన్
యాన్ సంశయాన్ కోపి నిరాసయన్న
బిభేద తాన్సా న్నిఖిలాన్ సఏవ
బాలోపి భోః పశ్యత చిత్ర మేతత్

"చిత్రం చిన్ననాటినుంచీ నాకు ఉండిన సందేహాలను-మరెవ్వరూ తీర్చలేని వాటిని-బాలుడైనా ఇతడు తీర్చివేశాడు."

యుక్తవయస్సు వచ్చిన తరవాత వర్ధమానునికి యశోదా రాజకుమారితో వివాహం జరిగింది. ఆమె తండ్రి వసంతపుర ప్రభువు సమరవీరుడు తల్లి పద్మావతి. వర్ధమానునికి ఒక పుత్రిక కలిగింది. ఆమెపేరు అనోజ్ఞ.

వర్ధమానునికి ఇరవై ఎనిమిదేళ్ళ వయస్సులో తల్లిదండ్రులు గతించారు. వర్ధమానుడు రాజ్యం చేయడానికి సమ్మతించక సోదరుడు నందివర్ధనుని సింహాసనాసీనుని చేశాడు. ఒక ఏడాది ఐన తరవాత సన్యాస దీక్ష తీసుకొన్నాడు. సిద్ధులందరికీ నమస్కారం చేసి సర్వ నిరతి సామాయిక వ్రత సూత్రాన్ని పఠించాడు.

కరేమి సామాయియం సవ్వం సావజ్జం, జోగం పచ్చక్ఖామి జీవజ్జీవాయే తివిహం తివిహేణం. "నేను సన్యాస దీక్ష గ్రహిస్తున్నాను. జీవిత పర్యంతం మనోవాక్కాయాలద్వారా పాపంచేయను. ఇతరులచేత చేయించను. ఇతరులు చేసిన పాపాలను సమ్మతించను."

దీక్ష స్వీకరించిన తరవాత ఏ ఒక్క గ్రామంలోకాని ఒక రాత్రికి మించీ ఏ ఒక్క పట్టణంలో కాని ఐదు రాత్రులకు మించీ ఉండలేదు. వర్షాకాలంలో చాతుర్మాస్యం మాత్రం ఒకేచోట గడిపేవాడు. ఆయన తపస్సు చేసిన కాలం పన్నెండు సంవత్సరాలు. ఆయన పన్నెండు చాతుర్మాస్యాలు జరిపిన స్థానాలు ఇవి: అస్థిక గ్రామం, నాలంద, చంపానగరి, పృషచంప, భదిల్లనగరి, భద్రికా నగరి, ఆలంబిక, రాజగృహం, వజ్రభూమి, శ్రావస్తి, వైశాలి, చంపాపురం.

ఉపద్రవ నిరసనం

దీక్షాకాలంలో ఆయనకు సంప్రాప్తమైన బాధలు ఇన్నీ అన్నీకాదు. సంగమకుడనే దుష్టదేవత ఒక్కరాత్రి ఆయనను ఇరవై విధాల యాతన పెట్టాడు. దుమ్ము మేఘాలుగా వచ్చి మహావీరుని కప్పివేసింది. చీమలు ఆయన శరీరంలో ఒకచోట ప్రవేశించి మరొకచోటినుంచి బయటికి వచ్చేవి. పెద్ద పెద్ద దోమలు శరీరమంతా కరవడంవల్ల రక్తం కాలవలుగా ప్రవహించింది. తరవాత చీమలు వచ్చి రక్తం పీల్చాయి. తేళ్లు కుట్టాయి. ముంగిసలు మాంసాన్ని ముక్కలు ముక్కలుగా కొరికాయి పాములు పడగలతో కొట్టి పళ్ళతో కరిచాయి. చుంచులు ఒళ్ళు బరికి పుండ్లమీద మూత్రం పోశాయి. ఒక ఏనుగు వచ్చి దంతాలతో పొడిచింది. ఇంకొక ఏనుగువచ్చి తొండంతో నీళ్ళవర్షం కురిపించింది. ఒక రాక్షసి పదునైన కత్తి తీసుకొని బాధపెట్టింది. ఒక పులి దంతాలతో, గోళ్లతో హింసించింది. మహావీరుని తల్లి దండ్రులు కవబడి ఆయన కష్టాలకు దుఃఖపడి ఇంటికి తిరిగి రమ్మన్నారు. కొందరు మనుష్యులు వచ్చి మహావీరుని పాదాలమీద పొయ్యిపెట్టి నిప్పు రాజేశారు. ఒక చండాలుడు వచ్చి పక్షులచేత పొడిపించాడు. తుఫాను వీచి మునిని నేలకువేసి కొట్టింది. సుడిగాలి ఆయనను గిరగిరా తిప్పింది. ఒక కాలచక్రం నిప్పులు గ్రక్కుతూ ఆయనమీద బడబాగ్నిలాగ వచ్చిపడింది. సంగమకుడు విమానంలో వచ్చి మహావీరుని తపస్సుకు మెచ్చుకొని వరం కోరుకోమన్నాడు చివరికి అప్సరసలు ప్రత్యక్షమైన ఆయనకు మన్మథ వికారం కలిగించడానికి ప్రయత్నం చేశారు. ఏమీ ప్రయోజనం లేకపోయింది. మహావీరుడు లొంగలేదు. ఆయన సహిష్ణుతా శీలత అద్వితీయం. అందుకే ఆయన శ్రమణుడు.

ఆయన తపస్సు చేసిన రోజులు 3,645, ఆకాలంలో ఆయన స్వల్పాహారం చేసినది 349 రోజులు నిద్రపోయినది రెండు గడియలు. ఆయన ఈ దీక్షకాలంలో ఉత్కటాసనంలో ఉండేవాడు— అంటే. ఆవునకు పాలు పితుకుతున్న భంగిమలో.

పన్నెండేళ్ళపాటు కఠినాతి కఠినమైన తపస్సుచేసిన తరవాత వైశాఖ శుద్ధ దశమినాడు జృంభక గ్రామంలో ఋజువాలుకా నదీతీరంలో శ్యామకుడనే గృహస్థుని పొలంలో సాలవృక్ష ఛాయలో మహావీర స్వామికి కేవలజ్ఞానం సిద్ధించింది. ఆయన జినుడు (రాగద్వేషాలను జయించినవాడు) అయ్యాడు. ఆయన ఇప్పుడు సర్వజ్ఞుడు, సర్వదర్శి.

జిన భగవానుడు మహావీరస్వామి ఆ తరవాత ముప్పై ఏళ్ళపాటు జైన ధర్మప్రచారం చేశాడు. ఇంద్రభూతి, అగ్నిభూతి, మండిత పుత్రాది ప్రఖ్యాత విద్వాంసులు ఆయన శిష్యులయ్యారు. ఆయన ఉపదేశం జాతి వర్ణభేదం లేకుండా అందరికీ లభించింది. బింబిసార నందవర్ధన చండ ప్రద్యోతన చేటక ఉదయన ప్రసేన్న చంద్రాధి నరపతులు కూడా మహావీర శిష్యులయ్యారు.

నిర్వాణం

మహావీరుడు ముప్పైఏళ్ళు గృహస్థ ధర్మం నిర్వహించాడు. పన్నెండేళ్ళకు పైగా అనన్య సాధ్యమైన తపోనిష్ఠలో గడిపాడు. ఆ పిమ్మట ముప్పై ఏళ్ళపాటు ధర్మ ప్రచారం చేశాడు. ఆయనకు డెబ్బైరెండేళ్ళ వయస్సు అయిపోయింది.

ఆనాడు కార్తిక బహుళ అమావాస్య. స్వాతీ నక్షత్రం పావాపురంలో శిష్యులకు ధర్మోపదేశంచేస్తూ మహావీరస్వామి నిర్వాణధామం చేరుకొన్నాడు మహాజ్ఞాన జ్యోతి కొండెక్కింది.

జ్వలత్ప్రదీపాలికయా ప్రవృద్ధ్యా
సురాసురై దీపితయా ప్రదీప్తయా
తదాస్మ పావానగరీ సమంతతః
ప్రదీపి తాకాశతలా ప్రకాశేత్

ఆ సమయంలో సురాసురులు దేదీప్యమానంగా దీపాలు వెలిగించారు. పావాపురి శోభాయమానంగా ఉంది. ఆకాశమంతా ప్రకాశమానం అయింది.

ఏనాటికైనా శ్రమణ భగవానుడు వెలిగించిన అహింసా జ్యోతియే అఖిల ప్రపంచానికి ఆశాజ్యోతి.

ఆత్మ వత్ సర్వభూతేషు
సుఖ దుఃఖే ప్రియాప్రియే
చింతయ న్నాత్మనోనిష్టాం
హింసా మన్యస్య నాచరేత్.

సుఖ దుఃఖాలు, యిష్టానిష్టాల విషయంలో సర్వ భూతాలనూ తనవలెనే భావించి హింస తనకు అసహ్యమైనందున అట్టి హింసను తాను ఇతరులకు చేయకపోవడమే ధర్మం.

వార్తావాహిని

గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సౌకర్యాలు

అలోపతీ డాక్టర్లు తప్పనిసరిగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం చేసేందుకు వీలు కల్పిస్తూ కొద్ది రోజుల్లోనే ఒక ఆర్డినెన్సును జారీ చేయనున్నారు. సర్వసాధారణంగా అలోపతీ వైద్యులు గ్రామీణ ప్రాంతాలకు పోవటానికి యిష్టపడక పోవటంచేత, త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం చట్టరీత్యా ఒత్తిడి తెచ్చి గ్రామీణ ప్రాంతాల్లో యీ వైద్యసదుపాయం కలుగ జేయనున్నదని యిటీవల ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు తెలియజేశారు. రెండు లక్షల రూపాయల మేరకు విరాళమిచ్చి గ్రామీణ ప్రాంతాల్లో ఆసుపత్రిని నిర్మించేందుకు ఎవరైనా ముందుకు వస్తే సిబ్బంది నియామకానికీ, తదితర సౌకర్యాలకు అయ్యే ఖర్చును ప్రభుత్వం భరించటానికి సిద్ధంగా వుందన్నారు ముఖ్యమంత్రి.

వచ్చే ఐదేళ్ళలో అన్ని జిల్లాల్లోనూ ఆశ్రమ పాఠశాలలు

గిరిజన బాలురకోసం యిటీవల స్థాపించినది గాక, రాష్ట్రంలో సర్వేల్, తాడికొండ, హిందూపూర్‌లలోని మూడు ఆశ్రమ పాఠశాలలూ కూడా అత్యంత ప్రశంసనీయంగా పనిచేస్తూ, శ్లాఘనీయమైన ఫలితాలను అందిస్తున్నదృష్ట్యా యిటువంటివే ఆశ్రమ పాఠశాలలను రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ స్థాపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వచ్చే అయిదేళ్ళలోనూ వీటిని స్థాపిస్తారు. రాష్ట్రంలో ప్రాంతానికి ఒక ఆశ్రమ పాఠశాల వంతున ఏటేటా మూడేసి పాఠశాలలు స్థాపిస్తారు. ఆశ్రమ పాఠశాల వలెనే నిర్వహింపబడే జూనియర్ కళాశాలలనూ మూడింటిని రాష్ట్రంలోని మూడు విశ్వ విద్యాలయాల పర్యవేక్షణలోను నిర్వహించేందుకు కూడా రాష్ట్ర ప్రభుత్వం తల పెట్టింది.

అంతర్జాతీయ తెలుగుసంస్థ ప్రారంభం

తెలుగుభాష, సంస్కృతులకు సంబంధించిన అన్ని విషయాలంపై పరిశోధన చేసేందుకు దోహదంచేసే అంతర్జాతీయ తెలుగు సంస్థకు రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహమ్మద్ సెప్టెంబరు 8వ తేదీన హైదరాబాద్‌లో ప్రారంభోత్సవం చేశారు. చారిత్రాత్మకమైన ప్రపంచ తెలుగు మహాసభలను పురస్కరించుకొని ఉద్దేశింపబడి రూపుదిద్దుకొన్న యీసంస్థ ప్రపంచమంతటా విస్తరించివున్న తెలుగుప్రజల సాంస్కృతిక సంబంధాలకు తోడ్పడుతుందని భావించ వచ్చును. ఇతర రాష్ట్రాలలోని అంతర్జాతీయ తమిళసంస్థ, హిందీసంస్థ వంటి యిటువంటి తోడి సంస్థలతో సత్సంబంధాలను కల్పించుకోవాలని రాష్ట్రపతి ఉద్బోధించారు.

నానాటికీ వృద్ధి నొందుతూన్న వస్త్రపరిశ్రమ

వచ్చే సంవత్సరం మార్చి నెలాఖరులోగా చేనేత, పట్టు వస్త్రాల రంగాల్లో కొన్ని నిర్దిష్ట లక్ష్యాలను సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పదకొండు అంశాల కార్యక్రమాన్నొక దానిని యిటీవల ఆమోదించింది. వస్త్రాల ఎగుమతికి యిందులో ప్రాధాన్యత యివ్వబడింది. ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ నూతన ఆర్థిక కార్యక్రమాన్ననుసరించి యీ పథకం అమలు చేస్తారు. నూటికి పైగావున్న చేనేత సహకార సంఘాలకు చేయూతనిచ్చి పునరుద్ధరించేందుకూ, వెయ్యేసి మగ్గాలతో నవంబరు నుండి ఆరు ఉత్పత్తి కేంద్రాలను ప్రారంభించేందుకూ, ఎగుమతిని దృష్టిలో పెట్టుకుని నాణ్యత కలిగిన వస్త్రాలను ఉత్పత్తి చేసేందుకూ, రూ 50 లక్షల ఎగుమతి విలువ కలిగిన వస్త్రాలను ఉత్పత్తి చేసే 250 కుట్టు యంత్రాలను సమకూర్చేందుకూ యీ పథకం దోహదం చేస్తుంది. హైదరాబాద్, కరీంనగర్, ప్రొద్దటూరు, పాలకొల్లు, మచిలీపట్నం, పుత్తూరుల్లో ఉత్పత్తి కేంద్రాలు నవంబరు 2వ తేదీన ప్రారంభమౌతాయి. ఈ కేంద్రాలు రూ. 25 కోట్ల విలువ చేసే ఎగుమతి వస్త్రాలను ఉత్పత్తి చేస్తాయి

రాష్ట్రంలో మరో ఆరు నెహ్రూ యువక కేంద్రాలు

1972 లో ఏడు జిల్లాల్లో నెహ్రూ యువక కేంద్రాలు స్థాపించారు. ప్రస్తుతం విశాఖ, గుంటూరు, హైదరాబాద్, ఖమ్మం, కర్నూలు జిల్లాల్లో ఆరు కేంద్రాలను తెరువనున్నారు. 15–25 సంవత్సరాల వయస్సు కలిగిన యువకులను, వారు విద్యార్థులైనా కాకున్నాసరే, చేర్చుకుంటారు. భారత ప్రభుత్వంలో

స్వరాజ్యలక్ష్మి

మొదటి తరగతి అధికారి ఒకాయన, పాటియాలాలోని జాతీయ సంస్థలో సుశిక్షితుడైన ఒక క్రీడాకారుని సహాయంతో, ప్రతి కేంద్రాన్ని పర్యవేక్షిస్తారు. 1975–76 సంవత్సరానికి రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో అనేక యువ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడానికి రూ. 5 లక్షలు కేటాయించారు.

హౌసింగ్ బోర్డు ముమ్మర గృహనిర్మాణ పథకం

ఎగువ తరగతి, మధ్యతరగతి, దిగువ తరగతి ఆదాయ వర్గాల వారికీ, ఆర్థిక పరంగా బలహీనవర్గాల వారికీ గృహనిర్మాణానికయ్యే పూర్తి ఖర్చు నంతటినీ ముందుగానే చెల్లించే పక్షంలో రాజధానిలో అధికస్థాయిలో గృహాలను నిర్మించేందుకు హౌసింగ్ బోర్డు సిద్ధంగా వుందని ఆర్థిక మంత్రి శ్రీ పిడతల రంగారెడ్డి యిటీవల వెల్లడించారు. ఈ పథకమే అన్ని జిల్లాల ముఖ్యపట్టణాలకు త్వరలోనే విస్తృతం చేయబడుతుంది. ఒక్క సంవత్సరంలో

6 కోట్ల రూపాయల వ్యయంతో అన్ని వర్గాల వారికి సంబంధించిన 2000 యిండ్లను నిర్మించేందుకు ప్రతిపాదించారు. పూర్తి చెల్లింపు విషయంలో, యింటికయ్యే పూర్తి ఖరీదులో సగభాగం ఎడ్వాన్సు రూపేణా, తతిమ్మా సగభాగం ఆ తరువాత రెండు వాయిదాల్లోను చెల్లించే పద్ధతి ప్రవేశ పెట్టాల్సిందని ఆర్థిక మంత్రి సలహా యిచ్చారు.

హుడ్కో, జీవిత భీమా సంస్థల సహకారంతో పట్టణం వివిధ ప్రాంతాల్లోనూ ముమ్మరంగా గృహాలను నిర్మిస్తారు. ఈ సౌకర్యం ధనాన్నంతటినీ పూర్తిగా ముందే చెల్లించలేని వారికి వర్తిస్తుంది.

మహిళా సిబ్బందితో "తృప్తి" సూపర్ బజార్ ప్రారంభం

రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీఅహమ్మద్ శ్రీమతి బేగం అబీదా అహమ్మద్ సెప్టెంబరు 10వ తేదీన సికిందరాబాదులో 'తృప్తి సూపర్ బజార్'కు ప్రారంభోత్సవం చేశారు. అంతర్జాతీయ మహిళా సంవత్సరం సందర్భంగా మహిళా సిబ్బందితో యిది ప్రారంభింప బడింది.

శ్రీమతి అబీదా జంటనగరాల్లోని గృహిణులకు యిది ఒక వరం అనీ, అంతర్జాతీయ మహిళా సంవత్సరంలో ప్రారంభించిన యీ సూపర్ బజార్ సంఘ పరంగా సత్ఫలితాలిచ్చేందుకు దోహదం చేస్తుందనీ అన్నారు.

నిత్యావసర వస్తువులు సరసమైన ధరలకు విక్రయం

ప్రధానమంత్రి 20–సూత్రాల పథకాన్ని అమలు చేసే విధానాలు సమీక్షించడానికై ఏర్పడిన రాష్ట్ర స్థాయీ సంఘం సెప్టెంబరు 16 వ తేదీన సమావేశమై నిత్యావసర వస్తువుల పంపిణీ పద్ధతి ప్రజానీకానికి ఉపయోగపడేందుకు వీఇగా పప్పులు వంటనూనెలు, చింతపండు మొదలైన వాటిని 'ప్రొక్యూర్‌మెంటు' విధానంతో స్వాధీనం చేసుకొని సరసమైన ధరలకు విక్రయించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించింది. పబ్లిక్ రంగంలో యిట్లా అమ్మడవుతోన్నవి బియ్యం, గోధుమలు, పంచదార మొదలయినవి యిప్పటికే వున్నాయి.

సమావేశానికి అధ్యక్షత వహించిన ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు మందులు, సబ్బులు మొదలైన వస్తువులు సూపర్ బజార్ల ద్వారా అమ్మకం జరిగే విధానం సులభతరం కావాలనీ సామాన్య ప్రజలు చౌక దుకాణాల్లోనూ, చిల్లర దుకాణాల్లోనూ సక్రమంగా విక్రయమయ్యేట్లు పర్యవేక్షణ జరపాల్సివుందని అభిప్రాయపడ్డారు.

ఈ సంవత్సరం ఖరీఫ్‌స్థాయిలో 8.7 లక్షల టన్నుల ఆహార ధాన్యాలు 'ప్రొక్యూర్‌మెంట్' విధానంలో ప్రభుత్వరంగానికి స్వాధీం కావడం పట్ల యీ సంఘం హర్షం వెలిబుచ్చింది.

భారతీయ వైద్యవిధానాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

హైదరాబాద్‌లోని కేశవ స్మారక భవనంలో ప్రప్రథమ రాష్ట్ర స్థాయి హోమియోపతీ కాన్ఫరెన్సును ప్రారంభిస్తూ యిటీవల ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ కోదాటి రాజమల్లు వైద్యులు భారతీయ వైద్య విధానాల పట్ల శ్రద్ధతో అంకితులయి కృషిచేస్తే రాష్ట్ర ప్రభుత్వం యీ వైద్య విధానాల అభివృద్ధికి చేయూతనిచ్చేందుకు సిద్ధంగా వుందని ప్రకటించారు. గ్రామీణప్రాంతాల్లో పనిచేసే డాక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్ళపాటు ఆర్థికంగా తోడ్పడుతుందని కూడా ఆయన అన్నారు.

పేదలకు యిండ్ల స్థలాలు

రాష్ట్రంలోని మూడు లక్షల మంది హరిజనులకూ బలహీన వర్గాలవారికీ ఇండ్ల స్థలాలను సేకరించి యిచ్చేందుకు యిటీవల ఒక ఆర్డినెన్సు జారీ చేశారు. ఈ వర్గాలకోసం యిందుకొరకై ప్రస్తుత సంవత్సరంలో రాష్ట్రప్రభుత్వం 10 కోట్ల రూపాయలు వెచ్చిస్తుంది. ఇప్పటికే ప్రభుత్వం 17 లక్షల ఎకరాల వ్యవసాయానికి అనుకూలమైన భూమిని బలహీన వర్గాలకు పంచి యిచ్చింది. మరో అయిదారు లక్షల ఎకరాల భూమి మాత్రమే యి విధమైన పంపిణీకి సిద్ధంగా వున్నాయి.

ప్రణాళికా లక్ష్యం స్వయంసమృద్ధి మాత్రమే

అభ్యుదయం, సామాజిక న్యాయం కోసం పథకాలు అనే విషయంపై యిటీవల ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగిన ఒక సెమినార్‌లో మాట్లాడుతూ కేంద్ర ప్రణాళికల శాఖ స్టేట్ మంత్రి శ్రీ ఐ.కె. గుజ్రాల్ ఐదవ ప్రణాళికా లక్ష్యం బీదరికాన్ని తొలగించి దేశాన్ని స్వయంసమృద్ధి చేయడం మాత్రమేనని అన్నారు. సత్వరాభివృద్ధికి మాత్రమేకాకుండా పునఃపంపిణీ విధానానికి ప్రాధాన్యతనిచ్చే దృష్టితో ఆర్థిక, సామాజిక, సంస్థాయుత మార్పులకు పథకాలు రూపొందించాల్సి వుందని అన్నారు. ఉక్కు, సిమ్మెంటు, ఎరువులు మొదలైన భారీపారిశ్రామిక యూనిట్లు తప్పనిసరిఅయినవప్పటికీ విస్తృతమైన ప్రాతిపదిక గల ఆర్థిక, సాంఘిక పరమైన హోదా, సంపద, ఆదాయం ముమ్మరంగా కేంద్రీకృతమవడం పెరగరాదని హెచ్చరించారు.

నీటిపనరుల అభివృద్ధి సంస్థ

రాష్ట్ర ప్రభుత్వ సంస్థగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటివనరుల అభివృద్ధి కార్పొరేషన్ ఏర్పాటుచేశారు. లభ్యమయ్యే నీటివనరులను గరిష్ఠస్థాయిలో వినియోగించుకోవడానికీ, ప్రజారోగ్య ప్రయోజనాలకు సమీకృత్యపథకాలను రూపొందించి అమలు పరచడానికి ఈ సంస్థ కృషి చేస్తుంది. ప్రస్తుతం ఈ కార్పొరేషన్ కార్యక్రమాలు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు, గొట్టపుబావుల పథకాలు అమలుకు మాత్రమే పరిమితమైవున్నాయి.

(తరువాయి 54 పేజీలో)

చరిత్రలో ప్రసిద్ధి గాంచిన

మోటుపల్లి ఓడరేవు

- శ్రీ పుల్లాభొట్ల వెంకటేశ్వర్లు

మోసలపురం అనీ, మకుళపురం అనీ, ముకుళపురం అని, మకుళాహ్వయపురం అని నామాంతరాలుగల మోటుపల్లి ఆంధ్ర ప్రాచీన చరిత్రలో మిక్కిలి ప్రసిద్ధిజెందిన పురాతన రేవుపట్టణం. దీనిని కాకతీయుల కాలాన వేలానగరం అని, ధేమ్యాయక్కొండ లేక ధేశ్యాయాకొండ పట్టణం అని వ్యవహరించేవారు. పెక్కు శతాబ్దాలపాటు యిది దక్షిణ హిందూదేశాన విదేశ వాణిజ్య నిత్యోత్కీలక స్థానం అయి దేశ, విదేశ, నానాదేశ వర్తకులతో వివిధ రకాలైన సరుకుల ఎగుమతి దిగుమతులతో కళకళలాడుతూ మిక్కిలి జనసమ్మర్థంగా వుండేది. ఇది ఒకనాడు విశ్వవిఖ్యాతి నార్జించిన రేవుపట్టణం.

పేరుకు మాత్రమే మిగిలివుంది

ఇది నేడు తన పూర్వ ప్రతిపత్తినీ వైభవాన్నీ కోలుపోయి పేరుకు మాత్రమే మిగిలివుంది. గుంటూరుజిల్లా బాపట్లతాలూకాలో బాపట్ల పట్టణానికి 8 మైళ్ళ దూరాన, ఉప్పుటేరు సముద్రంలో కలిసేచోటుకు సమీపాన రెండుమైళ్ళ ప్రాంతమంతా ఈ పురాతన మోటుపల్లి పట్టణం వ్యాపించివుంది పాడువడిపోయిన నగర వీధుల సౌధాల పునాదులతోను, గొప్పగొప్ప ప్రాసాదాల శిథిల చిహ్నాలతోను, పురాతన కాలానికి సంబంధించిన ఓడల శిథిలావశేషాలతోను మైళ్ళకొలది ప్రదేశాన్ని ఆక్రమించి, మనకు అది తన పూర్వచరిత్రను, వైభవాన్ని తెలుపుతోంది. ఈ ఓడరేవుకు చుట్టుపట్టులలోగల చినగంజాం, కొల్లితిప్ప, ఫిరంగిదిబ్బ మొదలైన ప్రదేశాలలో లభించిన పురాతన బౌద్ధ శిల్పావశేషాలు, రోమను నాణాలు, శిలాశాసనాలు పెక్కు ఇతర వస్తువులు ఆ చారిత్రిక సత్యాన్ని రుజువుచేస్తూ, ఆ నాటి ఆ మహానగర వైభవాన్ని సకల సంపత్తిని యిది ఎలుగెత్తి చాటుతోంది. ఇచ్చటి ప్రశాంత ప్రకృతి సహజ సుందరాలైన ఇసుకతిన్నెలు, ప్రకృతి రమణీయకత్వాన్ని ద్విగుణీకృతంచేసే తాటితోపు గతకాలపు ప్రాచీన వైభవాలకు చిహ్నంగా మనకు నేడు కన్పిస్తూ నేత్ర పర్వంగా వర్ధిల్లుతోంది.

పూర్వ యశస్సు

క్రీ.శ. 1291వ సంవత్సరంలో ఆంధ్రదేశాన్ని సందర్శించిన సుప్రసిద్ధ గ్రీకు యాత్రికుడు 'మార్కోపోలో' యిది గొప్ప విఖ్యాతి గల రేవుపట్టణం అని ఘనత వహించిన వాణిజ్య కేంద్రం అనీ, ధన ధాన్యాలతో తులతూగిన ప్రముఖ స్థలం అనీ అభివర్ణించాడు. ఇచటి నుండి దేశదేశాలకు, ఖండాంతరాలకు, ద్వీపాంతరాలకు ఉల్లిపొరలాంటి సన్నని నూలుబట్టలు, పట్టు సెల్లాలు, అద్దకం బట్టలు, వజ్ర వైడూర్యాలు విరివిగా యెగుమతి అవుతూ వుండేవని విశదపరచాడు. ఈ అపురూపమైన వస్తుసముదాయాన్ని ఆయా దేశాల ప్రభువులు, ప్రజలు మిక్కిలి ప్రీతితో పోటీలుపడి ఖరీదుచేసే వారని అతడు తెలిపాడు. ఈ మోటుపల్లిని అతడు 'ముటపిలి' లేక మోసల్ అనే పేరుతో తనరచనలలో పేర్కొన్నాడు. అతడు దీన్ని సందర్శించినప్పుడు యీ ప్రాంతాన్ని ఒక మహారాజ్ఞి మహా దక్షతతో జనరంజకంగా పరిపాలించిందని తెలిపాడు. కాని ఆ మహారాజ్ఞి పేరును తెలుపలేదు. పూర్వాపరాలను బాగా పరిశోధించిన నేటి చారిత్రక పరిశోధకులు ఆ రాజ్ఞి కాకతి రుద్రమ దేవి చెల్లెలు 'గణపాంబ' అని నిశ్చయించారు. అంతే గాక ఆమె కోట బేతిరాజు ధర్మపత్ని అనిగూడ నిరూపించారు.

విదేశ చరిత్ర కారుడైన 'ప్లయినీ' భూగోళ శాస్త్రజ్ఞుడైన 'టోలామి' గూడ యీ మోటుపల్లి రేవు ప్రశస్తిని గురించి దాని వైభవాన్ని గురించి తమ గ్రంథాలలో ఘనంగా ప్రస్తుతించారు. అలాగే ఈ ప్రాంత వైభవాన్ని ఇచ్చటి వజ్రపుగనులను గురించి నికోలోడి కోంటి అనే ఇటలీ దేశవాస్తవ్యుడు ప్రౌఢ దేవరాయల కాలంలో యిచ్చటికివచ్చి, స్వయంగా దీన్ని సందర్శించి తన గ్రంథంలో విపులంగాను, సోపపత్తికంగాను వర్ణించాడు.

ఈ మోటుపల్లి క్రీస్తుకు పూర్వం 1.2 శతాబ్దాల నుండి, అనగా ఆంధ్ర సామ్రాట్టులైన సాతవాహన రాజులు రాజ్యపాలనం చేసిన కాలం నుండి జగద్విఖ్యాతమైన ఓడ రేవుగా వుండి వారి దేశవాణిజ్యాభివృద్ధికెంతో దోహద మొనరించింది. ఆ నాడు దీనిని "మోసలపురం" అని వ్యవహరించారు. ఇది ప్రాక్ పశ్చిమ ఖండాలకు సంబంధంగా వుండి నౌకా వాణిజ్యాలకు కేంద్రమై వర్ధిల్లుతూ, అంతర్జాతీయ ప్రముఖ వర్తకస్థానంగా ఆనాడే ఖండాతరకీర్తిని సంపాదించుకొంది. రోం, అలెగ్జాండ్రియా, టాయిర్ మొదలైన ప్రాంతాలనుండి విదేశ వర్తకులు వాణిజ్యం నిమిత్తం యిచ్చటికి వస్తూవుండేవారు.

ఆనాడు రోమనులు దీనిని "మైసాలియా" అని పిలుస్తూవుండేవారు. ఈ రేవు పట్టణంతో వారికి సన్నిహిత సంబంధం ఉండేది.

క్షీణ దశ

సాతవాహనుల పిమ్మట ఇక్ష్వాకులు బృహత్పలాయనులు, విష్ణుకుండినులు ఆనంద గోత్రులు, చాళుక్యులు ఈ మహాంధ్ర సామ్రాజ్యాన్ని వైభవోపేతంగా పాలించారు వారి రాజ్యంలో గూడ యీ మోటుపల్లి ప్రముఖ వాణిజ్య కేంద్రంగా వుండి ఆంధ్ర మహా జనుల భాగ్యోదయానికి, అభ్యున్నతికి ప్రగతికి యెంతో దోహద

కారియై వర్ధిల్లింది. పదమూడవ శతాబ్దం ప్రారంభంలో చాళుక్య సామ్రాజ్యం అస్తమించటంతో దీని ప్రతిభతగ్గిపోయి క్రమంగా అది దుష్టులకు కుతంత్రపరులకు దారి దోపిడి గాండ్రకు బందిపోటు దొంగలకు చిన్నచిన్న మాండలిక ప్రభువులకు ఆవాసస్థానమైంది. చిరకాలంనుండి యీ పట్టణాన్ని ఆశ్రయించుకొని ఖండాంతర వ్యాపారం సాగించిన వణిక్ప్రభువులు తమ ధన మానాలకు సరియైన రక్షణ లేక పోవటంవల్ల భయభ్రాంతులైపోయి సురక్షిత స్థలాలకు తమ తమ కుటుంబాలతో, వస్తువాహనాలతో పారిపోయారు. కనుక ఒక అర్ధ శతాబ్దికాలం అనగా కాకతీయ గణపతి దేవమహారాజు తమ సాటిలేని మేటిబలంతో పూర్వాంధ్ర సీమనంతటిని జయించి సుస్థిర పరిపాలన నెలకొల్పేవరకు, ఈ ఓడరేవు ప్రతిభ, వైభవం తెరమరుగున పడిపోయింది.

ఆ మహాచక్రవర్తి రాజ్యభారం వహించిన పిమ్మట మోటుపల్లి ఓడరేవుకు పట్టిన దుర్గతిని గ్రహించి దానివైభవాన్ని మళ్లీ ద్విగుణీకృతం చేయటానికి పూనుకున్నాడు. ఆ మహారాజు స్వయంగా మోటుపల్లికి పోయి, భీతితో పారిపోయిన వర్తకులందరినీ పిలిపించి, వారితో సంప్రదించి, వారికి యెట్టి ఆపదా రాకుండా కాపాడటానికి అంగీకరించి, అభయశాసనాన్ని జారీచేయించి, గట్టి కట్టుదిట్టాలతో యధాప్రకారంగా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో వ్యాపారం కొనసాగేవిధంగా చర్యలు తీసుకొన్నాడు. ఆ మహారాజు క్రీ శ. 1244-45 సంవత్సరాలకు సరియైన శాలివాహన శకం 1166 క్రోధి నామ సంవత్సరంలో తమ శాసనాన్ని ప్రకటింప జేసి, ప్రజలకు ఆనందాన్ని కలిగించాడు. అది నేటికీ మోటుపల్లిలోని శ్రీ వీరభద్రస్వామివారి కల్యాణమంటపంలో వుంది. ఆ శాసనంలో ఈ క్రిందివిధంగా వ్రాయబడి వుంది—

"సకల ద్వీపాంతర. దేశాంతర పట్టణములందు వ్యాపారము చేసి కొనుటకై అరుగుచు, సముద్రముపై ఓడలలో బోవుచు, వచ్చు వారికి గణపతి దేవమహారాజు ఈ విధముగా అభయశాసన మిచ్చుచున్నారు అన్యద్వీప, దేశాంతర, పట్టణములనుండి పోతపాత్రలు, జోగులు, కలములు, సరకులను గొనివచ్చుచు. బోవుచు దైవవశమున తుఫాను యందు తగుల్కొని ఒడ్డునకు గొట్టి వేయబడినప్పుడు వాటిని పూర్వరాజులు కొల్లగొట్టుచు దురదృష్టవంతులైన అందలి వర్తకులకు గావలసిన సహాయమొనరింపక, దురాత్ములై వారి కనక, కరి, తురగ, రత్నాది సకల వస్తువులను బలాత్కారముగా నపహరించుచు వచ్చిరి. మేము అట్లు చేయము. భయంకరమైన సముద్ర యానము చేయుచు. విదేశములతో వాణిజ్యము నెరపుచున్న మహా సాహసికుల ప్రాణములు మాకు మాప్రాణము కంటె ఎక్కువ ప్రీతికరములైనవి. కావున వారిని మేము సంరక్షించెదము —"

అభయ శాసనం

శ్రీ గణపతిదేవ మహారాజు తనకు ముందున్న రాజులు వర్తక వాణిజ్యాలపై వేసిన అక్రమపన్నుల నెన్నింటినో తొలిగించి ఎగుమతి, దిగుమతులపైన శుల్క పరిమాణాన్ని ముప్పదింట ఒక్కటిగా నిర్ణయించాడు. ఆ ధర్మపాలకుడి ధర్మనిర్ణయాన్ని సూచించే అభయ శాసనం నకలును చూడండి—

"మహాసాహ సేభ్యః క్లప్తశు
ల్కాదృతేకృపయా కీర్తి వమాయాథ
సర్వం వితరామదీతే తత్రశుల్క
పరిమాణం ఎక్కమ్మది దిగ్గుమ
దిని ముప్పయింటను ఒక్కటి ఒక్కటి
శ్రీగంధము తుళము ఒక
టికి ।గంకి। కర్పూరమునకు
...... కి కర్పూరానకు ముత్యాల
కూవెల । గణకి ।।। ≡ పంనీరు
దంతము జవాది కర్పూర తై
లము రాగి తగరము రిగ
య సీసము పట్టునూలు ప
వడమూ గంధ్య ద్రవ్యాలకు
ను వెల । గణకి ।।।– పట్టు ఎల్ల
వానికిన్ని స్వరూపము ఒకటికి
వెల।।। సోంకలు లక్ష ఒకటికి
వె । గణకి ।షట్ షష్ట్యధికై కాద
శశత సంఖ్యే క్రోధి నామ్నిశ
కవర్షే। మోట్టు ప్పల్యభిధానే–"అని

[ఈశాసనం మోటుపల్లి ఓడరేవులో వుంది]

అంతేగాక ఆమహారాజు ఆరేవు పట్టణాన్ని రక్షించటానికి సిద్దయదేవ మహారాజును ప్రెగ్గడను అధికారిగా యేర్పరచి కొంత సైన్యాన్ని ఆప్రాంతానికి కాపుంచి తానిచ్చిన అభయశాసనం చక్కగా అమలు జరిగేట్లు యేర్పరచి, ఓడదొంగలను దొంగ వ్యాపారులను, మోసగాండ్రను, వంచన పరులను కఠినంగా శిక్షించాడు. కనుక ఆమహారాజు చల్లని పరిపాలనలో మరల మోటుపల్లి వైభవం ద్విగుణీకృతం అయింది. భారీయెత్తున మరల విదేశ వాణిజ్యం కొనసాగింది ఆనాడు అది కాకతీయ మహా సామ్రాజ్యానికి. ప్రధానవర్తక కేంద్రమై నెగడి జగద్విఖ్యాతినందింది. పెక్కుమంది విదేశవాణిజ్య వేత్తల నాకర్షించింది. ఆనాడు 'కూఫ' అనే ఒక విధమైన పన్నును వస్తువుల క్రయ విక్రయాలపైన విధిస్తూ ఉండే వారట!

రెడ్డి రాజుల కాలంలో

ఆపిమ్మట సుమారు నూరు సంవత్సరాలకు రెడ్డి రాజ్యాన్ని స్థాపించిన ప్రోలయ వేమారెడ్డి సోదరుడు మల్లారెడ్డి యీ ఓడరేవును అవక్రపరాక్రమమైన తన బాహుబలంతో జయించినట్లు శంభుదాసను నామాంతరంగల ప్రబంధ పరమేశ్వరుడు అయిన ఎఱ్ఱాప్రగ్గడ మహాకవి తన హరివంశ మహాకావ్యంలో వర్ణించాడు.

క్రీ. శ. 1350–62 సంవత్సరాల మధ్య రెడ్డి రాజ్యాన్ని అత్యున్నత ప్రతిభాసంపత్తులతో పాలించిన అనవోతారెడ్డి ప్రభువు యీ మోటుపల్లి ఓడరేవును అభివృద్ధి పరచటానికి దేశానవర్తక వ్యాపారం వృద్ధిపరచటానికి మిక్కిలి కృషిసలిపాడు. ఇతడును గణపతి దేవ చక్రవర్తివలె ఒక అభయశాసనాన్ని మోటుపల్లిలో నేయించాడు. ఆ మహారాజు పాలనానంతరం చెలరేగిన విప్లవకాలంలో అంతరించి పోయిన వాణిజ్యమర్యాదలను కాపాడి స్వేచ్ఛా వాణిజ్యాన్ని పునరుద్ధరించి వర్తకులకు హానికరంగా వుండే పెక్కు పన్నులను రద్దు చేశాడు. పరదేశ బేహారులపైన విధింపబడే "అపుత్రికదండము" "కద్దాయము" వంటి విచిత్రపు పన్నులను తొలగించి వారి మన్నన లకు పాత్రుడైనాడు. అదే విధంగా బంగారం పైన, వెండిపైన విధింపబడే పన్నులను పూర్తిగా తొలగించాడు. గంధము మున్నగు సుగంధద్రవ్యాలపైన విధింపబడే పన్నులలో మూడింట ఒకవంతు తగ్గించి తదితర ఎగుమతి దిగుమతులపైన పూర్వ పద్ధతులనే అమలులో వుంచాడు. అంతేగాక వస్త్రాలు, ముత్యాలు, మున్నగు వాని ఎగుమతి దిగుమతుల మీద క్రమ పద్ధతుల వెంట పన్నులను విధించాడు.

అనవోతారెడ్డి ప్రభువు తాను నిర్ణయించిన పన్నుల విధానాన్ని కఠినంగాను, సమర్థవంతంగాను అమలు పరచటానికి గట్టి కట్టుదిట్టాలుచేసి, మోటుపల్లిలో వర్తకలక్ష్మిని చక్కని పునాదులపైన పునరుద్ధరించి మహోపకారం చేశాడు. ఆ మహా ప్రభువుతాను ప్రకటించిన అభయశాసనాన్ని తెలుగు, అరవం, సంస్కృతం మొదలైన భాషలలో చెక్కించి క్రీ.శ. 1358వ. సం.లో అనగా విళంబి నామ సంవత్సరం శ్రావణ శుద్ధచవితి మంగళవారం నాడు శ్రీ వీరభద్రేశ్వరస్వామి వారి ఆలయమంటప స్తంభాలపైన చెక్కించాడు. ఈ శాసనాలు తెలుగు, అరవభాషలలో ఉన్నందున ఆమహారాజు కాలంలో తమిళాంధ్ర దేశాలమధ్య వర్తక వ్యాపారాలు విరివిగా సాగుచుండినట్లు; ఆరెండు రాజ్యాలమధ్య మంచి సంబంధాలు కలిగివున్నట్లు మనకు విశదం కాగలదు. ఈ అభయశాసనం నేటికి మోటుపల్లిలో గల శ్రీ వీరభద్రస్వామి వారి ఆలయంలో మనకు కన్పిస్తుంది. అది అనవోతారెడ్డి ప్రభువు ధర్మాభిరతికి ప్రజాశ్రేయోభిరక్తికి, విశాల దృక్పథానికి సాక్ష్యంగా నిలిచి వుంది. అది రెడిరాజుల కాలపు ప్రజారంజకమైన పరిపాలనా సామర్థ్యాన్ని వేనోళ్ల విశద పరుస్తూఉంది.

రెడ్డిరాజుల తదనంతరం విజయ నగర మహాసామ్రాజ్యాన్ని మిక్కిలి దక్షతతో ప్రజానురంజకంగా పాలించిన ఇమ్మడి దేవరాయల వారి అభయశాసనం గూడ మనకు యీ మోటుపల్లిలో కన్పించటం మరొక విశేషం.

పైన తెలిపిన శాసనాలవల్ల, విదేశయాత్రికుల వ్రాతలవల్ల పెక్కు తదితర ఆధారాలవల్ల యీ మోటుపల్లి ఓడరేవు నుండి ఆనాడు ప్రధానంగా జరిగిన ఎగుమతులు నూలువస్త్రాలని, ఆపిమ్మట వజ్రవైఢూర్యాలు, పట్టు, గాజు, లోహసామాగ్రి అని విశదమౌతుంది. అదే విధంగా విదేశాలనుండి కర్పూరం, కంబళ్లు, సుగంధద్రవ్యాలు, గంధం, పునుగు, జవ్వాది, అత్తరు, పన్నీరు, ఏనుగులు, గుఱ్ఱాలు మొదలైనవి దిగుమతి అవుతూవుండేవి.

విదేశీ వ్యాపారం

ఆనాడు ఉత్తర, దక్షిణ, తూర్పు దిక్కులనుంచి సరకులతో నిండిన యెన్నో ఓడలు యీమోటుపల్లి ఓడరేవుకు వస్తూవుండేవి. ముఖ్యంగా బర్మా, చైనా, జపాను, కాంబోడియా, బోర్నియో, సుమాత్రా, సింహళం మొదలగు తూర్పుదేశాలతోను; అదేవిధంగా అరేబియా, పారశీకం, ఈజిప్టు, రోం మొదలైన పాశ్చాత్య దేశాలతోను భారాళంగా వర్తకం జరుగుతూఉండేది ఈ ఓడరేవు వివిధ రకాలైన సరకులతో కిటకిటలాడుతూవుండేది.

ఆ రోజులలో ఇచ్చట వర్తకం చేసిన ప్రముఖులు చామిశెట్టి అవచి తిప్పయశెట్టిగారలు. ఈ అవచితిప్పయశ్రేష్ఠి వంటి రసికాగ్రణికే కవిసార్వభౌముడైన శ్రీనాథుడు తన హరవిలాస ప్రబంధాన్ని అంకితం చేశాడు. పైన తెలిపిన ఇరువురు వర్తక ప్రముఖులు చైనా, భూటాన్, టిబెట్, పర్షియా, బర్మా, మలయా, సింహళం, కాంబోడియా, సుమాత్రా మున్నగు దేశాలతో వ్యాపారాలు చేసి, ఆయా దేశాలనుండి మిక్కిలి విలువైన సుగంధద్రవ్యాలు, మేలుజాతి గుఱ్ఱాలు, ఏనుగులు దిగుమతి చేసేవారు. వీరు బహమనీ సుల్తానులతోను భారీయెత్తున వర్తకవ్యాపారాలు చేసినట్లు ఎన్నో ఆధారాలు కనుపిస్తున్నాయి ఈ విధంగా వారు స్వలాభాపేక్షతో వర్తకవాణిజ్యాన్ని చేయుటయేగాక, దేశసంపదను అభివృద్ధిపరచుటలోగూడ తోడ్పడ్డారు.

ఆనాడు మోటుపల్లి దేశి, పరదేశి, నానాదేశి అనబడు "చాలుమూల సమస్త పెక్కండ్రు" దేశాల వ్యాపారులతో, వర్తకవ్యాపారానికి కూడలిగా ఉండేది కనుక ఆనాడు దేశం ధనరాసులతో నిండియుండి, ప్రజలు భోగభాగ్యాలతో సకలైశ్వర్యాలతో తులతూగుతూఉండేవారు.

కాకతీయ సామ్రాట్టులనుండి విజయనగరసామ్రాజ్య చరమదశ వరకు యీ మోటుపల్లి ఓడరేవు మిక్కిలి ఉచ్ఛదశలో వర్ధిల్లి ఆంధ్రుల నౌకావాణిజ్యానికి కేంద్రమైనట్లు పెక్కు ఆధారాలు విశద పరుస్తున్నాయి. ఆనాడు దీనికి గొప్పఖ్యాతి ఉండేది. ఆ పిమ్మట 1752వ సంవత్సరంలో ఈ ఓడరేవు ఫ్రెంచివారి స్వాధీనమైంది. ఇక్కడి నుండే వారు ఆంగ్లేయుల నెదిరించటానికి సైనికులను, మందుగుండుసామాగ్రిని దిగుమతి చేసికొన్నారట! వారి పరిపాలనా కాలంలోగూడ ఈ రేవుపట్టణం వర్తక కేంద్రమై వుంది. వర్తక సామగ్రిని మోయటానికి వారు బండ్లను, దున్నపోతులను, గాడిదలను విశేషంగా వాడిరట. వారి కాలంలో మోటుపల్లి నుండి చిలక సముద్రందాక గల నాలుగుసందల మైళ్ల ప్రాంతమంతా గొప్ప వ్యాపారరంగంగా ఉండి సకలసంపదలతో తులతూగుతూఉండేది.

వీరభద్రస్వామి ఆలయం

మోటుపల్లి ఓడరేవుకు సుమారు మైలు దూరంలో రుద్రమాంబదేవి నిర్మించిన శ్రీ వీరభద్రస్వామి వారి దేవాలయం ఉంది. దీనిని క్రీ.శ. 1239వ సంవత్సరంలో ఆ మహారాణి నిర్మించినట్లు తెలిపే శాసనం ఒకటి ఇక్కడ వుంది. ఈ ఆలయ కల్యాణ మంటప స్తంభాలపైన శ్రీ అనవోతారెడ్డి ప్రభువు వేయించిన శాసనం

విజయనగరాధీశ్వరుడైన మొదటిదేవరాయలవారి శాసనంఉన్నాయి. ఇచ్చట గల మూలవిరాట్టు శ్రీ వీరభద్రుడు.

ఈ వీరభద్రస్వామివారి దేవాలయానికి సమీపాన ఒక గణపతి దేవాలయం ఉండేదని, అది శిథిలం కాగా అందలిగణపతి విగ్రహాన్ని తదితర శిథిలావశేషాలను ఇందు భద్రపరచారు.

శ్రీ వీరభద్రస్వామివారి దేవాలయానికి ఫర్లాంగు దూరంలో శ్రీ కోదండ రామస్వామివారి కోవెల ఉంది దాన్ని క్రీ.శ. 1247వ సంవత్సరంలో శ్రీ గణపతిదేవమహారాజు ప్రతిష్ఠించినట్లు తెలిపే శాసనం ఇందులో ఉంది. ఈ ఆలయం సింహద్వారమంటపం, మహామంటపం అపురూప కళాశిల్పంతో చూడముచ్చటగా వుండి ఆనాటి ఆంధ్రశిల్పుల కళాకౌశలాన్ని, నిర్మాణదక్షతను వేనోళ్ల చాటుతోంది ఇచ్చటగల కళ్యాణమంటపం ఇసుకలో కూరుకొనిపోయింది దీనిని దర్శించగానే, గత చరిత్ర అంతా ఒక్కసారి మన కళ్లముందు సాక్షాత్కరిస్తుంది హృదయం ద్రవీభూతమైపోతుంది ఇచ్చటికి సమీపానగల చెన్నకేశేశ్వరస్వామివారి దేవాలయం శిథిలమైపోగా అచ్చట లభించిన శిలాశాసనాలు, తదితర శిల్పావశేషాలు ఈ దేవాలయంలోనే భద్రపరుపబడ్డాయి. శ్రీ కోదండరామస్వామివారి దేవాలయంలోగల మూలవిరాట్టుకు ప్రతినిత్యం ధూపదీపనైవేద్యాలు నేటికి జరుపబడుతున్నాయి. దీనిని బట్టి పూర్వం మోటుపల్లిలో శ్రీ కోదండ రామస్వామివారి ఆలయం, శ్రీ వీరభద్రస్వామి వారి దేవాలయం, శ్రీ చెన్నకేశ్వరస్వామివారిదేలయం, శ్రీ గణపతి దేవాలయం ఉన్నట్లు తెలుస్తున్నాయి. చివరెండు ఆలయాలు శిథిలమైపోయినాయి. మొదటి రెండు ఇంకా జీర్ణావస్థలోవుండి తమ పురాతనవైభవాన్ని చాటుతూ నామమాత్రంగా మిగిలిఉన్నాయి.

దాదాపు 16 17 శతాబ్దాలకాలం అంతర్జాతీయ ఖ్యాతి నార్జించి దక్షిణాపథాన వర్తకవ్యాపారానికి కూడలియై ముఖ్య కేంద్రమై మహోన్నతస్థితితో తులతూగిన ఈ మోటుపల్లి ఓడరేవుపట్టణం, నేడు ఒక కుగ్రామమై బ్రతికిచెడిన నాటి పురావైభవాన్ని తలపుకు తెస్తూ మిగిలి ఉంది.

ఈ మోటుపల్లిని నేడు దర్శించాలంటే మద్రాసు-విజయవాడ రైలుమార్గంలో గుంటూరుజిల్లాలో, 'కడవకుదురు' రైలుస్టేషన్‌లో దిగి, కాలినడకన అక్కడికి పోవాల్సి ఉంటుంది. ఆ ప్రాంతంలో యెటుచూచినా, యెటు నడచినా అలనాటి పురావైభవం మనకు కన్నులముందు సాక్షాత్కరిస్తూ వుంటుంది. దానితో ఒకానొక మధురానుభూతి కలుగుతూవుంటుంది. ఆ అవ్యక్త మధురానందంతో తన్మయులమైపోతూవుంటాం. తెలుగుల గత చరిత్రంతా ఒక్కసారి మన కళ్లముందు నాట్యంచేస్తుంది.

ఈ సంచికలో రచయితలు

శ్రీయుతులు

కప్పగంతుల లక్ష్మణ శాస్త్రి, 69, ఆదర్శ నగర్, హైదరాబాద్

జె. వీరాస్వామి, ఆం. ప్ర. పబ్లిక్ సర్వీస్ కమీషన్ సభ్యులు, గృహకల్ప. ముకరంజాహీరోడ్, హైదరాబాద్

సి. ఆనందారామం. 5 ఎస్. ఎం. సి. మారేడ్ పల్లి, సికింద్రాబాద్-3

కె. ఆర్. కె. మోహన్, అసిస్టెంట్ పోస్ట్ మాస్టర్, జూబిలీ పోస్టాఫీస్, హైదరాబాద్

తిరుమల రామచంద్ర, ఆదర్శ నగర్, హైదరాబాద్

ఎస్. స్వరాజ్యలక్ష్మి, 12-2-764/1, హైదరాబాద్-28

పుతుంబాక శ్రీరాములు, పంచాయతీ సమితి, ఈమని, తెనాలి తాలూకా, గుంటూరు జిల్లా

పుల్లాభొట్ల వెంకటేశ్వర్లు, తెలుగు శాఖ, ప్రభుత్వ కళాశాల, ఖమ్మం.

మల్లిక్, 3/ఎ, పి. యస్. నగర్, మసాబ్‌టాంక్, హైదరాబాద్-28

డాక్టర్ ఆర్. వి. రావు, 3-4-674/1, నారాయణ గూడా, హైదరాబాద్-29

చేకూరి రామారావు, భాషాధ్యయన శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్-40

యర్రమిల్లి చలపతిరావు శ్రీవత్సవ, చౌడువాడ, (వయా) గోవాడ, విశాఖపట్నం జిల్లా

జి. కల్యాణసింగ్ 17 సి.ఐ.బి. క్వార్టర్స్ బారాగల్లి, హైదరాబాద్-28

కె. ఎస్. ఎస్. శేషన్, చరిత్ర శాఖ, బీసెంట్ థియాసాఫికల్ కళాశాల, మదనపల్లె

దమ్మ తానయ్య, "శ్రీ సాయి నిలయం", 1-9-52/సి/28 హైదరాబాద్-4.

సోమంచి సూర్యనారాయణ శర్మ, 2 నెంబరు పోలీస్ స్టేషన్ వద్ద, కాకినాడ-1

సి. హెచ్. రాజలింగం, సిరిసిల్ల, కరీమ్‌నగర్

టి. గౌరీశంకర్, 1-8-78/79, చిక్కడపల్లి, హైదరాబాద్-బి

ఎస్. కోటేశ్వరి, సి/ఒ సిరిపురపు అప్పారావు, బి.డి.ఒ., కొత్తపేట, తూర్పుగోదావరి జిల్లా

బి. అంజనేయులు, బి.ఎ. పి. ఆర్. ఓ., ఆదోని, కర్నూలు జిల్లా

డాక్టర్ జి.వి. సుబ్రహ్మణ్యం, ఎం.ఎ., పి. హెచ్. డి., "శ్రీవాణి", 1-8-702/105, నల్లకుంట హైదరాబాద్-44

డాక్టర్ శ్రీమతి పి. యశోదా రెడ్డి, "సుధర్మ", 3-4-574, నారాయణగూడా, హైదరాబాద్

కొత్తబాటలో పయనిస్తున్న కొత్తపేట సమితి

—ఎస్. కోటేశ్వరి


సుందర ప్రకృతి మధ్య విలసిల్లుతూ సందర్శకులకు కన్నుల పండువ జేసేకోనసీమ ప్రాంతానికి ముఖద్వారంగా విలసిల్లుతున్న కొత్తపేట సమితి అభివృద్ధి కార్యక్రమాలను అమలు పరచి ఆదర్శంగా పనిజేస్తున్నది. కీ శే. కళా వెంకట్రావుగారి అచంచల దీక్షవల్ల గౌతమి, వశిష్ఠనదులపై నిర్మించిన వంతెనల వల్ల ఈ ప్రాంతానికి అనేక విధాల విశిష్టత వచ్చింది 36 గ్రామాలుకలిగి, 1,26,214 మంది జనాభా కలిగిన కొత్తపేట సమితి విస్తీర్ణం 57 254 ఎకరాలు. ఈ సమితి 1956వ సంవత్సరంలో ఏర్పడింది.

మీ కొత్తపేట సమితి సాధించిన అభివృద్ధి ఏమిటని అడిగినపుడు బి డి. ఓ శ్రీ శిరిపురపు అప్పారావుగారిలా తెలియజేశారు. కొత్తపేట సమితిలో భూములకు మూడుకాలువలు గోదావరి జిల్లాలను అందజేస్తున్నాయి. సమితి సిబ్బంది అందజేసిన సాంకేతిక సలహాలు రైతులు వినియోగించు కుంటున్నారు. ఒకనాడు రైతులు మేలు రకం పంటలు వేసి పండించటానికి ఎంతగానో సంకోచించేవారు. పండుతాయో. పండవో అనమానం కొద్దియో కాని ఈ నాడు కొత్త వరి వంగడాలను వేసి అధిక దిగుబడిని సాధిస్తున్నారు.

వ్యవసాయరంగంలో.......

1968-69 సంవత్సరంలో 666 ఎకరాలలో సార్వాపంట కాలంలొ, దాళ్వాపంట కాలంలో 2238 ఎకరాలు అధిక దిగుబడిని వరి వంగడాలు వేస్తే ఈ నాడు సార్వాపంట కాలంలో 7300 ఎకరాలు. దాళ్వా పంటకాలంలో 9738 ఎకరాలు వేశారు. 1956 వ సంవత్సరంలో ఈ సమితిలో 150 ఫిల్టర్ పాయింట్లు 135 ఆయిల్ ఇంజన్లు 5 ఎలక్ట్రికల్ మోటర్లు ఉంటే ఈ నాడు సమితిలో 1305 ఫిల్టర్ పాయింట్లు 629 ఆయిల్ ఇంజనులు, 170 ఎలక్ట్రికల్ మోటర్లు ఉన్నాయి. ఈ అంకెలు వ్యవసాయ రంగంలో రైతులు ఏలా ముందుకు పోతున్నారో చెపుతాయి.

కొత్త పేట పశువుల ఆసుపత్రి, వెలిచేరు ప్రధాన పశువుల ఆసుపత్రి. గోపాలపురంలో చిన్నతరహా పశువుల ఆసుపత్రి, రావులపాలెంలో గ్రామీణ పశువుల ఆసుపత్రులున్నాయి. కృత్రిమ



ఉచ్చిలి గ్రామంలో ప్రజలు నిర్మించిన పాఠశాల భవనం.

పశుగర్భోత్పత్తి కేంద్రాలు మూడు ఈ సమితిలో ఉన్నాయి. 1973-74 సంవత్సరంలో గోపాలపురంలో కృత్రిమపశుగర్భోత్పత్తి కేంద్ర స్థాపనకు గోపాలపురం ఈత కోట, పొడగట్లపల్లి పంచాయతీలనుంచి మూడువేల రూపాయలు విరాళాలు పోగుచేయటం జరిగింది. ఇవేగాక ఇంకా ఎనిమిది చిన్నతరహా పశువుల ఆసుపత్రులు ఈ సమితి ప్రాంతంలో ఉన్న 50,009 పశువులకు సేవజేస్తున్నాయి.

మత్స్య పరిశ్రమాభివృద్ధి

కొత్తపేట సమితిలో చేప పిల్లల పెంపక క్షేత్రం కూడా ఉంది. 1964 నుంచి అమలులో ఉన్న మత్స్య విస్తరణ పథకంవల్ల 125 50 ఎకరాల విస్తీర్ణం కలిగిన 72 చెరువులు చేపల పెంపకం క్రిందకు తీసుకొని రావడం జరిగింది. 1972-73 సంవత్సరంలో 1,36,260 చేపపిల్లలను అందజేసి చెరువులలో వేసి పెంచేటందుకు ప్రోత్సహించటం వల్ల 74 మెట్రిక్ టన్నుల చేప ఉత్పత్తి అయింది.

రహదారుల అభివృద్ధికి ఈ సమితి ఏవిధమైన చర్యలు తీసుకొందో వివరించండి అని ప్రశ్నించగా బి డి ఓ. శ్రీ అప్పారావుగారిలా అన్నారు. ఒక ప్రాంతం ప్రగతికి ఆప్రాంతంలో రహదారుల అభివృద్ధి ముడిపడి ఉంది. కొత్తపేట సమితిలో అమలాపురం, ముక్తేశ్వరం, గన్నవరం, కాలువలు దాటటానికి సమితి రాక పూర్వం బల్లకట్టులే ఆధారం. కాని ఈ నాడు బల్లకట్టు అవసరం లేకుండా పోయింది. వివిధప్రాంతాలలో వంతెనల నిర్మాణం జరిగింది. రావులపాలెం, మందపల్లి, వాడపాలెం, వెదిరేశ్వరం, గోపాలపురం గ్రామాలలో కాలిబాట వంతెనలు నిర్మాణం జరిగితే, లొల్ల, వానపల్లి, కొత్తపేట, గంటిపెదపూడి గ్రామాలలో చిన్నచిన్న వాహనాలు వెళ్ళే వంతెనల నిర్మాణం జరిగింది. కొత్తపేట సమితి ఎనిమిది మైళ్ళ రహదారులను వేసింది. ప్రభుత్వం ఈ సమితిలో 51 మైళ్ళ రహదారులను వేసింది. జిల్లా పరిషత్తు ఆధీనం క్రింద 37 మైళ్ళ నిడివి గల రహదారులు

ఉన్నాయి. అన్ని గ్రామాలకు రహదారుల సౌకర్యం ఏర్పాటు చేయబడింది. వివిధ రకాలైన 134 రహదారుల నిర్వహణకు, నిర్మాణానికి కొత్తపేట సమితి విరివిగా విరాళాలు అందజేసింది.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు

ఊబలంక, వానపల్లి గ్రామాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు నెలకొల్పబడ్డాయి. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాల నిర్మాణానికి ఒక్కొక్క దానికి 38,000 రూపాయలు చొప్పున ఖర్చుచేసింది. ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం పొంది దేవరపల్లి, పొడగట్లపల్లి, నార్కడంపల్లి, ఆత్రేయపురం, ర్యాలి, ఈతకోట, వెలిచేరు, గంటిపెదపూడి గ్రామాలలో ఏడేసి వేల రూపాయలు ఖర్చుచేసి కుటుంబ నియంత్రణ ఉపకేంద్రాల భవనాలు నిర్మించింది

ప్రధాన గ్రామాలలో 20 ప్రాథమిక పాఠశాల భవనాలు, హరిజన వాడల్లో 13 ప్రాథమిక పాఠశాల భవనాలు కొత్తపేట సమితి నిర్మించింది. గంటి, వానపల్లి, ఊబలంక, ఏనుగు మహల్, కొత్తపేటశివారు, శ్రీనివాస్‌పేట, కొమరరాజు లంక గ్రామాలలో ఒక్కొక్క గ్రామంలో 12 వేల రూపాయలు ఖర్చుచేసి, పేరవరం గ్రామంలో 18 వేల రూపాయలు ఖర్చుచేసి హరిజనులకు పాఠశాల భవనాలు నిర్మిస్తున్నది సమితి. 723 మంది హరిజన కుటుంబాలకు కొత్తపేట సమితి నివేశన స్థలాలను ఏర్పాటు చేసింది. ముమ్మిడి వరప్పాడు, గోపాలపురం, వెలిచేరు గ్రామాలలో హరిజనులకు నివాసగృహాలను ఏర్పాటు చేసింది.

గంటి పెదపూడి, ముమ్మడి వరపుపాడు, పొడగట్లపల్లి, వాడపల్లి, రాజవరం గ్రామాలలో పరిరక్షిత మంచి నీటి పథకాలను, పంచాయతీలు అమలు పరచటానికి కొత్తపేట సమితి దోహదం చేసింది. 152 మంచి నీటి బావులను సమితి తవ్వించి గ్రామాలలో మంచినీటి సౌకర్యం ఏర్పాటుచేసింది.

సహకార రంగం ప్రయోజనాన్ని సమితుల్లో ఉన్న 17,138 కుటుంబాలలో 10,608 మంది గ్రామీణ కుటుంబాలు పొందు తున్నాయి. అంటే నూటికి 63 కుటుంబాలు లాభాన్ని పొందు తున్నాయన్నమాట. కొత్తపేట గ్రామంలో రజకుల, నాయి బ్రాహ్మణుల, రిక్షా కార్మికుల సహకార సంఘాలు, దేవరపల్లి గ్రామంలో రజకుల సహకార సంఘం వెనుకబడిన జాతుల ఉద్ధరణకు ఎనలేని సేవచేస్తున్నాయి.

వాడపాలెం గ్రామ ప్రజలు ప్రాథమికోన్నత పాఠశాలకు భవనాల ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించుకొన్నారు సమితి ఆర్థికస్థితి ప్రజలకు వివరించగా ప్రజలను వారిని ఉదారంగా విరాళాలు అందజేశారు. 10,000 రూపాయలు విలువ గల భూమిని కొని భవన నిర్మాణానికి దాన పత్రాన్ని వ్రాసి ఇచ్చారు. ఆగ్రామ ప్రజలు భూమినికొని యివ్వడమే గాక 40,000 రూపాయలు విరాళాలు అందజేసి భవనాల నిర్మాణానికి దోహదం చేశారు.

అంకంపాలెం గ్రామపంచాయతీ సర్పంచ్ శ్రీ కుదప సురేంద్ర కూడా ప్రభుత్వం దగ్గర నిధుల కొరత గ్రహించి ఎంత గానో ముందుకు వచ్చి ప్రజా శక్తిని సమీకరించేటట్లు చేశారు. 20 వేల రూపాయల అంచనా ఖర్చులో అంకంపాలెం పంచాయతీ వేసిన రెండు మైళ్ళ నిడివిగల మట్టి రోడ్ల పనికి ఐదువేల రూపాయలు విలువ గల శ్రమదానం చేశారు. ఒకభవనాన్ని నిర్మించి దానికి పశువుల ఆసుపత్రి నెలకొల్పు కొనటానికి విరాళము ఇచ్చారు ఆ గ్రామ ప్రజలు. గన్నవరంకాల్వ మట్టి రహదారి వేయటానికి 4,000 రూపాయలు విలువగల శ్రమదానం చేశారు. 2,70,000 రూపాయలు విలువ జేసి ఒక వంతెన నిర్మాణానికి 67,500 రూపాయలు విరాళం ఇచ్చారు. యువకులైన శ్రీ కుదప సురేంద్ర నాయకత్వం ప్రజాశక్తి సమీకరించడానికి ఎంతగానో తోడ్పడింది.

లొల్ల గ్రామ హరిజనులు 5,000 రూపాయలు విలువజేసే ఒక భవనాన్ని నిర్మించి పంచాయతీ రేడియో పెట్టుకొనటానికి గాను ఆ పంచాయతీకి విరాళంగా ఇచ్చివేశారు. హరిజనులను చైతన్య వంతులను చేయటంలో ఆ గ్రామ పంచాయతీ సర్పంచ్ శ్రీ ముక్కవిల్లి శ్రీరామచంద్ర మూర్తిగారు చేసిన కృషి ప్రశంసనీయమైనది.

రావుల పాలెంశివారు పూరిటవాని చెరువు గ్రామంలో మూడు వేల రూపాయలు విలువ జేసే భవనాన్ని స్వయం సహాయ కార్యక్రమం క్రింద ఏ విధమైన ప్రభుత్వ సహాయం లేకుండానే నిర్మింప జేయటం జరిగింది.

వద్దిపర్రు గ్రామంలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలకు ఆరు వేల రూపాయలు విరాళాలు పోగు చేసి ఆ విరాళాలతో ఒక భవనాన్ని నిర్మించడమైనది. హరిజనులకు 42 ఇళ్ళను నిర్మించడమేగాక హరిజనవాడలో 4800 రూపాయలు ఖర్చుచేసి మంచి నీళ్ళ పైపులను కూడా వేసింది గ్రామపంచాయతీ.

గోపాలపురం గ్రామంలో ప్రజలు అభివృద్ధి కార్యక్రమాలకు ఉదారం విరాళాలు అందజేస్తున్నారు గోపాలపురం గ్రామంలో కీలక పశుగణాభి వృద్ధి కేంద్రాన్ని ప్రారంభించటానికి 5200 రూపాయలు, గ్రామీణ ఆసుపత్రిని స్థానిక ఆసుపత్రిని స్థానిక ఆసుపత్రిగా మార్చటానికి 7,500 రూపాయలు మూడు కుంచాల భూమిని పశువుల ఆసుపత్రిలో పరికరాలు కొనటానికి రెండు వేల రూపాయలు గ్రామ ప్రజలు విరాళం ఇవ్వగా పంచాయతీ పశువుల ఆసుపత్రికి రిఫ్రిజరేటర్ కొనటానికి 2,000 రూపాయలు విరాళం ఇచ్చింది. 25 వేల రూపాయలు ఖర్చుతో నిర్మించిన ఒక వంతెన నిర్మాణ కార్యక్రమానికి 6,250 రూపాయలు గ్రామప్రజలు విరాళం అందజేశాయి.

ఈ విధంగా కొత్తపేట సమితిలో వివిధ గ్రామాలలో ప్రజలు ముందుకు వచ్చి సహకరించడమే ప్రత్యేకత.

ప్రాచీనాంధ్ర కవయిత్రులు

డాక్టర్ పి. యశోదా రెడ్డి

(గత సంచిక తరువాయి)

కవులు నీలాలపోగులు, నీర్కావి ధోవతులు, మేలుకుళ్లాయలు కుసిమితావళులు, శాలువలు, తలపాగలు ధరించి ప్రవేశించినారు.

ఇక గొల్లమల్లి 'గఙ్ఞునద్రేన్చు జిఙ్ఞుమని' ప్రవేశించినట్లు చెప్పి ఆ నాటి గొల్లల అమాయికతను ప్రదర్శించినది పీరి వేషము వలెనె మాట సయితమ్ము గ్రామీణ మైనది "వొరెవొరె కూడు దినివ స్తవంటరా? కూరాకేమిరా ?" అని వెఱ్ఱిగొల్ల మాట్లాడినాడు.

విద్వాంసుడు "వోయి మేము బాపలముగాదిష మీ ఇంట్లో కూడు దిందుమా?" అని సమాధానము చెప్పినాడు. ఈ విధముగా రంగాజమ్మ ఆయా వృత్తులవారి మాటలనే కాక తన గ్రంథమునందు సంస్కృతము మరియు శౌరశేని, మాగధి. మహారాష్ట్రి మున్నగు ప్రాకృత భేదములను ప్రవేశపెట్టి రచన చేసినది. ఇట్టి మహాగ్రంథములో ద్విపదలు, దరువులు, శ్లోకములు, సీసములు, చూర్ణికలు, వచనములను శృంగార కరుణ హాస్యాది రసములను ప్రవేశపెట్టుటయే కాక ఈమె వేదాంత, శబ్ద, తర్క, జ్యోతిష, పూర్వమీమాంసాది శాస్త్ర ప్రావీణ్యమును ప్రదర్శింపజేయుచు రచన గావించిన విద్యా విశారద.

ముద్దు పళని

రంగాజమ్మ తరువాత పేర్కొనదగిన కవయిత్రి ముద్దు పళని. ఈమె చిన్నికృష్ణుని శృంగార భక్తురాలు. అంతేకాదు ఆ స్వామి "కరుణాకటాక్ష వీక్షణ ప్రవర్ధమానానూన శృంగారరస ప్రధాన సంగీత సాహిత్య భరత శాస్త్రాది విద్యా పారంగత" ఈమె కేవలము విద్యా మహిమ్మచేతనేకాక సౌందర్య మహిమ్మచేత కూడ రంభయై అల ప్రతాప సింహేంద్రుని పెంపు వహించినది. ఈమె రచించిన గ్రంథము రాధికా సాంత్వనము. దీనికే 'ఇళాదేవీయ' మని పేరు కలదు. ఈ గ్రంథమందీమె కొన్ని ఎడల సభ్యతా పరిధులను దాటి అతివేల శృంగారమును వర్ణించినది, కాని శ్రీకృష్ణుని ప్రశంస ఎచ్చట వచ్చినను ఈ పళని తన్ను తామరచి ఆ రసాంబుధి యందు తల మునకలై తేలిపోవుచుండును. ఉదాహరణమునకు పళని కలయందు కానవచ్చిన శ్రీకృష్ణుని వర్ణించుచు.

"కటిని జుట్టిన కనకాంబరముతోడ
మెఱుగుచామని చాయ మేనితోడ
నాసిక తుదగల్గు నవమౌక్తికముతోడ
జిగిలి కస్తురి బొట్టు మొగముతోడ
బ్రతి యెఱుంగని దివ్యరూపమ్ము తోడ"

అని వర్ణించినది. ఈ రచనము చిత్రకారుడు కుంచియను చేబూని వర్ణములనుంచి అత్యంత సుకుమారముగా, సుందరముగా తీర్చుటకు అనువై విపులమై ఉన్నది.

ఇట్లే ఈమెవొక్కచోట శ్రీకృష్ణుని ప్రభావమును రాధనోట చెప్పించుచు:—

"తనర ప్రేపల్లెలోఁగల తలిరుబోండ్లు
హరికపట చర్యలకు మోహితాత్మలైరి
యెప్పుడును జేరి మెప్పించు చొప్పుఁజూచి
మరులు పూనరె సతులైన మౌనులైన"

అని రచించినది. ఈ పద్యములో శ్రీహరియొక్క దివ్యమంగళ విగ్రహమేకాక, వృత్తము సయితము ఆదిమౌనులను, పతివ్రతామతల్లులను మరులుగొల్పునంతటి ఆకర్షకమైనట్లు చెప్పినది అందుకే ఆ స్వామి కపట చర్యలను చూచి వ్రజవనితలు మోహితాత్మలగుటలో వింత లేదని చెప్పి శ్రీహరి బాహ్యాంత సౌందర్య సంపత్తిని పొగడినది.

ఇట్లే మరొక్కచోట రాధ శ్రీకృష్ణుని చక్కదనమును వర్ణించుచు:—

'బారను గొల్వగా మీరు వక్షమువాడు
తలచుట్టి వచ్చు నేత్రములవాడు
చక్కని పాల్గాఱు చెక్కులవాఁడు
చిగురాకులను నేరినగు పాదములవాడు''

అని వర్ణించి. చివరకు 'మదనకోటులఁగొనగోట నదుమువాఁడు చారుతరమూర్తి గోపాల చక్రవర్తి" అని వివశయై హృదయైకవేద్యము, ధ్యానగమ్యమైన ఆ స్వామి రూపును లోకోత్తరముగా చెప్పినది. అంతేకాక రాధ వ్యపదేశముచేత ఈమె విరహమునొక దివ్య శృంగార రస ప్లావితమైన మధుర భక్తిగా వర్ణించినది. అంతేకాదు స్వామితోతాదాత్మ్యమును భజించి రెప్పపాటు కాలమేని అతని నెడబాసి ఉండలేని పరమ భక్తాగ్రణివలె రాధ శ్రీకృష్ణ విరహాతురయై ఆతనికి సందేశమును పంపుచు—

"నా కృష్ణదేవుని నా ముద్దు స్వామిని
నా చక్కనయ్యను నాదు హరిని
నా నోము పంటను నారాజ తిలకుని
నా రాము తమ్ముని నాదు విభుని
నా మనఃకాంతుని నానంద తనయుని
నా ప్రాణ నాధుని నాదు ప్రియుని

చేరి కన్నుల కఱవెల్ల దీరగాంచి
చాల నడిగితి మ్రొక్కితి గేలుసాచి
కౌగిలించితి గరముఱ కనుల జేర్చి
కొంటి రమ్మంటి మది వేడుకొంటినని "

చెప్పుమని చెప్పినది. అంతేకాక ఆ మోహనాంగుని చూచి సందేశ హరయై వెళ్లిన చిలుక ఎక్కడ సొక్కి మైమరచి తన మాట మరచునో యను సందేహముతో రాధ-

మోహనాంగుని తియ్యమోవి బింబమటంచు
మది జొక్కి నా మాట మఱవవలదు
కంసారి పలుకులు కండ చక్కెర లంచు
మది దక్కి నా మాట మఱవ వలదు
రమణు చల్లని చూపు అమృత పూరమటంచు
నెటి జిక్కి నా మాట మఱవవలదు

అని చెప్పుచునే............

'వాని గనిరేని ఘనమోహ వనధిలోన
మరగి మునుగుదురాయాదిమౌనులైన
పలుకనేటికి మన వంటి వారిగాన
గిరమూతెల్విగొని తెల్పుకొరి తోడ ".

అని చిలుకకు బుద్ధిగరపినది. ఈ పద్యమీమె భక్తి భావమున కంతటికి పతాకవంటిది. ఈ పద్యమందలి శృంగారము దివ్యరతిక మైనది. దీనిలో ఇంద్రియ తర్పణా రూపమైన కామోప భోగము కన్న ఆదిమౌనులను సయితము మరులు గొల్పు దివ్యానుభూతి ప్రదిలమై ఉన్నది. అందుకే రాధ తానొక భక్తురాలివలె శ్రీ కృష్ణ విరహమును గూర్చి......

" కలుగు నా కన్నుల కఱవెల్ల దీరంగ
గమలాక్షు నెమ్మోము కనుగొనంగ
వేవేగ నబ్బు నా వీనుల విందుగా
దనుజారి వీణనాదము వినంగ
నలవడునా చేతులతి పుణ్యమందంగ "


అని తహతహలాడుచు రాశిబోసిన శృంగార రసమనగ, చవులకు దోచు కరుణాతిశయమనగనున్న ఆ కృష్ణదేవునియందు తానైక్య మును పొందుటకు తివిరినది. ఇట్టి మధురభక్తి విధానమును ప్రవేశ పెట్టుటచే ముద్దుపళని కావ్య కల్మషమునంతటిని ప్రక్షాళన మొనర్చి పులుగడిగిన ముత్తియముగావించి తాను ధన్యయైనది.

తరిగొండ వేంకమాంబ

ఈమె తర్వాత పేర్కొనదగిన ప్రాచీన కవయిత్రులలో తరిగొండ వేంకమాంబ ఒకర్తుక. ఈమె బాల్యమాది తన జీవిత మును వేంకటాచలపతియై వెలసిన శ్రీనివాస దేవున కంకిత మొన ర్చిన పావన చరిత. శ్రీ శ్రీనివాస దేవుని యనుగ్రహముచేత సిద్ధించిన కవితా శక్తిని ఆయన కథలను కీర్తించుటయందే పొందు పరచిన పుణ్యశీల. ఈమె 1. వేంకటాచల మహాత్మ్యము, 2. వాసిష్ఠ రామాయణము, 3. రాజయోగ సారము, 4. విష్ణు పారిజాతము మున్నగు గ్రంథములను రచించినది.

ఈమె కవిత్వమునందు రసానందమునకన్న తత్త్వబోధనా రూపమగు విషయ విన్యాస మధికముగ గోచరించుచుండును. అయి నను అచ్చటచ్చట తన స్త్రీసహజమైన వినోదానక్తి గోచరమగుచునే ఉండును. ఉదాహరణమునకు వేంకటాచల మాహాత్మ్యమునందు వేంకటాచలపతి, పద్మావతిని పెండ్లియైనప్పు డాంధ్రుల ఆచారము లన్నియు క్రమముదప్పక వర్ణితములైనవి.

అట్లే విష్ణుపారిజాతమున కొరవంజి ఎఱుక చెప్పునప్పు డును, సింగి-సింగడు జగడములాడినప్పుడును హాస్యరసమును పరిపోషించుచు రచించి కావ్యములు సుందరతరము కావించినది ఈ విధముగ ఆంధ్ర స్త్రీలు మధ్యయుగములందు రాజకీయ వ్యత్య యమునకు లోబడి అటునిటు కదలరాని పరిస్థితులందు సయితము ఎట్టులో అవకాశమును కల్పించుకొని ఆంధ్రభాషా యోషను అలం కరించుటకు ప్రయత్నించి పురుషులతోపాటు తమవంతు చెల్లించి కీర్తనీయ చరితలై నేటికిని నిలచినారు.



సంక్షిప్త తెలుగు సాహిత్య చరిత్ర

శ్రీ కె. ఆర్. కె. మోహన్

3

"ఓరి మీరు ఇంకా నిద్రపోలేదట్రా" అంటూ లోనికి ప్రవేశించాడు ప్రసాదం మామయ్య మేలుకొని సావిట్లోనే కూర్చున్న పిల్లల్ని చూస్తూ.

"ఇవ్వాళ కథ చెప్తానన్నావుగా మామయ్యా" అంది విమల.

"కథకాదే వెర్రిమొహమా...తెలుగు సాహిత్య చరిత్ర." అన్నాడు రవి, విమలని చూస్తూ.

"అక్కడిక తనకి అవన్నీ పెద్దతెలిసినట్లు!" అంది మాధవి తన పెద్దరికం చూపిస్తూ.

"ఆగండర్రా...ఇదికూడ కథ లాంటిదేనర్రా" అన్నాడు మామయ్య నవ్వుతూ.

"ఉండండర్రా. మామయ్యని అన్నమైనా తిననిస్తారా లేదా?" అని పిల్లల్ని కోప్పడి "తమ్ముడూ...నువ్వు భోజనానికిలే" అంది రమణమ్మ వంటింట్లోంచివచ్చి.

వద్దమ్మా భోజనం చేసేవచ్చాను. బావ భోజనం అయిందా?' అన్నాడు ప్రసాదం.

"అదేమిట్రా రాత్రిపూటైనా భోజనానికి రాకూడదా! ఊఁ... బాగుంది. ఆయన భోజనంచేసి ఇప్పుడే సిగరెట్లు తెచ్చుకోడానికి బయటకు వెళ్ళారు. నువ్వు కాళ్ళు కడుక్కొని బట్టలు మార్చుకొనిరా. కాసిని పాలేనా తాగుదుగాని" అంటూ తిరిగి వంటింట్లోకి వెళ్ళిపోయింది రమణమ్మ.

ప్రసాదం లోనికివెళ్ళి కాళ్ళు కడుక్కొని, బట్టలు మార్చుకొని తిరిగివచ్చి కూర్చున్నాడు.

రమణమ్మ ప్లేట్లో రెండు అరటిపళ్ళు, గ్లాసులోపాలు తీసుకు వచ్చింది.

ప్రసాదం, పళ్ళుతినేసి పాలు త్రాగుతోండగా భాస్కరరావు సిగరెట్లు తెచ్చుకొని ఇంట్లోకి వచ్చాడు. వస్తూనే "అదేమిటోయ్ బావా... ఉపన్యాసంఇచ్చి గొంతు పోయిందా ఏమిటి? మిరియాల పాలు త్రాగుతున్నావు!" అన్నాడు ప్రసాద్ని చూసి నవ్వుతూ.

"అన్నీ మీ ఊహలేకాని మిరియాలెక్కడ ఉన్నాయయ్యా! ఉంటేమాత్రం నీ సిగరెట్ వాసనలో, వాటి వాసన తగుల్తుందాఏమిటి?" అన్నాడు ప్రసాద్ నవ్వుతూ.

"మామయ్యా...కథచెప్పడం మానేసి, నాన్నతో కబుర్లాడుతున్నావు. నాకూ నిద్రవస్తోంది" అంది విమల గునుస్తూ.

వాళ్ళకేకాదయ్యోయ్. నాకూ చెప్పాలి." అంటూ కుర్చీలో కూర్చున్నాడు భాస్కరరావు.

"మీరేనా వినేవాళ్ళు? నేనూ ఉన్నాను ఇక్కడ" అంటూ వంటింట్లో పని ముగించుకుని, చెయ్యి చెంగుకి తుడుచుకుంటూ వచ్చి గోడనానుకొని కూర్చుంది రమణమ్మ.

"సరేనర్రా... మీ అందరికీ వినాలని ఇంత కుతూహలంగా ఉంటే నాకు చెప్పడానికేముంది?" అంటూ గొంతు సవరించుకున్నాడు ప్రసాదం మామయ్య.

"అంతా నిశ్శబ్దంగా ఉండండర్రా" మామయ్య హరికథ మొదలు పెడ్తున్నాడు అన్నాడు భాస్కరరావు పరియాచికంగా.

"అబ్బబ్బ మీరు అడ్డుపుల్లలు వేయకండి" అంటూ చిరాకు పడింది రమణమ్మ.

"నువ్వుండు నాన్నా" అంటూ బుంగమూతి పెట్టింది విమల.

భాస్కరరావు నవ్వి ఊరుకున్నాడు.

ప్రసాదం మామయ్య చెప్పడం మొదలు పెట్టాడు.

"—మన భాషని గురించి తెలుసుకొనేముందు మన జాతిని గురించి కొంత తెలుసుకోవాలి. మనది అంటే మన ఆంధ్ర జాతి చాలా పురాతనమైనది. అంటే మన దేశంలో ఉండిన చాలా పాత జాతులలో ఒకటన్నమాట. మన ఆంధ్రజాతిని గురించి మహాభారతంలో ప్రసక్తి ఉంది. భారతకాలం ఎప్పటిదో తెలుసా. ఐదు వేల సంవత్సరాల నాటిది. అంటే సింధునాగరికత నాటిదన్నమాట. ఇలాగే మత్స్యపురాణంవంటి కొన్ని ప్రాచీన పురాణాల్లోకూడా మన జాతిని గురించిన ప్రసక్తి ఉంది."

"మామయ్యా విశ్వామిత్ర మహర్షికి తన పుత్రులమీద కోపం వచ్చి వారిని అంధులై అంటే గ్రుడ్డివాళ్ళయిపొమ్మని శపించాడనీ, వాళ్ళే దక్షిణాపథంగావెళ్ళి ఆంధ్రులయ్యారనీ మా మాష్టారుచెప్పారు నిజమేనా?" అంది మాధవి.

"అవునమ్మా...ఆ కథకూడాఉంది. అంతేకాదు, గోండులు అనే అడవి జాతులవాళ్ళకి, టీకం, మార్కం, పూసం, తెలింగం అనే నలుగురు దేవతలు ఉన్నారు. వీరిలోని 'తెలింగం' అనే దేవుడే మన తెలుగుజాతికి మూలపురుషుడు—అని అనుకోవచ్చు. ఎందుకంటే వీళ్ళు, కోయలూ, ఇంకా కొందరూ, మన తెలుగు దేశంలో అనాదిగా వుండిన, నాగజాతివాళ్ళు. అందువల్ల వీటన్నిటి వల్లా తేలేదేమిటంటే, మన తెలుగుజాతి చాలా పాతదన్న విషయం" అని చెప్పడం ఆపి ఆవలించాడు మామయ్య.

"మామయ్యా నువ్వు ఒకసారి 'ఆంధ్ర' అంటున్నావు. మరొకసారి 'తెలుగు' అంటున్నావు. మరి మనకి రెండు రకాల పేర్లున్నాయా?" అనడిగాడు రవి.

"రెండేకాదు. రెండుకన్నా ఎక్కువే ఉన్నాయి. జాతిపరంగా చెప్పుకోవాలంటే. 'ఆంధ్రులు' అంటాము. భాషవిషయం చెప్పాల్సి వస్తే 'తెలుగు'అని అంటాం. ఏది ఎట్లా అన్నా నష్టంలేదు. 'ఆంధ్రజాతి-ఆంధ్రభాష తెలుగు జాతి-తెలుగుభాష"—ఈ విధంగా ఎట్లాఅన్నా పర్వాలేదు. మనం మనమే" అన్నాడు మామయ్య.

"మనకి పేర్లు రెండుకంటె ఎక్కువే ఉన్నాయన్నావు. అదేమిటి మామయ్యా?" అంది విమల

"అదే చెప్పవస్తున్నాను. ఆంధ్ర, తెలుగు అనే రెండు పేర్లుచెప్పాను కదా. తెలుగునే 'తెలుంగు'అని అనేవాళ్ళు ఇప్పటికీ తమిళులు మన భాషను 'తెలుంగు' అనే అంటారు. ఉత్తర భారత దేశం వాళ్ళు, మహమ్మదీయులూ, మన భాషని 'తెలంగి'లని మనల్ని 'తెలంగీ'లని అంటారు. ఇవికాక 'తెనుగు' అనికూడా ఉంది"

"ఇన్ని పేర్లు ఎందుకు వచ్చాయి మామయ్యా?" అని అడిగాడు రవి.

"ఆంధ్ర శబ్దం ఎల్లా పుట్టిందో సరిగా తెలియదు. బహుశా విశ్వామిత్రుని పుత్రులు గుడ్డివాళ్ళయిపోడంచేత 'అంధులుగా' పిలువబడి ఉండవచ్చు. ఆ 'అంధ' శబ్దమే తర్వాత తర్వాత 'ఆంధ్ర'గా మారిఉండవచ్చు. ఈ ఊహ నిజమే అనవచ్చు ఎందుకంటె బౌద్ధ జాతికి కథలలో ఒకటైన 'సెరివానిజ జాతకం' కథలో ఒక 'అంధ పురం' గురించి ప్రసక్తిఉంది. ఇది తెలవాహనదీ తీరాన ఉండేదట. మహానదికి ఉపనదియై 'తెల్' అని ఈనాడు మనం పిలుస్తున్నదే ఈ తెలవాహనది. ఈ ప్రాంతం ప్రస్తుతం ఒరిస్సాలో నున్నా, ఒకప్పుడు ఇదంతా తెలుగు ప్రాంతమే.

ఇక పోతే 'తెలుగు లేక తెలుంగు' శబ్దము త్రికళింగ, లేక త్రిలింగ శబ్దములనుండి వచ్చిందని కొందరి ఊహ. త్రిలింగము లనగా శ్రీశైలము, సింహాచలము, కాళేశ్వరము(వేములవాడ) ఈ మూడు క్షేత్రముల మధ్యనున్న ప్రదేశములో నివసించేవారు త్రిలింగులు లేక తెలుంగులని వీరి ఉద్దేశము.

తర్వాత 'తెనుగు' అనే పదానికి 'తేనె+అగు' అనగా తేనె వలె మధురంగా ఉండేటటువంటిది, కనుక 'తెనుగు' అయిందని మరికొందరి ఊహ. ఏమైనా ఇవన్నీ ప్రాచీనకాలం నుంచి ప్రచారంలో ఉన్న పేర్లే."

"అయితే మొట్టమొదటి నుంచి కూడా ఈ మూడుపేర్లూ ఉన్నాయా?" అని అడిగింది మాధవి.

"ఏమో-ఆ విషయం తెలియదు. అయితే చరిత్ర నిర్దేశాల ప్రకారం, ఏ పదం మొట్టమొదటిదని ఎప్పుడు వాడబడిందో చెబుతాను. తమిళంలో 'అగత్తియం' అనేది అతి ప్రాచీనమైన గ్రంథం, అందులో 'కొంగణం కన్నడం కొల్లం తెలుంగం అనే సూత్రం ఉంది. ఈ గ్రంథం క్రీ.శ. 6వ శతాబ్దానికి చెందినది కనుక 'తెలుంగు' అనే పదం, ఈ కాలానిదిగా లెక్కవేసుకోవచ్చు.

నన్నయ్యగారి కంటే కొంత ముందుకాలానికి చెందిన 'ఉద్యోతనుడు' అనే ప్రాకృత భాషాకవి ఉండేవాడు. ఈయన 'కువలయ మాల' అనే కథలో ఆ కాలంలో పేరులోనున్న పద్దెనిమిది దేశాల వాళ్ళనీ వాళ్ళ భాషలని గురించీ వ్రాశాడు. అందులో ఆంధ్రుల గురించీ ఆంధ్రభాష గురించీ కూడా ఉంది."

"మనల్ని గురించి ఏమి చెప్పాడు మామయ్యా?" అంటూ అడ్డు తగిలాడు రవి.

"చాలా బాగా చెప్పాడురా. ఆంధ్రులకి అందకత్తెలన్నా, యుద్ధమన్నా సమానమైన ఇష్టమట. వాళ్ళు అందమైన శరీరాలు గలవారుట. అంతకంటే ఇంకో విశేషం-ఒరే వాళ్ళు నీలాగే తిండిలో దిట్టలట" అన్నాడు మామయ్య.

అందరూ ఫక్కున నవ్వారు.

"పో...మామయ్యా" అంటూ మూతిముడుచుకున్నాడు రవి.

ఇకపోతే 'తెనుగు' అనే పదం గురించి చూద్దాం. నన్నయగారు వ్రాసిన 'భారతం' తెలుగులో మొట్టమొదటి పుస్తకంగా చెప్పబడుతోంది. అందులో నన్నయగారు మన భాషను 'తెనుగు' భాష అన్నారు. అల్లాగే ఆ కాలంనాటికే మనభాషకి 'ఆంధ్ర'భాష అని కూడా పేరున్నట్లు తెలుస్తోంది. ఎందుకంటే భారతం వ్రాయడంలో తనకు సహాయంచేసిన నారాయణభట్టు, ఆంధ్రభాషలోకూడా కవిత్వం చెప్పగలడని ఆయన వ్రాశాడు. ఈ నారాయణభట్టు కన్నడంవాడు, అయితే ఆ రోజుల్లో కన్నడకవులకు 'తెలుగు, తెలుగు కవులకు కన్నడం కూడా వస్తుండేవి. ఈ నన్నయగారు 11వ శతాబ్దికి చెందినవాడు. కనుక 'తెనుగు' అనే పదం కనీసం 11వ శతాబ్ది నుంచి ఉందని అనుకోవచ్చు."

"భారతం తెలుగులో వ్రాసిన మొదటి పుస్తకం అంటున్నాం మరి అంతగా ముందు తెలుగులో పుస్తకాలు ఎవరూ వ్రాయలేదా మామయ్యా?" అని అడిగాడు రవి.

"తప్పక ఉండేఉంటాయి. లేకంటే భారతం స్థాయిలోనున్న ఉత్తమ గ్రంథం ఉన్నట్లుండి పుట్టుకరాదు. అయితే మన దురదృష్టవశాత్తూ అటువంటి గ్రంథాలు దొరకలేదు. కనుక భారతాన్నే మనం మొదటి పుస్తకంగా భావించుకొంటున్నాము". అన్నాడు వసాదం మామయ్య.

"ప్రాచీన శాసనాలలో కొన్ని కవిదోరణిలో ఉన్నాయని విన్నాను. నిజమేనా?" అని అడిగాడు భాస్కరరావు.

"అబ్బో! బావగారికి నిజంగానే సాహిత్యాభిలాష పెరుగుతోందన్నమాట... క్రీ.శ. 84'లో గుణగ విజయాదిత్యుడనే రాజు తెలుగుదేశాన్ని పాలించేవాడు. ఈతడు చాళుక్యవంశపువాడు. ఈతడు తెలుగుభాషలో ఒక లక్షణగ్రంథాన్ని వ్రాయించినట్లు ప్రతీతి. ఈ గ్రంథం మనకు దొరకలేదు. కాని నన్నెచోడకవి తన 'కుమార సంభవం' లో వ్రాసినదానిని బట్టి ఈ విషయం మనకు తెలుస్తోంది. అందులోనాతడు గతంలో చాళుక్యరాజులు, మార్గకవిత్వంలో ఉండగా దేశి కవితను పుట్టించి తెనుగుని వివరించు అని వ్రాశాడు. ఆ తర్వాత ప్రస్తుతం ప్రకాశం జిల్లాలోనున్న అద్దంకి గ్రామంలో గుణగ విజయాదిత్యుని సేనాని పండరంగడనీ వాడు వేయించిన దాన

శాసనం ఒకటి బయట పడింది. అందులో తియ్యని తెలుగులో 'తరువోజ' అనే పేరుగల పద్యం ఒకటి ఉంది."

"అదేమిటో కాస్త వినిపించవయ్యా బావయ్యా" అన్నాడు భాస్కరరావు.

"అట్లాగే అంటూ చేతి సంచీలోనుంచి ఒక డైరీని తీసుకొని వచ్చి అందులోంచి పద్యాన్ని చదవసాగాడు ప్రసాదం మామయ్య.

"పట్టంబుగట్టిన ప్రథమంబు నేణు
బలగర్వమొప్పంగ బైలేచి సేవ
పట్టంబు గట్టించి ప్రభు పండరంగు
బంచిన సామంత పడువటిబోయి
కొట్టముల్ పంద్రెండు గొని వేంగినంటి
గొల్పి యా త్రిభువనాంకుశ బాణనిల్పి
కట్టెపు దుర్గంబు గడుబయల్సేసి
కందుకూర్బెజవాడ గావించె మెచ్చి

ఇది తొమ్మిదవ శతాబ్దంనాటి ముచ్చట. ఇదేవిధంగా అనేక ఇతర ప్రాచీన శాసనాలలో కూడా పద్యాలూ, వచనముకూడా కనిపిస్తుంది. ఇందువల్ల నన్నయకి పూర్వమే మంచి అభివృద్ధి చెందిన సాహిత్యము ఉండేదని ఊహించవచ్చు. అయితే దురదృష్టవశాత్తు అది మనకు దక్కలేదు."

"అయితే ఆనాటి పద్యాలలో ఈ 'తరువోజ' అనే పద్ధతి ఒకటేనా, ఇంకేమయినా రకాలు ఉండేవా?" అని అడిగాడు భాస్కరరావు.

"ఎందుకులేవు...చాలా ఉన్నాయి. ఇప్పుడు ప్రచారంలో ఉన్న ఎన్నో ఛందోరూపాలు ఆనాడూ ఉన్నాయి. అందులో కొన్ని చెపుతాను. కీ. శ. 850 నాటి గుణగ విజయాదిత్యుని కందుకూరు శాసనంలోని 'సీస' పద్యం ఉంది. ఇతనిదే క్రీ. శ. 848 నాటి ధర్మవరం శాసనంలో 'ఆట వెలది' ఉంది. ఇతనిదే కీ.శ. 848 నాటి కందుకూరు శాసనంలో 'తేటగీతి' ఉంది. ఇతనిదే. అదే కాలంనాటి సాతలూరు సంస్కృత శాసనంలో తెలుగు 'చంపక మాల' ఛాయలున్నాయి. క్రీ. శ. 885 నాటి యుద్ధమల్లుని బెజవాడ శాసనంలో 'మధ్యాక్కర' ఉంది. ఇతనిదే క్రీ. శ. 853 నాటి శాసనంలో 'కందం', 'మత్తేభం' ఉన్నాయి. క్రీ. శ. 980 నాటి చాదవ మహారాజు అరుంబాక సంస్కృత శాసనంలో తెలుగు 'కందం' ఛందం ఉంది. క్రీ. శ. 1000 నాటి విరియాల కామసాని శాసనంలో 'ఉత్పలమాల' ఉంది. క్రీ. శ 1022 నాటి రాజరాజు కోరుమిల్లి శాసనంలో 'రగడ' ఉంది."

"అబ్బబ్బ...ఆపవయ్యా బావా...తీగలాగితే డొంకంతా కదిపావు. ఎన్ని విషయాలు గుర్తుగా తేదీలతో సహా చెప్పగలిగావయ్యా!" అంటూ ఆశ్చర్యపోయాడు భాస్కరరావు.

"మామయ్యా...నీవు చెప్పినవన్నీ వింటే బుర్ర తిరిగి పోయింది" అంది మాధవి.

"అరే ... రవిగాడు అప్పుడే నిద్రపోయాడే" అంది రమణమ్మ.

"అప్పుడే అంటే ఇప్పుడేమైనా తక్కువయిందనుకున్నావా ఏమిటి? పన్నెండయింది" అన్నాడు భాస్కరరావు.

"అబ్బా...చాలా ఆలస్యమయిందర్రా...ఇంక పడుకుందాం మళ్ళీ రేపు చెప్తాను" అంటూ లేచాడు మామయ్య.

"హాఁమ్" మని ఆవులించి చిటికెవేస్తూ లేచింది రమణమ్మ అందరూ లేచి నిద్రకు ఉపక్రమించారు.

(సశేషం)

నవోదయం

నవంబరు ఒకటవ తేది
నవోదయం ఆంధ్రావనికిది!
అంధకారంలో వెలసిన కిరణం
ఆంధ్రప్రదేశ్ అవతరణం!!

గళమెత్తి ప్రతి ఆంధ్రుడు
మంగళ గీతి పాడిన రోజు!
శిరమెత్తి జాతి చరిత్ర
శిఖరాగ్రాన నిలబడిన రోజు!!

దశదిశల ఆంధ్రదేశ
యశఃకాంతి విరిసిన రోజు!
తెలుగు వెలుగు రేఖలు నేల
నాలుగు చెఱగుల పరచిన రోజు!!

ప్రతి గుమ్మానికి వ్రేలాడగట్టి
ప్రగతి తోరణాల మాల
ప్రణాళికా దీపకళిక పట్టి
ప్రజావళి కిచ్చెనది వెలుగు హేల!!

విశాలమైన పుర వీధులు
విశ్వ విద్యాలయాదులు
పచ్చని తరువుల పరిధులు
హెచ్చుగా పారే పయోనిధులు!

పసిడి పంటల నిచ్చే సీమ
ప్రజలను కాచే కనకదుర్గమ్మ
నృత్య, సాహిత్య, గాన నిలయం
సత్యం, శివం, సుందరాలయం!

అన్నపూర్ణ యను పేరును
గన్న దేశమిది!
ఎన్నెన్నో ఒడ్డిన అసువులు
కన్న కలలు పండించు
కున్న ప్రతి రూపమిది!!

అక్షర క్రమములో మొదటిది
అక్షయ పాత్రలాంటిది
అభ్యుదయ పథంలో నడుస్తోంది
అభివృద్ధిని సాధిస్తోంది!!

—టి. గౌరీశంకర్

25—8*

మహావీరుని ఉత్సవ కార్యక్రమాలు

—శ్రీ పి. ఎల్. భండారి

మహావీర భవన సముదాయం

మహావీరుని పేరుమీద ఒక ఆసుపత్రి, ఒక ఆడిటోరియం, ఒక ధ్యానమందిరం మొదలైన వాటితో మహావీర భవన సముదాయాన్ని ఏర్పాటు చేయడానికి హైదరాబాదు ఎ.సి.గార్డ్స్ ప్రాంతంలో 15,000 చ॥ గజాల స్థలాన్ని ఇవ్వడానికి రాష్ట్రప్రభుత్వం అంగీకరించింది. ఈ స్థలంతోపాటు అందులోవున్న భవనం కూడా సంక్రమిస్తుంది. ఇక్కడ ఎనిమిది అంతస్థుల ఆసుపత్రి భవనాన్ని నిర్మించడానికి హైదరాబాదు పురపాలక సంఘం అనుమతి కూడా లభించింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన మహావీర కమిటీ తొలి సమావేశంలో 10 లక్షల రూపాయల మేరకు విరాళాలు సేకరించగమని ప్రారంభంలో శ్రీ భండారి పేర్కొన్నారు. ఇప్పుడు 18 లక్షల రూపాయల వరకు విరాళాలు వస్తాయని అంచనా. అప్పుడే 4 లక్షల రూపాయలు విరాళాలు సేకరించడం జరిగింది. అసలు ఈ ప్రాజెక్టు అంతటికీ సుమారు ఒకటిన్నర కోట్ల రూపాయలు ఖర్చవుతుందని అంచనా.

ఆసుపత్రి భవన నిర్మాణం పని అప్పుడే ప్రారంభమైంది. నిర్మాణం మరికొంత జరిగాక మిగతా 4 వేల చ॥ గజాల స్థలాన్నీ, దానిలో వున్న మరో భవనాన్నీ అందజేయవలసినదిగా ప్రభుత్వాన్ని కోరడం జరుగుతుంది.

ప్రచురణ

డా॥ ఎన్. రమేశన్ వ్రాసిన "ఆంధ్రప్రదేశ్‌లో జైనమతం" అనే ఆంగ్ల గ్రంథాన్ని కమిటీవారు ప్రచురించాలని ఉద్దేశించారు. మహావీరుని ఉత్సవాలకోసం మంజూరు చేసిన లక్షరూపాల మొత్తంలోనుంచే యీ పుస్తక ప్రచురణ ఖర్చును కూడా భరించాలని ప్రభుత్వం పేర్కొనడం వలన, ఇంతకు ముందు మంజూరీ పొందిన అంశాలలో దేనిలోనైనా ఖర్చును ఆదాచేసి, ఆవిధంగా మిగిలిన సొమ్ముతో ఈ పుస్తకాన్ని ప్రచురించాలని కమిటీ ఉద్దేశించింది.

జిల్లా కమిటీలు అమలుజరిపిన కార్యక్రమాలు

అనంతపురంలో తొలి ప్రవచన దినోత్సవం నిర్వహించారు. మహావీర ఉత్సవ కమిటీ అధ్యక్షులైన డా. బెజవాడ గోపాలరెడ్డి గారు యీ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. సభ్య-కార్యదర్శి గారు కూడా యీ కార్యక్రమానికి హాజరయ్యారు.

జంతువుల అభయారణ్యం

హైదరాబాదు-విజయవాడ జాతీయ రహదారిలో హైదరాబాదుకు 13 కి. మీ. దూరంలో 3,000 ఎకరాల స్థలంలో జంతువుల అభయారణ్యాన్ని ఒక దానిని ఏర్పాటుచేసే విషయమై అటవీశాఖ వారితో చర్చించడం జరిగింది. అటవీశాఖకు చెందిన చీఫ్ కన్జర్వేటర్, తదితర అధికారులతో పాటు మహావీర ఉత్సవ కమిటీకి చెందిన సర్వశ్రీ పి. ఎల్. భండారి; టి. ఎల్. కపాడియా; సుందరమల్ లూనియా గారలు యీ ప్రాంతాన్ని సందర్శించారు. ఇక్కడ అభయారణ్యాన్ని ఏర్పాటు చేయడానికి అటవీశాఖా మంత్రి ఆమోదించారు.

కీర్తి స్తంభం

కీర్తి స్తంభాన్ని ఒకదానిని నిర్మించాలని ఉత్సవ కమిటీ భావించింది. దీని నిర్మాణ పనిని పబ్లిక్‌వర్క్స్ శాఖకు అప్పగించే విషయమై ఆశాఖ చీఫ్ ఇంజనీరు, తదితర అధికారులతో చర్చలు జరిగాయి. ఈ కీర్తి స్తంభాన్ని నిర్మించేందుకై పబ్లిక్‌వర్క్స్ శాఖకు రూ. 25,000 లు యివ్వడం జరిగింది. పని చురుకుగా కొనసాగుతున్నది. ఈ కీర్తి స్తంభానికి 1975 నవంబరు 3 వ తేదీన ప్రారంభోత్సవం జరపాలని ఉద్దేశించబడింది.


మహావీరుని బోధలు, జీవితం: పాఠశాల విద్యార్థులకు పరీక్ష

భగవాన్ మహావీరుని జీవితం, ఆయన బోధలపై ఒక చిన్న పుస్తకాన్ని రూపొందించి 10 వేల ప్రతులను ముద్రించి పాఠశాల విద్యార్థులకు పంచాలని భావించారు. దీనికి సంబంధించిన వ్రాతప్రతి అచ్చుకు యివ్వడం జరిగింది. పుస్తకాలు రాగానే వీటిని విద్యార్థులకు పంచి, మహావీరుని జీవితం, బోధలపై పరీక్షలు నిర్వహించాలని కూడా ఉద్దేశించారు. ఆంధ్రప్రదేశ్ మాస పత్రిక నవంబరు సంచిక (ఈ సంచిక) లో మహావీరుని గూర్చి ప్రత్యేక వ్యాసాలు, ఉత్సవ కార్యక్రమాల ఫోటోలు ప్రచురిస్తున్నారు.

ఫోటో ప్రదర్శన

జిల్లాలలో ఫోటోగ్రఫీ ఎగ్జిబిషన్‌లను నిర్వహించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. హైదరాబాదులో 1975 నవంబరు నెల మొదటి వారంలో ఫోటోగ్రఫీ ఎగ్జిబిషన్ జరుగుతుంది.

నవంబరు 3 వ తేదీన పెద్ద ఎత్తున కార్యక్రమాలను జరిపే విషయమై ప్రయత్నాలు జరుగుతున్నాయి. శ్రీ పి. ఎల్. భండారి, శ్రీ పర్సభాయ్ జైన్ యీ కార్యక్రమాలను రూపొందిస్తున్నారు.



1









మహావీర్














1 1974 నవంబరు 17 వ తేదీన యేడాదిపాటుజరిగే మహావీర్ జయంత్యుత్సవాలకు రెవిన్యూ శాఖామాత్యులు శ్రీ పి నరాసారెడ్డి ప్రారంభోత్సవం చేశారు.

2 1974 నవంబరు 17వ తేదీన మహావీర్ జయంతి దినోత్సవం ఊరేగింపు

3 మహావీర్ జయంత్యుత్సవాల సందర్భంగా మహావీర్ భవన సముదాయంవద్ద డా. బి గోపాల రెడి 'శమనసూత్రం' అనే గ్రంథాన్ని ఆవిష్కరిస్తోన్న దృశ్యం శ్రీయుతులు గోపాలరావు ఎక్బోటే. పి యల్ భండారిగార్లను కూడ చిత్రంలో చూడవచ్చును.

4 ప్రారంభోత్సవ సమావేశంలో ప్రేక్షకులు


5 1974 నవంబరు 16 వ తేదీన మహావీర్ హాస్పిటల్‌కు ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళ రావు గారుశంకుస్థాపన చేశారు.


6 మహావీర్ భవన సముదాయానికి ఎ. సి గార్డ్స్ ప్రాంతంలో 19,000 చ గజాల స్థలాన్ని ముఖ్యమంత్రి ప్రభృతులు పరిశీలిస్తూన్న దృశ్యం

7 ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసిన హాస్పిటల్‌కు సంబంధించిన పలకాన్ని రెవిన్యూ శాఖమంత్రి శ్రీ పి. నరసారెడ్డిగారి ఆధ్వర్యంలో ఊరేగించి ప్రతిష్ఠించారు.

యంత్యుత్సవాలు







దూరదృష్టి గల అభ్యుదయ కర్షకుడు శ్రీ యం. నారాయణ

కర్నూలు జిల్లాలోవున్న ఆదోని బ్లాకు లోని చిన్న తంబళం గ్రామం వ్యవసాయ రంగంలో ప్రసిద్ధికెక్కింది ఈ గ్రామం ప్రసిద్ధికి, ప్రజల ఆర్థిక అభివృద్ధికి ముఖ్యకారణం అక్కడి చెఱువు ఈ చెఱువు క్రింద దాదాపు 833 ఎకరాల పొలం సాగుబడి అవుతోంది ఇది ఈ గ్రామానికి వరప్రసాదం ఆదోని బ్లాకులో ప్రవేశ పెట్టబడే ప్రతిక్రొత్త రకమైన వరివంగడం, తదితర ఆధునిక వ్యవసాయ పద్ధతులు మొట్ట మొదటిసారిగా ఈ గ్రామంలో ప్రయోగించ బడతాయి స్థానిక యువకర్షకుడు శ్రీ యం నారాయణ తనకు గల 0 606 హెక్టర్ల భూములో 1974-75 సంవత్సరంలో మూడు పంటలు పండించి, తన కొద్ది భూమినుండి రూ 12,400/-ల కిమ్మత్తుగల పంటను సాధించారు

శ్రీ నారాయణ తన మొదటి పంటగా టి. యం వి 2 అనే వేరుశనగను ఎన్ను కొన్నారు 1974 జూన్ రెండవ వారంలో ఈ

శ్రీ బి. ఆంజనేయులు

పంటను విత్తి, 1974 అక్టోబరు 2వ వారంలో పంటను చేతికి తీసి కొన్నారు రూ 867/-ల పెట్టు బడికి రూ 4,000/-ల కిమ్మత్తుగల వేరుశెనగ పంట వచ్చింది।

యు. పి 301 గోధుమ పంటను రెండవ పంటగా ఎన్నుకొని 1974 అక్టోబరు ఆఖరి వారంలో విత్తి, 1975, జనవరి ఆఖరివారంలో పంటను తీసికొన్నారు ఈ పంటపై ఖర్చు రూ 842/-లు కాగా నికర ఆదాయం రూ 4,500/-లు వచ్చింది

ఆయన తన మూడవ పంట సియస్ హెచ్-1 హైబ్రీడ్ జొన్నను ఎన్ను కొన్నారు ఈ హైబ్రీడ్ జొన్నను 1975 ఫిబ్రవరి రెండవ వారంలో విత్తి, 1975 జూన్ రెండవ వారంలో పంటను కోత కోశారు జొన్న పంటపై ఈ రైతు పెట్టిన ఖర్చు రూ 820/-లు కాగా అతని నికర ఆదాయం రూ 3,900/-లు లభించింది.

ఈ యువ కర్షకుడు అంతకు ముందు వరి, వేరుశెనగ రెండు పంటలు మాత్రమే ప్రతి సంవత్సరము పండించి రూ 4,800/-ల నికర ఆదాయం పొందుతూండేవారు

మార్గ దర్శకత్వం

ఈ రైతు సాధించిన అద్భుత విజయాన్ని గ్రామస్థులు ప్రశంసిస్తూ వారు కూడా అతనివలె ప్రస్తుత సంవత్సరం 3 పంటలు పండించుటకు కృషిసల్పుతున్నారు శ్రీ నారాయణ తన దూరదృష్టి, కార్యదక్షతలతో ఇతర సోదర రైతులకు మార్గ దర్శకుడైనాడు.

ఆరోగ్యవరం శానిటోరియం

శ్రీ కె.ఎస్.ఎస్.శేషన్

చిత్తూరు జిల్లాలోని మదనపల్లె మనదేశంలోనే గాక విదేశాలలో గూడ ప్రఖ్యాతి గాంచి యుండడానికి ప్రధాన కారణం అచ్చటికి 6 కి మీ. దూరంలో గల ఆరోగ్యవరం యూనియన్ మిషన్ ట్యూబర్ క్యూలోసిస్ శానిటోరియం (U.M.T. Sanatorium). సముద్రమట్టానికి 2,230 అడుగుల ఎత్తులోగల యీ ప్రదేశం అనేక దట్టమైన కొండలచే పరివృతమై మనోజ్ఞమైన చల్లని వాతావరణం గలిగివుంది. ఈ శానిటోరియం ప్రపంచంలోకెల్ల మూడవదిగా పేరుగాంచింది. మొదటి రెండు శానిటోరియంలు స్విట్జర్లండులోనివి.

దేశంలో శానిటోరియంల ప్రారంభం

శానిటోరియం పద్ధతులపై క్షయవ్యాధి నిర్మూలనోద్యమం మనదేశంలో యీ శతాబ్దారంభంలో మాత్రమే ప్రారంభింపబడింది. 1906 సం॥ లో మొట్టమొదటి సారిగా అజ్మీరుకు చేరువగా తిలౌనియా (Tilaunia) అనుచోట ఆరుబయలు వైద్యశాల ప్రారంభించబడింది. పిదప 1908 సంవత్సరంలో హిమాలయ పర్వతాల ప్రాంతంలో అల్మోరా (Almora) అనుచోట మరియొక శానిటోరియం కూడ వెలువడింది. బొంబాయిలోని కొద్దిమంది పార్శీ ధనికులు సిమ్లా కొండలలో ఒక శానిటోరియంను స్థాపించారు. అదే సమయంలో దక్షిణ దేశంలోగూడ అట్టి ఒక ఉద్యమం బయలుదేరి, మదనపల్లె సమీపంలో శానిటోరియం స్థాపనకు దారితీసింది.

డాడ్ శానిటోరియం

మదనపల్లెకు సుమారు 15 మైళ్ళ దూరంలోగల పుంగనూరులో శానిటోరియం 1909 సం॥ లో మొదట స్థాపించబడింది. రాయవేలూరులోని క్రిస్టియన్ మెడికల్ కాలేజి హాస్పిటల్‌లో పనిచేస్తున్న Dr. Gertrude Dodd అను ఒక అమెరికన్ వైద్యురాలు ఇచ్చిన వేయి డాలర్ల విరాళంతో యీ శానిటోరియం స్థాపించబడింది. అందుచేత యీ శానిటోరియం ఆమె పేర "డాడ్ శానిటోరియం" అని పిలువబడుతుండేది. Dr. Margarate Lipik అను ఆమె మొట్టమొదటి వైద్యురాలిగా చేరి శానిటోరియం నడిపే బాధ్యతలు స్వీకరించింది. ఆమె మదనపల్లెలోని మిషన్ హాస్పిటల్ (Mary Lott Lyles Hospital) లో గూడ పని చేస్తూండేది. కాని కొద్ది కాలం తర్వాత పుంగనూరులోని శానిటోరియంకు వెళ్ళి పనిచేయడం కష్టమైంది. మదనపల్లెలోని వైద్యశాలను మాత్రం ఆమె చూసుకోవడం కొనసాగించింది. మదనపల్లెలోని మిషన్ వైద్యశాల ఏర్పాటుకు కారకురాలై, అచ్చట అవిరళ కృషి చేస్తుండిన Miss (Dr.) Lousia Hart అను నామె డాడ్ శానిటోరియంలో నియమింపబడింది. మిక్కిలి ధైర్యసాహసాలు గలిగిన యీ అమెరికన్ వైద్యురాలు రవాణా సౌకర్యాలు లేని ఆ రోజులలో మదనపల్లెలోని వైద్యశాలను చూసుకొంటూ, గుఱ్ఱంపై స్వారీచేసుకొంటూ పుంగనూరు గూడ వెళ్ళి అచ్చటి డాడ్ శానిటోరియంలోని రోగులను గూడ గమనించుకొంటూ రెండు సంస్థలనూ మిక్కిలి సమర్థవంతంగా నడపుతూవచ్చింది. నిస్వార్థమైన ఆమె సేవా పరాయణత యిప్పటికీ యీ ప్రాంతంలో గల పల్లెప్రజలు గుర్తుంచుకొని, ఆమెను గూర్చి కథలుగా చెప్పుకొంటారు. మదనపల్లె, పుంగనూరు మధ్య గల దట్టమైన అడవుల్లో అనేక దొంగలు గూడ ఆమె రాక తెలుసుకొని పారిపోయేవారట. "హార్టు అమ్మ"గా ఆమె యీ ప్రాంతంలో ఆ నాడు ఆరాధ్యదైవంగా గుర్తింపబడింది.

శానిటోరియం మదనపల్లెకు మార్పిడి

రెండు వైద్యశాలలూ దాదాపు పదుహేను మైళ్ళ దూరంలో వుండడంచేత, మదనపల్లెలోని మామూలు వైద్యశాల (M. L. L. Hospital) విస్తరింప బడడంచేత Miss Hart ఎక్కువ కాలం మదనపల్లెలోనే వుండవలసి వచ్చింది. దీనిచే పుంగనూరులోని శానిటోరియం మీద ఆమె ఎక్కువ శ్రద్ధచూప లేక పోయింది. రోజూ పుంగనూరు వెళ్ళి శానిటోరియంను గమనించడం కొంత కష్టమైన పని ఐంది. అందుచేత Dr. Hart యోచించి, డాడ్ శానిటోరియంను పుంగనూరు నుండి 1912 సం॥ లో మదనపల్లెకే తరలించింది.

ఎన్నుకొన్న కొత్తస్థలం

మదనపల్లెలో శానిటోరియం M. L. L. హాస్పిటల్ ఆవరణలోనే పనిచేయడం ప్రారంభించింది. కాని అచ్చట తగు ఆరుబయలుస్థలం లేక పోవుటచేతను, తగినన్ని భవనములు లభించక పోవడంవలన, క్షయరోగులను పట్టణం మధ్యలో వుంచిడం ఇతరుల ఆరోగ్యానికి మంచిది కాదని భావించడం చేతను, శానిటోరియంను అచ్చటి నుండి తరలించి మదనపల్లెకు చేరువగా ఎచ్చటైనను మార్చతలచారు. కొత్త ప్రదేశం కోసం వెదకడాన్ని ప్రారంభించారు. శానిటోరియం స్థలాన్ని ఎన్నిక చేసిన విధం గురించి శానిటోరియం కమిటీకి మొదటి అధ్యక్షులుగా పనిచేసిన డాక్టర్ L. R. Scudder యీ విధంగా వివరించారు. "ఆ రోజు స్థల నిర్ణయానికై బయలుదేరిన సంఘ సభ్యుల బృందం అలసి నిస్పృహతో సాయంకాలానికి బహుశా, దేవుని నిర్ణయానుసారం సరిగ్గా యీ ప్రదేశానికి చేరుకొన్నారు. ఈ ప్రాంతంలో ఒకసారి నడయాడేసరికి, ఇది నిజంగా అనువైన స్థలమని నిర్ణయించడానికి ఎంతో సేపు పట్టలేదు. కొంతభాగం యీ ప్రాంతపు కొద్దిమందికి చెందిన ప్రయివేటు భూములు. ఎక్కువ భాగం ప్రభుత్వపు రిజర్వు అడవులకు సంబంధించినది." ఎత్తు పల్లాలతో, రాతి ప్రాంతంగా

కనిపించిన యీ స్థలం మదనపల్లె నుండి 8 మైళ్ళ దూరంలో గల రైలు స్టేషనుకు (C.T.M.) సరిగా మధ్యలో వుంది.

క్రొత్తగా నిర్ణయించిన యీ స్థలం శానిటోరియం స్థాపనకు కావలసిన కొన్ని కనీస అవసరాలకు అనుగుణంగా వుంది. సాధారణంగా శానిటోరియం ఊరికి చేరువగా వుండరాదు. రైలు మార్గాదుమ్ము, ధూళి వుండే ప్రదేశమై వుండరాదు. ఎప్పుడూ చెమ్మగాలులు వీచు స్థలముగా గూడ వుండకూడదు. అధిక వర్షములుపడే ప్రదేశము పనికిరాదు. సముద్ర మట్టానికి ఎక్కువ ఎత్తులో వుండి చల్లని గాలులు గలిగి, రాత్రులందు క్షయరోగులకు మంచి విశ్రాంతి, నిద్ర-నిచ్చు స్థలమై ఉండాలి. కాని అట్లని, మిక్కిలి ఎత్తైన కొండలపై శానిటోరియం స్థాపన జరిగితే, రోగులు తమ స్వస్థలాలకు వెళ్ళిన పిదప ఆ వాతావరణానికి సరిపడక బాధ పడతారు. కాని, మదనపల్లెకు 6 కి. మీ. దూరంలో కొత్తగా ఎన్నిక చేసిన స్థలం అన్ని నియమాలు కలిగి మిక్కిలి అనువైన స్థలమని నిర్ణయించబడింది. భూములను, రైతులనుండి కొనడము, ప్రభుత్వము నుండి శానిటోరియం కొరకు సంపాదించడము వెంటనే జరిగింది.

శానిటోరియం ప్రారంభం

1912 సం॥ లో హిందూదేశంలో పనిచేస్తూ వచ్చిన లండన్ మిషన్, ఆర్కాట్ అమెరికన్ మిషన్ మొదలైన సుమారు ఏడు మిషనరీ సంస్థల ప్రతినిధులు కలిసి యూనియన్ మిషన్ ట్యూబర్ క్యులోసిస్ శానిటోరియం (U. M. T. S.) పాలక వర్గాన్ని ఏర్పాటు చేసుకొన్నారు. మరికొన్ని మిషనరీలు గూడ వీటితో చేరి, ప్రోత్సాహమిచ్చి, విరాళములు వసూలు చేశాయి. అప్పటి మద్రాసు ప్రభుత్వము గూడ తగువిధంగా సహాయం అందజేసింది. మదనపల్లె శానిటోరియంకు సహాయం చేసిన వారిలో పిఠాపురం రాజావారు; సర్ సి. పి. రామస్వామి అయ్యర్; శ్రీనివాస అయ్యంగార్; మొదలైన వారు వున్నారు. మద్రాసులోని Messrs. Oak & Co., వారు ఒక వార్డుకు కావలసిన పూర్తి మంచాలు, కుర్చీలు, బల్లలు మొదలైన వాటిని ఉచితంగా సమకూర్చారు. మదనపల్లెలో వున్న ఒక యువ క్రైస్తవ పాదరీ రెవరెండ్ రోట్ చఫర్ (Rev. Rottsechaefer) అను నతడు శానిటోరియం భవనాలకు నమూనాలు, ఎస్టిమేట్లు తయారు చేశాడు. భవనాలకు రూ. 60 వేలు కేటాయింపబడింది. 1915 జూన్ కల్లా, కొత్త భవనాలు పూర్తి చేయబడినాయి. మద్రాసు ప్రభుత్వం రోట్ ఛాఫర్ పనితనాన్ని గుర్తించి గౌరవించింది. మదనపల్లెలోని M. L. L. వైద్యశాలను, శానిటోరియంను, రెండూ గమనించుకొంటున్న Dr. Hart వైద్యురాలికి బాధ్యతలు ఎక్కువగా ఉండడంచేత డెన్మార్క్ దేశానికి చెందిన Dr. Frimodt Maller అనునొక యువ వైద్యుని కొత్త శానిటోరియంకు సూపరింటెండెంటుగా నియమించడం జరిగింది. అప్పటికే అతడు దక్షిణ ఆర్కాట్ జిల్లాలో మిషనరీ వైద్యుడుగా పనిచేస్తుండేవాడు. కోపెన్ హేగన్‌లో వైద్యపట్టా పుచ్చుకొన్న యీ డేనిష్ డాక్టర్ మదనపల్లె శానిటోరియంలో 1914 డిశంబరు 1 వ తేది ప్రధాన వైద్యుడుగా పనిలో చేరాడు.

1915 సం॥ జులై తేదీ 19 వ ప్రస్తుతమున్న స్థలంలో శానిటోరియం ప్రారంభోత్సవానికి నిర్ణయించబడింది. అప్పటి మద్రాసు గవర్నరు Lord Pentland శానిటోరియం భవనాలు తెరిచారు. అదేరోజు మదనపల్లెలోని బీసెంట్ దివ్యజ్ఞాన కళాశాలగూడ గవర్నరుచే ప్రారంభం కాబడింది. Dr. Annie Besant చే స్థాపింపబడిన యీ కళాశాల రాయలసీమలోనే మొదటి కళాశాల. శానిటోరియం 109 రోగులకు సరిపడే విధంగా ఐదు జనరల్ వార్డులతో పదిహేను ప్రత్యేక వార్డులతో ప్రారంభమైంది. ఆఫీసు భవనాలు, లాబొరేటరీలు నిర్మింపబడినవి. వైద్యులకు, నర్సులకు వసతి గృహాలుగూడ కట్టబడినవి. శానిటోరియం ఆవరణలో అనేక వేపచెట్లు పెంచబడినవి. ఈ వేపచెట్ల నుండి వీచే చల్లని గాలి క్షయ రోగులకు మిక్కిలి మంచిదని కొందరి నమ్మకం.

ఆరోగ్యానికి వరప్రసాదం

1918 సం. జూలై నెలలో మదనపల్లె శానిటోరియం ఆవరణలో, అచ్చటి రోగులకు, వైద్యులకు, ఇతర సిబ్బంది సౌకర్యము నకై ఒక పోస్టాఫీసు స్థాపించబడింది. అపుడు దానికి ప్రత్యేకమైన పేరు వుంచవలసిన ఆవశ్యకత ఏర్పడింది. అనేక పేర్లు సూచింపబడ్డాయి; కాని తర్జనభర్జనల పిమ్మట శానిటోరియం కమిటీ "ఆరోగ్యవరం" అనేపేరు నిర్ణయించింది. 'ఆరోగ్యము', 'వరము' అనే రెండు పదముల కలయికతో ఏర్పడిన యీ కొత్త పేరు ఆరోగ్యమునకు వరప్రసాదమను (Gift of Health) అర్థమును స్ఫురింపజేస్తూ శానిటోరియంకు ఎంతో తగివుంది.

అభివృద్ధి పథకాలు

1922 సం. లో ఆరోగ్యవరం శానిటోరియంలో పడకలను 140 కి పెంచడం జరిగింది. 1926 లో క్రొత్త లాబొరేటరీ కట్టబడింది. వెంటనే ఎక్స్‌రే సదుపాయం గూడ చేకూర్చబడింది. 1932 లో విద్యుత్ సరఫరా రావడంతో శానిటోరియం మిక్కిలి అభివృద్ధి చెంది ఎంతోమార్పు వచ్చింది క్షయవ్యాధి నిర్మూలనలో డాక్టర్లకు తర్ఫీదు యిచ్చుటకు 1937 లో ఇచ్చట ఒక డిప్లొమా కోర్సు ప్రవేశ పెట్టబడింది. అనేక వార్డులు నిర్మించబడడంతో పడకల సంఖ్య 230 కి పెంచబడింది. ఇచ్చట పనిచేసే వారి బిడ్డల సౌకర్యానికై పాఠశాల ఒకటి స్థాపింపబడింది. 1933 లో ఒక చర్చి నిర్మింపబడి, శానిటోరియం స్థాపనకు ప్రధాన కారకురాలయిన Dr. Hart పేర 'Hart Memorial Chapell అని పిలువబడుతూంది. అప్పటి వైస్రాయి ఐన లార్డ్ లిన్‌లిత్‌గో భార్య Lady Linlithgow 1941 ఆగస్టులో మదనపల్లె శానిటోరియం సందర్శించి అచ్చటి Lazarus Memorial Block నకు ప్రారంభోత్సవం గావించేరు. భారత ప్రభుత్వమునకు 1948–62 మధ్య కాలములో క్షయ రోగ నిర్మూలనా విషయాల్లో సలహాదారుగా పనిచేసి, క్షయవ్యాధి వైద్యుడుగా ప్రపంచ ప్రఖ్యాతిని పొందిన Dr. P. V. Benjamin ఆరోగ్యవరం శానిటోరియంలో 1922 పనిలో చేరడంతో శాని

టోరియం చరిత్రలో కొత్తశకం ప్రారంభమైందనవచ్చు. మన దేశంలో క్షయవ్యాధి నిర్మూలనోద్యమానికి పితామహుడుగా పేరు గాంచిన Dr. Benjamin 1972 నవంబరు 13 వ తేదీ నాడు వేలూరు C. M. C. వైద్యశాలలో మరణించారు.


ఆరోగ్యవరం శానిటోరియంలో Dr. Benjamin వంటి వైద్యుల ఆధ్వర్యంలో క్షయవ్యాధి నిర్మూలనలో పరిశోధనలు గూడ పెద్ద ఎత్తున కొనసాగబడినాయి 1939 లో అప్పటి సూప రింటెండెంటు Dr. Mollar మన దేశంలోని Tuberculosis Association of India కు మెడికల్ కమిషనర్‌గా ఢిల్లీ వెళ్ళారు. అదే సంవత్సరం అతని కుమారుడు Dr. C. Fimodt Moller ఆరోగ్యవరం శానిటోరియంలో పనిలో కుదిరారు. ప్రస్తుతం ఈయన శానిటోరియంలోని రీసెర్చి విభాగానికి Director గా వున్నారు.

ఐక్య రాజ్య సమితిలో ఒక విభాగమైన ప్రపంచ ఆరోగ్య సంస్థ (W. H. O.) సలహా మేరకు భారత ప్రభుత్వం B. C. G. వాక్సినేషన్ ఉద్యమాన్ని చేపట్టడానికి నిశ్చయించి, దానిని మదనపల్లెలో ప్రారంభించడానికి నిర్ణయించింది. మన దేశంలో మొట్టమొదటి సారిగా B. C. G. టీకాలు మదన పల్లె దివ్య జ్ఞాన కళాశాల ఆవరణలోని బీసెంటు హాలులో 1948 ఆగస్టు నెలలో నప్పటి భారత ప్రభుత్వపు ఆరోగ్య శాఖ మంత్రిణి రాజకుమారి అమృత కౌర్ చేత ప్రారంభింపబడింది. అది మన దేశంలోనే గాక సకల ఆగ్నేయ ఆసియా దేశాలలోనికి మొదటి B. C. G. టీకాల ప్రారంభోత్సవం ఆనాటి సభకు హాజ రయిన అనేక మంది ప్రముఖులలో మద్రాసు ప్రభుత్వ వైద్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ Dr. K.E.C. K. Rajah; సర్జన్ జనరల్ ఐన Col. C. Mani మొ॥ వారు వున్నారు.

ప్రపంచ పరిగణన

క్షయవ్యాధి నిర్మూలనలో Streptomycin మందు 1948 నుండి వాడకంలోనికి వచ్చింది. 1965 నాటికి శానిటోరియం లోని పడకలు 420 కి అభివృద్ధి చెందాయి. పిల్లల విభాగం దాదాపు 70 పడకలతో ఒకటి ప్రత్యేకముగా ప్రారంభింపబడింది. రైల్వేలు, ఒరిస్సా పోలీసు మొదలైన దేశంలోని అనేక సంస్థల వారు వంపు రోగుల సౌకర్యార్థమై ప్రత్యేక వార్డులను నిర్మింప జేశాయి అనేక కొత్త భవనాలు నిర్మింపబడ్డాయి. లాబొరెటరీ బహు ళంగా విస్తరింపబడింది అచ్చటగల పాఠశాల ఇంగ్లీషు మీడియం తరగతులతో మాధ్యమిక పాఠశాలగా పెంచబడింది. పిల్లల ఆట పాటలకై ఆట స్థలాలు రూపొందింపబడినాయి. అనేక ఆధునాతన పద్ధతులు ప్రవేశపెట్టి, క్షయ వ్యాధి గ్రస్తులకు తగు సౌకర్యముల కల్పించి. వ్యాధి నిర్మూలన విషయంలో అమితానుభవము గల వైద్యుల సహాయంతో కృషి చేయడంచేత ఆరోగ్యవరం శానిటో రియం ప్రపంచంలోని అతికొద్ది శానిటోరియంలలో ప్రధాన మైనదిగా పరిగణనకెక్కింది.

1952 అక్టోబరు 7 వ తేదీ ఆరోగ్యవరంను సంద ర్శించిన ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ, యీ శానిటోరియం గూర్చి యిలా అన్నారు. "నేను విశేషంగా విన్నటువంటి ఆరోగ్య వరం శానిటోరియంను దర్శించటానికి మిక్కిలి సంతోషపడుతు న్నాను. క్షయవ్యాధి నిర్మూలనా కార్యక్రమాలు ఇక్కడ ఎడతెరపి లేకుండా, విజయవంతంగా కొనసాగాలని కాంక్షిస్తున్నాను".



పద్యం గద్యం వచనపద్యం వగైరా

-శ్రీ చేకూరి రామారావు

వచన పద్యం, వచన కవిత, మొదలైన పేర్లతో ప్రచారంలో ఉన్న సాహిత్య రూపానికి లక్షణ నిర్వచనం చేసే ప్రయత్నం కొంతకాలం నుంచి జరుగుతున్నది. (సంపత్కుమార 1962, 1965, 1967, 1972, 1973) ఈ ప్రతిపాదనలలో ప్రధానమైనది భావగణయుక్తమైన పాతపద్ధతి. అందువల్ల ఇది ఛందో విభాగం అవుతుందని ప్రతిపాదకుల భావం. దీన్ని ఈ ప్రస్తుత వ్యాసకర్త నిరాకరించాడు. (రామారావు 1972 a, b) వ్యాకరణ భిన్నమైన భావగణాలుండవని, ఇవి గద్య పద్యాలకు సమానమనీ, వచన పద్యంలో పాద విభజనకు నియతమైన సూత్రపద్ధతి లేదనీ ఈ వాదం సారాంశం ఈ విషయాలపైన సూచించిన వ్యాసాల్లో విపులంగా విమర్శించబడటం వల్ల మళ్ళీ ఇక్కడ వాటిని గురించిన చర్చ ఉండదు. భాషాతత్వ దృష్టితో ఛందస్తత్వాన్ని పరిశీలించటమే ప్రస్తుత వ్యాసానికి లక్ష్యం.

భాషలో అర్థవంతమైన శబ్దాల పరస్పర సంబంధాన్ననుసరించి వాక్య నిర్మాణం ఉంటుంది. వాక్యం ధ్వనుల రూపంలో వ్యక్తమవుతుంది. శబ్దాలు పదాలుగా, వాక్యాలుగా ఏర్పడే పద్ధతిని పదనిర్మాణ వాక్య నిర్మాణ సూత్రాలు నిర్వచిస్తై శబ్దాల్లో ఏ ధ్వనులు, ఏ క్రమంలో వస్తయ్యో ఏ విధంగ ఉచ్చరింపబడతయ్యో తెలియ జేసేది ధ్వని నిర్మాణ సూత్రాలు. ఈ రెంటి మధ్య భేదం చాలా ముఖ్యం. ఎందుకంటే ఛందస్సుకు రెండో దానితో పనిఉంది.

ధ్వనులు, ధ్వనిభేదాలు

భాషా ధ్వనుల్లో అచ్చులు హల్లులు అనే విభాగం ప్రసిద్ధమే అచ్చుల కేంద్రంగా అక్షరాలు (syllables) ఏర్పడతై. భారతీయ భాషలో అక్షరాలను రెండు విధాలుగా విభజించవచ్చు. వీటికే గురు, లఘువులనే పేరు ప్రసిద్ధంగా ఉంది. దీర్ఘాచ్చు, పరంలోని వ్యంజనంతో మూతబడ్డ హ్రస్వాచ్చు గుర్వక్షరాలవుతై. అక్షర సంఖ్యా నిర్ణయానికి హల్లులతో పనిలేదు. (సీతాపతి 1921) అక్షరభేద నిర్ణయానికి హ్రస్వాచ్చు తరవాత వచ్చే హల్లు అవసరం. పర వ్యంజనంతో మూతబడటం అంటే హ్రస్వాచ్చు తరవాత వ్యంజన ద్విరుక్తిగాని, వ్యంజన సంయోగంగాని ఉంటే అందులో మొదటి హల్లు పూర్వాచ్చుకు గురుత్వాన్ని కల్పిస్తుంది. ఆ సంయుక్త వ్యంజనమైనా తన తరవాత అచ్చు లేనప్పుడు పూర్వ హ్రస్వాచ్చుకు గురుత్వాన్ని కల్పిస్తుంది. గురు లఘు నిర్ణయంలో అచ్చుకు పూర్వమున్న హల్లుతో ప్రమేయం లేదు. పరంలోని వ్యంజనంతో మూతబడిన హ్రస్వాచ్చు గురువైతే, మొదలే గురువైన దీర్ఘాచ్చు అట్లా మూతబడితే గురుతరంకాదా? అనే సందేహం రావటం సహజం. అయ్యేమాట నిజమేగాని వ్యవహర్తలు గురు లఘు భేదాలే అలవాటు పడ్డారు. హ్రస్వదీర్ఘాచ్చుల ఉచ్చారణలో కూడా తర తమ భేదాలుండవచ్చు. ఎన్ని భేదాలున్నా వ్యవహర్తలు గుర్తించేది రెండేభేదాల్ని. అంటే భాషలో ఈ భేదానికే ప్రవర్తన(Function) ఉంది తరతమ భేదాలకు ప్రాముఖ్యం లేదు. సంబుద్ధిలో వచ్చే దీర్ఘతరాచ్చును ప్లుతంగా ప్రాచీన లాక్షణికులు గుర్తించినా అక్షరభేద నిర్ణయంలో అది గురువుగానే పరిగణించబడింది. భౌతికమైన సంఘటనలను ఒక యంత్రం గమనించే తీరుకు, మనిషి గమనించే తీరుకూ ఉన్న భేదంవల్ల ఈ వ్యత్యయం వచ్చింది. భాష మానసిక వ్యాపారం. భాషాధ్వనులను ధ్వనితరంగాలుగా కాక భాషలో ప్రవర్తించే ధ్వనిభేదాలుగా వ్యవహర్తలు గుర్తిస్తారు.

భాషలో అసంఖ్యాకాలయిన ధ్వనిభేదాలను ధ్వనిశాస్త్రరీత్యా లేక ఒక యంత్రంద్వారా గుర్తించటానికి వీలున్నా అర్థభేదక సమర్థమైన ధ్వనిభేదాలు నియతసంఖ్యాకాలే. ఇట్లాంటి భేదక లక్షణాల సమూహాన్ని వర్ణాలంటారు. ఈ వర్ణాలుకూడా భాషలో పరిమిత సంఖ్యాకాలు. అంతేకాదు, వీటి సంయోజనకూడా నియమబద్ధమే. గణితశాస్త్రపద్ధతిలో సాధ్యమయ్యే వర్ణసంయోజనలన్నీ భాషలో ఉండవు. అందులో కొన్నిటినిమాత్రమే ఎన్నిక చేసుకుంటుంది చాలా వాటిని నిరాకరిస్తుంది. ఈ ఎన్నికలో భాషల మధ్య భేదాలుంటై.

ఉదాహరణకు కార్త్స్న్యము, కార్ష్ట్యము, కార్ష్ణ్యము, అనే సంస్కృతంమాటల్లో మొదటి అచ్చు తరువాత వరసగా ఐదు వ్యంజనాలున్నై. తెలుగుమాటల్లో పదమధ్యంలో మూడు హల్లులకన్నా ఎక్కువుండటానికి వీల్లేదు, అదైనా సంయోజనలో మొదటిహల్లు అనునాసిక వ్యంజనమయినప్పుడే. అట్లాంటి మాటలు: కొంద్ర, మంద్రగబ్బ, మామిడితాంద్ర వంటివి చాలా కొద్దిగా ఉన్నై. 'ంద్ర' సాధ్యమయినట్టుగా 'ంప్ర, ంత్ర, ంచ్ర, ంక్ర' వంటి సంయోజనలు సాధ్యంకావు. తెలుగు పదంలో చివరి రెండచ్చుల ఉ–ఇ క్రమంలో ఉండవచ్చుగాని ఇ–ఉ క్రమంలో ఉండవు. ఇట్లాంటి నియమాలు ప్రతిభాషకు వేరువేరుగా ఉంటై. ఇట్లాగే అక్షరక్రమంలో కొన్ని నియమాలుంటై. తెలుగుశబ్దాల్లో మొదటి లఘువు తర్వాత గురుపురాదు. అట్లా వచ్చే శబ్దాలు ఇతర భాషలనుంచి ఎరువుతెచ్చుకున్నవి. ఈ నియమాలకు పరిధి ప్రాతిపదికలు, ధాతువులు, పదాలుమాత్రమే. ఒక వాక్యంలో గురు లఘు క్రమం ఇట్లా ఉండాలనే నియంలేదు.

ఛందస్సు: నియమాలు

మాతృభాషా వ్యవహర్తలందరూ తాము వ్యవహరించే భాషలోని వ్యాకరణంతోపాటే అక్షర, వర్ణసంయోజన నియమాలనుకూడా అజ్ఞాతంగా గ్రహిస్తారు. ఇవి అతి సహజమయిపోయి ఇట్లాంటి

నియమాలుంటయ్యన్న గుర్తింపు కూడా వ్యవహర్తలకుండక పోవచ్చు. పద్యకర్త ఈ నియమాలకు తోడు మరికొన్ని నియమాలను అక్షర సంయోజనకు చేర్చుకొని ప్రయోగిస్తాడు. ఈ నియమాలకు పరిధి వ్యాకరణం నిర్వచించే శబ్దాలు, పదాలు, వాక్యాలు కావు. అక్షర సంఖ్యా నియమం చేసుకొని అందులో గురు లఘు క్రమాన్ని నిర్వచించు కోటం ఒక పద్ధతి. అక్షర పరిమాణం మీద ఆధార పడ్డ మాత్రాసంఖ్యానియమం ఏర్పరుచుకొని. అందులో మాత్రా విభజనను గురించి నియమాన్నేర్పర్చుకోటం ఇంకో పద్ధతి. భిన్నవర్ణ క్రమాలను అనుమతించే భిన్న గణాల సంఖ్యను పరిమితిగా ఏర్పరచు కోటం మరో పద్ధతి. అక్షర సంఖ్యా నిబద్ధమైన ప్రమాణంలో గురులఘు క్రమం కూడా నిర్దిష్టంగా ఉండటం మనం చూడవచ్చు. మాత్రా సంఖ్యానిబద్ధమైన వాటిల్లో అక్షర సంఖ్యా. అక్షర క్రమం—రెండూ నిర్దిష్టం కావు అక్షర పరిమాణాన్ని బట్టి ఈ రెండూ నిర్ణీతమవుతై. కేవల గణ సంఖ్యా నిబద్ధమైన వాటిల్లో ఎంచుకున్న గణాల్ని బట్టి వర్ణ క్రమం ఉంటుంది, ఆ గణాలు నిర్దిష్టమైతే—ఒక గణం స్థానంలో ఇంకో గణం వచ్చే అవకాశం లేక పోతే—ఒకే అక్షర క్రమం సాధ్యమవుతుంది. భిన్నాక్షర క్రమాలున్న కొన్ని గణాల్లో ఏదైనా రావచ్చునంటే అప్పుడు ఒకేరకమైన అక్షరక్రమం ఉండదు. ఈ పద్ధతిలో అక్షర సంఖ్య, మాత్రాసంఖ్య నిర్దిష్టం కావు. గణ సంఖ్య, గణ క్రమం మాత్రమే నిర్దిష్టంగా ఉంటుంది· ఇట్లా ఏర్పర్చు కొన్న ప్రమాణాలను కొన్ని కలిపి ఒక మాలగా కూరిస్తే పద్యం అంటారు. కూర్చబడిన ప్రమాణాలు పాధాలు. ఈ పాదాలను వ్యాకరణం నిర్వచించదు. చందశ్శాస్త్రమే వాటిల్లో ఉన్న నియమాలను బట్టి ఫలాని పాదమని లక్షణాలతో చెపుతుంది. ఒక పద్య పాదానికి అంతర్నిర్మాణమూ, బాహ్య పరిమితి ఉంటై. వృత్తాలకు అక్షర సంఖ్యా పరిమితి బాహ్య పరిమితి. నిర్దిష్టాక్షర క్రమం అంతర్నిల్మాణం. మాత్రా పద్యాల్లో మాత్రా సంఖ్యా పరిమితి బాహ్యా పరిమితి. అనులోమ విలోమ గతుల్లో భిన్న లేక సమ మాత్రా సంఖ్యా కాలైన గణసంఖ్య లేక గణక్రమం అంతర్నిర్మాణం. గీత, సీసాది పద్యాలో భిన్న అక్షర క్రమాలను అనుమతించే నిర్దిష్ట గణ సంఖ్య బాహ్యా పరిమితి. ఆ గణాల క్రమం అంతర్నిర్మాణం. దీన్ని బట్టి పద్యరచన అక్షర పరిమాణం (quantity), అక్షర క్రమం మీద ఆధారపడి ఉందన్న మాట. ఈ కూర్పు లోని నియమాలను, భేద, ప్రభేదాలను ఛందశ్శాస్త్రం విశ్లేషించి చూపుతుంది. వ్యాకరణం ప్రసక్తి పదాలకు, వాక్యాలకు, పద్యాలకు వేరే వ్యాకరణం ఉండదు. సాధారణంగా కవులు సామాన్య వ్యవహారంలో ఉండే వ్యాకరణ నియమాలను ఉల్లంఘిస్తారు· అయితే ఉల్లంఘన పద్యంలోనూ ఉంటుంది, గద్యంలోనూ ఉంటుంది. కళాత్మ కత ఉద్దేంచిన ఏ వాఙ్మయ రూపంలోనైనా ఈ ఉలంఘన ఉంటుంది· పద్య లక్షణం పద్యంలో చెప్పబడిన భావం కన్నా భిన్నం. అసలీ రెంటికీ సంబంధం లేదు. ఒక విషయాన్ని బృహద్వాక్యంలో చెప్పాలా? చిన్న చిన్న వాక్యాల్లో చెప్పాలా? సమాసాన్ని వాడాలా? వ్యస్త పదాల్ని వాడాలా? అసమాపకక్రియల్లో నిబంధించాలా? సమాపక క్రియల్లో వ్యక్తం చెయ్యాలా? అనే విషయాలతో ఛందస్సుకు—అంటే పద్య లక్షణానికి సంబంధం లేదు పైన చెప్పిన వాటిల్లో ఏవి వాడటానికి నిర్ణయించుకున్నా వాటిని గురించి వివరించేది వ్యాకరణం. అంటే పద్యాలను గద్యంనుంచి వేరు చేసేడ భావాల విభజన గాని. భావాలు భాషలో వ్యక్తమయ్యే తీరుగాని. లేక ఆ తీరుల్లోని వైవిధ్యంకాని కాదు. తీరును ఎన్నుకోటం 'కర్త' ఇష్టం. ఎన్నుకున్న తీరు వ్యాకరణాను సారి. ఛందస్సుకూ దీనికీ ఎటువంటి సంబంధమూలేదు. ఏర్పర్చుకున్న పరిమితిలో-అంటే పాదంలో-అక్షర సంయోజన అక్షర పరిమాణం మీద ఆధారపడ్డ మాత్రా (గణ) సంయోజన భిన్న అక్షర క్రమాలను అనుమతించే ఇతర గణసంయోజన-ఇట్లాంటి అక్షర సంబంధి నియమాలు పద్యాన్ని గద్యం నుంచి వేరు చేస్తున్నై.

భాషప్రయోజనం భావప్రకటన

ప్రపంచ భాషలన్నిటిలోనూ సాహిత్యం ఉంటుంది లిఖిత వ్యవస్థలేని భాషల్లో అది మౌఖికంగా ఉంటుంది. అట్లాగే ప్రతి సాహిత్యంలో సాధారణంగా గద్యపద్య భేదం ఉంటుంది. అట్లా ఉన్నచోటల్లా ఆసాహిత్యాల్లో పద్యాన్ని గద్యం నుంచి వేరు చేసేది వ్యాకరణం కాదు. ధ్వనుల. వర్ణాల అక్షరాల కూర్పు. వీటి వివరాల్లో భేదం ఉండవచ్చు. కొన్ని భాషల్లో అక్షరాల హ్రస్వదీర్ఘాలకు ప్రాధాన్యముంటే ఇంగిషు భాషల్లో అక్షరాఘాతానికి ప్రాధాన్యముంటుంది. ఒక పద్యంలో చేప్పే భావాల సమాప్తి. అసమాప్తి లేక వాక్యాల్లో క్రియాది శబ్దాల స్థానం, లేక ఉపవాక్య, సంపూర్ణ వాక్య భేదం, పదబంధ సమాసాల వ్యత్యాసాలు— వీటికి పద్య నిర్మాణానికి ప్రత్యేకమైన సంబంధం లేదు. అయితే సాహిత్యాల్లో వీటి ప్రయోగానికి సంబంధించిన కొన్ని సంప్రదాయాలు ఏర్పడి ఉండ వచ్చు వాటిని పద్యలక్షణంలో భాగంగా భ్రమించ గూడదు. సాధారణంగా ఒక వాక్యం ఒక పద్యాన్ని దాటి విస్తరించక పోవచ్చు. ఒక అర్థవంతమైన శబ్దం కొంతభాగం పూర్వ పద్యాంతంలోను మరికొంత భాగం తరవాత పద్యాదిలోను విభక్తమై ఉండదు కాని ఇవన్ని పద్య నిర్మాణ సూత్రాల్లో భాగాలు కావుం భాష ప్రధాన ప్రయోజనం అభిప్రాయ ప్రకటనే కాబట్టి అందుకు అవరోధాలను కలిగించే పై విధానాలు సాధారణంగా పరిహరించ బడతై.

శబ్దాలకూ పద్యాలకు ఉన్న సంబంధం పరోక్షమైనది. శబ్దాల్లో గురులఘుక్రమం ఉంటుంది కాబట్టి పద్యకర్త పద్యాల్లో క్రమానికి అనుకూలమైన శబ్దాల్ని ఒక క్రమానిక అనుకూలమైన శబ్దాల్ని ఒక క్రమంలో ఎన్నుకుంటాడు. అట్లాగే అక్షరాఘాతం (Stress) అవసరమైనచోట అందుకు వీలైన శబ్దాల్ని ఎంచుకుంటాడు శబ్దాల అంతంలో విరామం ఉంటుంది కాబట్టి పాదాంత, పాదమధ్య. గణాంత విరామాలు అవసరమైన చోట శబ్దాంతము విరామంతో అది సాధిస్తాడు. అంతేకాని ఫలాని చోట నామం ఉండాలా? క్రియ ఉండాలా? వంటి ప్రశ్నలు పద్య నిర్మాణానికి సంబంధించినవి కావు. వాక్యనిర్మాణానికి సంబంధించినవి ఏభాషలో పద్య నిర్మాణమైన ఇందుకు విరుద్ధం కాదు.

లిఖిత వ్యవస్థలేని గద్యసాహిత్యమైనా, పద్యసాహిత్యమైనా మౌఖికమే. లిఖిత సాహిత్యమున్న భాషల్లో కూడా జానపదుల్లో మౌఖిక సాహిత్యం ప్రచురంగా ఉంటుంది.


ఈ సాహిత్యం మౌఖికంగానే ఇతర ప్రాంతాలకి గాని, ఇతర కాలాలకి గాని అందించ బడుతుంది. ఇట్లా వ్యాపించేటప్పుడు గద్య సాహిత్యంలో మొదటికీ తరవాతకీ మార్పులెక్కువుతై. కథాకథనానికి సంబంధించిన కొన్ని పడి కట్టు మాటలు మారక పోవచ్చుగాని వాక్యాలు మారతై. గద్యసాహిత్యంలో వర్ణక్రమానికి, అక్షర క్రమానికి సంబంధించిన నియమాలు శబ్ద. పదాతీతంగా లేక పోవటమే ఇందుకు కారణం. అదే పద్య సాహిత్యమైతే అట్లాంటి మార్పులు తక్కువుంటై. అక్షర క్రమానికి (అక్షరసమూహ పరిమాణానికి) భంగం కలగని మార్పులే జరుగుతై. గద్య సాహిత్యంలో విషయం ప్రధానం. కొన్నిరకాల శబ్దాలకు శబ్ద క్రమానికి. వాక్యభేదాలకు ప్రాధాన్యం ఉంటుంది. అక్షర క్రమ, అక్షర పరిమాణ నియమాలు పదాతీతంగా ఉండవు. ఉన్నయీ నియమాలు భాషా వ్యవహర్తలందరికీ సమానమే. అందు వల్ల గద్య సాహిత్య ప్రత్యేకత భాషాపరంగా కొన్నిరకాల శబ్ద ప్రయోగంలోను వాక్య నిర్మాణ వైఖరిలోనూ ఉంటుంది. ఈ ప్రత్యేకత సాహిత్య నిర్మాత (ల) దే. పద్యసాహిత్యంలో ఈ ప్రత్యేకతలతో పాటు వాక్యరణాతీత అక్షర నిర్మాణ క్రమం ఉంటుంది. ఈ క్రమం వ్యవహర్తలందరిదీ కాదు. పద్య నిర్మాత (ల) దే.

ఎడిటింగ్

భాషా వ్యవహారంలో సాధారణ వ్యవహారానికి, జాగ్రత్తగా చేసే వ్యవహారానికీ భేదం ఉంటుంది. కొన్ని కొన్ని సామాజికావసరాలకు ఈ జాగ్రత్త అవసరమవుతుంది. పదక్రమంలోనూ, పదాల ఎన్నికలోనూ, వాక్య ప్రయోగంలోనూ ఈ జాగ్రత్త ఉంటుంది. సాధారణ వ్యవహారంలో ఉండే అసంపూర్ణ వాక్యాలు. నట్టు మాటలు, ఊతపదాలు మొదలైన వాటిని జాగ్రత్త అవసరమైన చోట పరిహరిస్తాం. ఈ జాగ్రత్త లిఖిత వ్యవహారంలో ఎక్కువ. అపసందర్భ ప్రయోగాలు. వాక్యనిర్మాణ దోషాలు మొదలైనవి ఉన్నచోట వెనక్కి వెళ్లి మార్చుకోటానికి లిఖిత వ్యవహారంలో వీలుంటుంది. ఈ పద్ధతిని 'ఎడిటింగు' (editing) అంటారు. రచనకు బిగువు కూర్చేది ఎడిటింగ్. ఇది సాహిత్యరచనలో కళాదృష్టితో జరుగుతుంది. శాస్త్రరచనల్లో సంక్షిప్తత కోసం జరుగుతుంది. స్కూలు పుస్తకాల్లో స్పష్టతకోసం జరుగుతుంది. అక్షర క్రమ పరిమాణాలకు సంబంధించిన 'ఎడిటింగు' ఉన్నప్పుడే పద్యసాహిత్యం తయారవుతుంది. వీటితో సంబంధం లేకుండా చేసే ఎడిటింగు గద్య సాహిత్యంలో ఉంటుంది. కళాత్మకత గద్యా పద్యాలను వేటినైనా సాహిత్యం చేస్తుంది. ఈ కళాత్మకత ఏమిటి? అనే ప్రశ్నకి స్థూలంగా సమాధానం చెప్పటం కష్టం. భాషా దృష్టితో కళాత్మకతను పరిశీలించవచ్చు. అపని వేరేచెయ్యాల్సింది.

తెలుగులో ప్రచురంగా ఉన్న వృత్తాలు సంస్కృత సంప్రదాయం నుంచి వచ్చినై. సంస్కృతంలోలేని కొన్ని నియమాలు అదనంగా చేరినై. నియతాక్షర సంఖ్యా ప్రమాణంలో అక్షర సంఖ్యను బట్టి ఛందో భేదాలు, అక్షరక్రమాన్ని బట్టి పద్యభేదాలు ఏర్పడతై. ఇట్లాంటి నియతాక్షర సంఖ్యా ప్రమాణాన్ని పాదం అనీ, ఇట్లాంటి వాటిని సాధారణంగా నాలుగు కలిపితే పద్యం అని అంటాడు. ప్రాచీన ఛందశ్శాస్త్రకారులు ప్రయోగంలో ఉన్న పద్యాల్ని విశ్లేషించి చూపించటానికి బదులు ఒక నియతాక్షర సంఖ్యాప్రమాణంలో సాధ్యమైన అన్ని క్రమాలను పద్యపాదంగానే పరిగణించారు. అందువల్ల ఏ అక్షరక్రమమైనా పద్యమే కావల్సి వస్తుంది. అందుకే సంపత్కుమార (1973) "... సాంప్రదాయిక ఛందస్సుల ననుసరించి వ్యాసాన్ని 26 అక్షరాలుగా (అంగవరకు కూడా) విభజించి విషవృత్తాలుగా నిరూపించవచ్చు" అన్నారు. ఇదేనిజమైతే మన సాంప్రదాయిక ఛందశ్శాస్త్రం గద్య పద్యాలను వేరు చెయ్యలేదని అనుకోవలసి వస్తుంది. పై వాక్యాల్లో సంపత్కుమార అభిప్రాయం కూడా అదే. ఇందులో నిజానిజాలను పరిశీలించేముందు ప్రాచీన ఛందశాస్త్ర తత్వాన్ని కొద్దిగా తెలుసుకోవటం అవసరం. అది ఈ క్రింది బొమ్మలో సూచించబడింది.

పద్యోత్పత్తి యంత్రం



ఈ బొమ్మ ఊహాయంత్రం. ఇట్లాంటి నిజమైన యంత్రాన్ని నిర్మించటం సాధ్యమనే దురాశ ఈ వ్యాసకర్తకు లేదు. ఛందస్తత్వాన్ని గ్రహించటానికి సాయపడటమే దీని ప్రయోజనం. పాదోత్పత్తి విభాగంలో "m to the power of n" అనే సూత్రం ఒక్కో అక్షర సంఖ్యలో ఎన్ని అక్షర క్రమాలు సాధ్యమో చెపుతుంది. గురులఘువులనే అక్షరభేదాలు రెండే కాబట్టి m విలువ

ఎప్పుడు రెండే. n విలువ స్థిరాంకం కాదు. ఈ విభాగంలో ఉత్పత్తి అయిన పాదాలకు తరవాత విభాగంలో నియమాలు వర్తిస్తే, 6 అక్షరాలకన్నా తక్కువవున్న పద్యాలు ప్రయోగంలో లేవు. గరిష్ఠ సంఖ్యా పరిమితిలాగా కనిష్ఠ సంఖ్యా పరిమితి ఈ విభాగంలో చేర్చుకోవచ్చు. ఈ నియమాల అనంతరం ఈ పాదాలు తరవాత విభాగంలో పాదబంధన నియమాల ననుసరించి పద్యాలవుతై. వ్యాకరణ యంత్రం ఉత్పత్తి చేసిన వాక్యాలు యీయంత్రానికి ముడిపదార్థం (input). ప్రాచీన ఛందశ్శాస్త్రంలో పాదోత్పత్తి విభాగాన్ని మాత్రమే చూస్తే వ్యాసాన్ని పద్య పాదాలుగా విభజించ వచ్చునన్న భ్రమ కలుగుతుంది. కాని తరవాత విభాగాలో ఉన్న నియమాలు అట్లాంటి ముక్కలను పద్యాలుగా బయటికి రానీయవు. ప్రయోగంలో లేని అత్యధిక సంఖ్యాకాలయిన పాదాలను ఉత్పత్తి చేసే అవసరం ఏమిటి అనే సందేహం కలగటం సహజం. ప్రయోగించబడిన పద్యాలనే కాక భాషలో సాధ్యమైన పద్యాలన్నిటినీ ప్రెడిక్టు (predict) చెయ్యటం ప్రాచీన ఛందశ్శాస్త్ర కారుల లక్ష్యం. పరిమిత సూత్రాలతో అపరిమితమైన పద్యాలను ప్రెడిక్టు చేసే సిద్ధాంతం ఇది. భాషాశాస్త్రం ప్రకారం వ్యాకరణం కూడా ఇట్లాంటిపనే చెయ్యాలి. భాషలో వాక్యాలు అనంతం. వ్యాకరణం పరిధి ఇంతవరకూ ప్రయోగించబడిన వాక్యాలు మాత్రమే కాదు. భాషలో ఒక కాలంలో సాధ్యమైన వాక్య సర్వస్వాన్ని వ్యాకరణం ప్రెడిక్టు చెయ్యాలి. అంట్లాంటి వ్యాకరణాన్ని జనరేటివ్ వ్యాకరణం అంటారు. ప్రాచీన ఛందశ్శాస్త్ర కారులు పద్యాలకు అట్లాంటి జనరేటివ్ ఛందస్సును ఇచ్చారు. ఈ సిద్ధాంతం ప్రకారం గద్యాన్ని పద్యంనుంచి వేరు చెయ్యటం సులభమే.

వృత్తాల్లో లయ ఐచ్ఛికం. పద్యకర్త తన ఇష్టాన్ననుసరించి భిన్న మార్గాలద్వారా భిన్నలయలను సాధించ వచ్చు. మాత్రా ఛందస్సుల్లో లయ నిర్దిష్టం. నియత మాత్రా సంఖ్యాక గణాలవల్ల విరామాల వల్ల, అక్షరాఘాతం (stress) వల్ల మాత్రా ఛందస్సుల్లో లయ ఏర్పడుతుంది. వృత్తాల్లో వీల్లేని అక్షర క్రమ వైవిధ్యం మాత్రా ఛందస్సుల్లో సాధ్యమవుతుంది. ప్రాచీన ఛందశ్శాస్త్రం లయను ఐచ్ఛికం చేసి అక్షర క్రమాన్ని నిర్దిష్టం చెయ్యటానికి అసంఖ్యాక వృత్త భేదాల్ని ప్రెడిక్టు చెయ్యాలన్న లక్ష్యం కారణం. మాత్రా ఛందస్సులను కూడా వృత్తాలుగానే పరిగణించవచ్చు గాని సమాక్షర సంఖ్య, క్రమమూ లేని పాదాల సంయోజన తరచుగా ఉంటుంది గనుక దాదాపు ప్రతి పద్యమూ విషమ వృత్తమే అవుతుంది. సమ మాత్రా సంఖ్యను నిర్లక్ష్యం చేసి విషమ వృత్తాలుగా పరిగణించటంలో సామంజస్యం లేదు.

పై చర్చను బట్టి అక్షర పరిమాణం, అక్షర క్రమం, అక్షరఘాతం మొదలైన వాటిమీద ఆధారపడిఉన్నదే ఛందస్సనీ. అక్షర సంఖ్యా లేక అక్షర పరిమాణంమీద ఆధారపడిన మాత్రా సంఖ్య లేక అఘాతాదికాలమీద ఆధారపడ్డ అక్షర సమూహాల సంఖ్య—ఇవే పాదానికి బాహ్యపరిమితులనీ, ఈ పాదాల్లో అక్షర క్రమంగాని, అక్షర పరిమాణాలమీద ఆధారపడ్డ గణాల విభజన క్రమమూ, లేక ఇతర విధాలయిన అక్షర సమూహాల (గణాల) విభజనక్రమమూ—ఇవి పాదానికి అంతర్నిర్మాణాన్ని నిర్వచిస్తయ్యని తేలుతున్నది. పాద విభజన ఏదోవిధంగా అక్షరాలమీదనే ఆధారపడిఉంది. చెప్పదలుచుకొన్న భావానికి, చెప్పే వాక్యాల తీరుకూ, పద్య నిర్మాణంతో ప్రత్యక్ష సంబంధంలేదు.

అక్షరాలతో (పరిమాణం, క్రమం, సమూహం మొ॥) సంబంధం లేకుండా చేసే ఏ లక్షణమూ ఛందశ్శాస్త్ర సమ్మతంకాదు, ఆ విధమైన నియమాలు లేని వాఙ్మయ రూపమూ ఛందోరూపంకాదు.


రిఫరెన్సులు

1. రామారావు, చేకూరి (1972 a) వచన పద్య: అభాస లక్షణ నిరాకరణ. "ఆంధ్ర పత్రిక" సంవత్సరాది సంచిక.
2. రామారావు చేకూరి (1972 b) వచన పద్యం ఛందోవిభాగం కాదు. "భారతి", నవంబరు.
3. సంపత్కుమార, కోవెల (1962) తెలుగు ఛందో వికాసము. కులపతిసమితి, వరంగల్లు.
4. సంపత్కుమార, కోవెల (1965) వచన పద్యం—దాని స్వరూపం. "భారతి", జూన్.
5. సంపత్కుమార, కోవెల (1967) వచన పద్యం: ఛందోరీతి.


   వచన కవిత: వివిధ కవుల పధాలూ, దృక్పథాలూ, (సం) కుందుర్తి ఆంజనేయులు, గోపాల చక్రవర్తి. హైదరాబాదు: ఫ్రీవర్స్‌ఫ్రంట్. (పుటలు: 22–32)
6. సంపత్కుమార కోవెల (1972) వచన పద్యం: లక్షణ నిరూపణం. "భారతి", జులై.
7. సంపత్కుమార, కోవెల (1973) వచన పద్యం పద్యమే. "భారతి" మార్చి.
8. సీతాపతి, గిడుగు వెంకట (1921) ఉపోద్ఘాతము. అనంతుడు ఛందోదర్పణము (పుటలు: 5–44) వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, మద్రాసు.




రాష్ట్రపతి శ్రీ ఫక్రుద్దీన్ అలీ అహమ్మద్ సెప్టెంబరు 8న అంతర్జాతీయ తెలుగు సంస్థను ప్రారంభించారు కుడి నుండి రాష్ట్రపతితోపాటు ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు విద్యా మంత్రి శ్రీమండలి వెంకటకృష్ణారావు, గవర్నరు శ్రీ ఎస్ ఓబుల్ రెడ్డి అధికారభాషా కమీషన్ అధ్యక్షులు శ్రీ వావిలాల గోపాల కృష్ణయ్యలను చూడవచ్చు




కేంద్రమంత్రి శ్రీ జగ్జీవన్‌రాం సెప్టెంబరు 4న జూబిలి హాలులో "1975 రాబీ ఉత్పత్తి సమ్మేళనా"నికి ప్రారంభోత్సవం చేశారు రాష్ట్ర వ్యవసాయమంత్రి శ్రీ జె చొక్కారావు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు





సెప్టెంబరు 26వ తేదీన ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు అధికార భాషా కమీషన్ అధ్యక్షులు శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య నుండి నివేదిక స్వీకరించారు


నగరంలో..! -




ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు తిరుమల-తిరుపతి దేవస్థానం అధ్యక్షులు శ్రీ సిహెచ్ అన్నారావు నుండి బీహార్, ఒరిస్సా రాష్ట్రాల్లోని వరద బాధితుల నిధికోసం లక్ష రూపాయల చెక్కును స్వీకరించారు

<— రైల్వేశాఖ కేంద్రమంత్రి శ్రీ కమలాపతి త్రిపాఠీ నగరంలో సెప్టెంబరు 30న తేదీన [illegible]

గవర్నరు శ్రీ ఎస్. ఓబుల్‌రెడ్డి కళాభవన్‌లో సెప్టెంబర్ 25న "శిల్పకళా సంస్కృతి" ఛాయాచిత్రాల ప్రదర్శనకు ప్రారంభోత్సవం చేసిన అనంతరం ఛాయా చిత్రాలను తిలకిస్తున్న దృశ్యం






కేంద్రమంత్రి శ్రీ జగ్జీవన్‌రాం సెప్టెంబర్ 4న హైదరాబాద్‌లోని నెహ్రూ జూలాజికల్ పార్కులో ఆఫ్రికానుండి రప్పించిన తెల్ల ఖడ్గ మృగాలను (రినోస్) విడుదలచేశారు



ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు జూబిలీ హాలులో సెప్టెంబర్ 16న రాష్ట్ర యాత్రికాభివృద్ధి సంస్థ ప్రథమ సమావేశాన్ని ప్రారంభించారు యాత్రికశాఖ మంత్రి డా॥ సి.హెచ్. దేవానందరావు. ప్రధాన కార్యదర్శి శ్రీ ఎన్. భగవాన్‌దాస్, యాత్రికశాఖ డైరెక్టర్ శ్రీ మహారాజ్ కరణ్‌లను చిత్రంలో చూడవచ్చు



పంచాయతీరాజ్ శాఖ మంత్రి శ్రీ ఉకలాపు లక్ష్మణదాసు సెప్టెంబరు 26న జిల్లాపరిషత్ అధ్యక్షులు, కార్యదర్శులు జిల్లా రెవిన్యూ అధికారులు, జిల్లా పంచాయతీ అధికారుల నుద్దేశించి ప్రసంగించారు

రాజధాని విశేషాలు

—శ్రీ తిరుమల రామచంద్ర

నగరంలో రాష్ట్రపతి దంపతులు

రాష్ట్రపతి శ్రీ ఫక్రుద్దీన్ ఆలీఅహమ్మద్ సపరివారంగా ఆగస్టు 28 న హైదరాబాద్ నగరానికి వచ్చి 18 నాళ్లు గడపి వివిధ కార్యకలాపాలలో పాల్గొన్నారు. పెక్కు సంస్థలకు ప్రారంభోత్సవం చేశారు. వాటిలో అగ్రగణ్యమైనది అంతర్జాతీయ తెలుగు అధ్యయన సంస్థకు ప్రారంభోత్సవం. తెలుగు భాషను సర్వతోముఖంగా అభివృద్ధి పరచడం ఈ సంస్థ ఉద్దేశం. ఈ సంస్థ పాలకవర్గంలో విద్యామంత్రి శ్రీ మండలి వెంకటకృష్ణారావు అధ్యక్షులు. రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక విషయా ప్రత్యేకాధికారి డాక్టర్ పి.ఎస్.ఆర్. అప్పారావు డైరెక్టర్. నిర్వాహక వర్గంలో రాష్ట్ర ప్రభుత్వ, ఆర్థిక విద్యాశాఖల కార్యదర్శులు, రాష్ట్రంలోని మూడు విశ్వవిద్యాలయాల కులపతులు, మూడు అకాడెమీల అధ్యక్షులు, స్థానాపన్న సభ్యులు. కేంద్ర విద్యాశాఖ ప్రతినిధి, ప్రపంచ విజ్ఞాన సమితి ప్రతినిధి, శ్రీయుతులు మోటూరి సత్యనారాయణ, వావిలాల గోపాల కృష్ణయ్య, దేవులపల్లి రామానుజరావు, ఎం. వి. రాజారావు, ఎస్. వి రావు, కె. ఎస్. కోదండరామయ్య, బుర్రా వెంకటప్పయ్య డాక్టర్ సి అప్పారావు, తిరుమల-తిరుపతి దేవస్థానం ధర్మకర్తల సంఘం అధ్యక్షులు, లక్ష రూపాయలు విరాళమిచ్చే ఏ వ్యక్తిగాని, సంఘంగాని సభ్యులు. దీని కార్య నిర్వాహక సంఘంలో రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక విద్యాశాఖల కార్యదర్శులు, విద్యాశాఖ డైరెక్టరు, ఆంధ్ర విశ్వవిద్యాలయ కులపతి శ్రీ ఎం. అప్పారావు, సాహిత్య అకాడెమీ అధ్యక్షులు డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి, శ్రీ బుర్రా వెంకటప్పయ్య, దేవులపల్లి రామానుజరావు సభ్యులు. అకడెమిక్ కౌన్సిల్‌లో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్, శ్రీయుతులు మోటూరి సత్యనారాయణ, వావిలాల గోపాలకృష్ణయ్య, ఈ సంస్థలోని వివిధ శాఖల అధిపతులు, పాలనాధికారి, ప్రధాన గ్రంథాలయాధికారి, సభ్యులు. వీరి సభ్యత్వ కాలపరిమితి 3 సం. లు. దీనిని పొడిగింపనూ వచ్చు. రాష్ట్రపతి తమ ప్రసంగంలో ఈలాంటి సంస్థ నెలకొంటున్నందుకు సంతోషం ప్రకటిస్తూ ఇది ప్రపంచంలోని తెలుగువారి సాంస్కృతికోన్నతికి భారతీయతా పరిధిలో అవిరళ కృషి చేయగలదని ఆశించారు.

రాష్ట్రపతి సతీమణి శ్రీమతి బేగం ఆబీదా సెప్టెంబర్ 8 వ తేదీన ఆంధ్ర మహిళా సభకు వెళ్లి, అక్కడి వివిధ శాఖలను పరిశీలించి, ఆ సంస్థ మహిళాలోకానికి చేస్తున్న సేవను ప్రశంసించారు.

రాష్ట్రపతి సెప్టెంబర్ 5 వ తేదీన ఉపాధ్యాయ దినోత్సవాన్ని ప్రారంభిస్తూ, ఉపాధ్యాయుల పరిస్థితులను శాయశక్తులా మెరుగుపరచడానికి రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని ఉద్బోధించారు. ఆయన సెప్టెంబర్ 6 వ తేదీన శిశుసంక్షేమ వ్యవహారాలపై జాతీయ విధానానికి సంబంధించినరాష్ట్ర మహాసభను ప్రారంభిస్తూ, కేంద్ర ప్రభుత్వం దేశంలోని 30 ప్రాంతాలలో ప్రారంభించనున్న సమగ్ర శిశు సంక్షేమాభివృద్ధి కార్యక్రమం విజయవంతం కాగలదని ఆశించారు. ఈ విజయాన్నిబట్టి ఈ కార్యక్రమం తక్కిన ప్రాంతాలకు విస్తరింప జేయబడుతుందన్నారు. సెప్టెంబరు 6న ఆంధ్ర ప్రదేశ్ ఫోటోగ్రఫీ అకాడమీ ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనాన్ని ప్రారంభిస్తూ, జాతీయ స్థాయిలో ఫోటోగ్రఫీ అకాడమీ నెలకొనడం అవసరమని, అప్పుడు ఫోటోగ్రఫీ కళకు తగిన ప్రోత్సాహం లభించ గలదని అన్నారు. రాష్ట్రపతి సెప్టెంబరు 1వ తేదీన హుస్సేన్ సాగర్ కట్టదిగువ 80 ఎకరాల ప్రాంతంలో హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ తలపెట్టిన ఇందిరా నేషనల్ పార్కుకు శంకుస్థాపన చేస్తూ, నగరాలలో జనసమ్మర్దం తగ్గించడానికి, గ్రామీణ ప్రాంతాలలో అధికోద్యోగ కల్పనకు పరిశ్రమలను నగర, పట్టణ ప్రాంతాల నుండి గ్రామ ప్రాంతాలకు తరలించాలని కోరారు. వివిధ కార్యక్రమాలలో పాల్గొన్న తర్వాత రాష్ట్రపతి 14 వ తేదీన ఢిల్లీకి బయలుదేరి వెళ్ళారు.

అంతర్జాతీయ సంగీత దినోత్సవం

అంతర్జాతీయ సంగీత దినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 29న ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ యాజమాన్యాన కళాభవన్‌లో శ్రీ కె. వి. గోపాల స్వామి అధ్యక్షతన జరిగిన సమావేశములో అకాడమీ మాజీ కార్యదర్శి శ్రీ ఎం. ఎన్. పద్మారావు భారతీయ సంగీత ప్రాదుర్భావాభివృద్ధులను గురించి పరిశోధనావ్యాసం చదివారు. భారతీయ సంగీతంలో ఉత్తరాదీ, దక్షిణాదీ అనే భేదమేమీ లేదని విదేశీయుల దండయాత్రల ప్రభావం వల్ల ఉత్తరాపథ సంగీతంలో కొంత మార్పు వచ్చిందనీ, ఇప్పుడు రెండూ సన్నిహితమై భారతీయసంగీత మనేది మరల నూతనంగా రూపొందుతున్నదనీ ఆయన తమ వ్యాసంలో వివరించారు.

నగరంలో వాన

'నగరంలో వాన' అనే ఒక కవిత ఎప్పుడో చదివినట్లు గుర్తు. చదివి నప్పుడేమో హాయిగానే వుంది. కాని సెప్టెంబరు మూడవ వారం నుండి సంతతధారగా కొన్నాళ్ల పాటు జంటనగరాలలో పడిన వానమాత్రం పౌరులను, ముఖ్యంగా పల్లపుప్రాంతాలలో ఉన్నవారిని, బీదాబిక్కీనీ చాలా ఇబ్బంది పెట్టింది. నష్టపడిన ప్రాంతాలను మున్సిపల్ వ్యవహారాల మంత్రి శ్రీ చల్లా సుబ్బారాయుడు, మునిసిపల్ అధికారులు మొదలైనవారు పరిశీలించి తగు సహాయ కార్యక్రమాలను ఏర్పాటుచేశారు.

నిరాశలో నిండు గుండె

— సి. ఆనందారామం

జరిగిన కథ:

జైలు నుండి విడుదలయిన చిరంజీవి, సి.ఐ.డి ఆఫీసర్ మోహన్‌తో అయాచితంగా పరిచయం పెంచుకుంటాడు. హోటల్ లోటస్‌లో ప్రసూన, మోహన్ కాకతాళీయంగా కలిసి తమ కాలేజీ రోజుల్ని తిరగదోడుకుంటారు.

చిరంజీవి కోసం బయలుదేరిన మోహన్ శ్యామ్‌నూ, నర్తకి రేఖనూ పబ్లిక్ పార్కులో చూసి విస్తుపోతాడు. శ్యామ్ తండ్రి జనార్దన్ మోహన్‌ను పెంచి పెద్ద చేసి విద్యా బుద్ధులు చెప్పించాడు. ఎప్పుడో ఓసారి క్లబ్‌గేంబ్లింగ్‌లో పట్టుబడ్డ శ్యామ్‌ను, రూల్సు ఒప్పకున్నా జనార్దన్ మాట కాదన లేక విడిచి పెట్టాడు కూడా. ఇప్పుడు రేఖ ప్రక్కన శ్యామ్‌ను చూసే సరికి గుండె ఝల్లుమంది.

4

తన పెద్ద మేడలో ఉన్న విశాలమైన గదులన్నీ రోజూ తిరిగి చూసుకుంటాడు సాంబశివం... ఇంటిముందు ఆవరణలో గుబురుగా పెరిగిన గులాబి మొక్కల్నీ, అందంగా పరచుకున్న లాన్లనూ సంతృప్తితో చూసుకుంటూ నిలిచి పోతాడు... ఇవన్నీ తనకే! సాంబశివానివే, కాదు! సాంబశివం గారికే! అబ్బ!

గుండెల నిండా ఊపిరి పీల్చి వదులు కుంటాడు సాంబశివం..

ఒకనాడు పూరిగుడెసెల్లో ఉంటూ ఆకాశాన్నంటే మేడలను ఆశగా... ఆబగా..! చూసేరోజుల్లో... ఒక నాటికి తనూ అలాటి మేడల్లో ఉండగలనని అనుకున్నాడా? తనను దూసుకొని పోయేకార్లలోని ఆసామిలను తిట్టుకున్నప్పుడు తనూ అలాంటి కార్లలో తిరగగలనని ఊహించ గలిగాడా? ఎంత అదృష్టం! కాదు— స్వయం కృషి, తను సాధించింది!

ఈ కార్లు—మేడలూ, డబ్బూ ఒక ఎత్తు... సుశీల ఒకత్తి ఒక ఎత్తు......

రెండు జడలతో నవ నాగరికత ఉట్టిపడుతూ బి. ఏ. పాసయిన సుశీల తన కూతురు... అన్నీ తనపోలికలే! శిల్పి తన శిల్పాన్ని చూసుకొని చూసుకొని మురిసిపోయినట్లు......సుశీలను చూసుకుని ఆనందిస్తాడు సాంబశివం—తండ్రి కళ్ళలో ఆ ఆప్యాయత చూసుకొని అనురాగం....పొంగిపోరలే పితృ గర్వం చక్కగా అర్థమవుతాయి సుశీలకి.........

ఇంత సంతోషమూ, ఇంత గర్వమూ తన భార్య లలితను చూసే సరికి నీరు కారిపోతాయి...లలిత కళ్ళెత్తిచూస్తే చాలు! తనెక్కడి నుండి వచ్చాడో అక్కడికి తోసేస్తున్నట్లు అవుతుంది...

ఇవాళ సాయంత్రం చాలామందిని టీకి పిలిచాడు. అందరూ పెద్ద వాళ్ళు...అంటే పదవులలో ఉన్న వాళ్ళు. లలితకూడా ఉండాలి. ఉండమని అడగాలి...అదో యజ్ఞం...లలిత గదిలోకి తొంగి చూసాడు—లలిత తయారయింది. ఎక్కడి కయినా వెళ్తుందేమో. లలిత తయారవటం అంటే ఇస్త్రీ చీర కట్టుకుని బొట్టు పెట్టుకోవటం..లలిత కోసం ఎన్నోనగలు కొన్నాడు. ఒక్కటికూడా పెట్టుకోదు లలిత...

"ఇవాళ మనింటికి చాలామందిని టీకి పిలిచాను. నువ్వు వుండాలి—అన్నాడు" లలితతో.

"నేను పరమేశ్వరి ఇంటికి వెళ్తున్నాను"

అద్దం ముందు నించుని బొట్టు దిద్దుకొంటూన్న లలిత తిరగనైనా తిరగకుండా చెప్పింది...

"పరమేశ్వరి అంటే ఆ మొగుణ్ని విడిచేసిన ఆవిడేనా?"

"అవును—భర్తతో పడక ధైర్యంగా విడిపోయింది"

"నువ్వు అక్కడికి వెళ్ళటానికి వీల్లేదు ..."

"అలామాట్లాడొద్దని చెప్పాను—నన్ను డబ్బిచ్చి కొనుక్కున్న మాట నిజమే అయినా కొన్ని హక్కులు నాకు ఉంచుకునే అమ్ముడు పోయాను...... "

డబ్బిచ్చికొనుక్కోవడము, అమ్ముడు పోవడము... ఇలాటి మాటలు లలిత ఎలా వాడుతుందో కాని అవి సాంబశివం మనసును చిత్రవధ చేస్తాయి.

"అలాంటి స్నేహాలు మన స్థోమతుకు తగినవి కావు..."

"స్థోమతు అంటే......కట్ట కాసుల పేర్లు వేసుకునే అప్పలమ్మలకుంటుందే?......అదా?"

"అప్పలమ్మల ప్రస్తావన తేకు."

"తప్పేముందీ? పాలమ్ముకునీ, పచ్చళ్ళమ్ముకునీ... పిడకలమ్ముకునీ... ఇంకా అమ్మడానికి వీలైనవన్నీ అమ్ముకుని వాళ్ళు పరమేశ్వరి కంటే పదిరెట్లెక్కువగా డబ్బు పోగేసుకోగలరు. అదంతాస్థోమతు అనుకోగలిగే సంస్కారం నాకులేదు".........

లలిత 'సంస్కారం' అన్నమాట వాడినప్పుడల్లా సాంబశివం ముడుచుకుపోతాడు— ఆసంగతి లలితకు తెలుసు.........

" అలాంటి చెడిపోయిన వాళ్ళతో స్నేహంచేస్తే మనమూ చెడిపోతాం...... ....."

"చెడిపోవటం అంటే?"

"మొగుణ్ణి వదిలి తైతక్కలాడటంకంటే చెడిపోవటం ఏం కావాలి?"

"అవును, ఏదో ఒక మొగుడి చాటున ఎన్ని తైతక్కలాడినా చెడిపోవడం కాదు!"

గురిచూసి వదలే బాణాల్లా ఉండే లలిత మాటలను ఎదుర్కొ గలిగే శక్తి సాంబశివానికి ఏనాడూ లేదు. పకాలున నవ్వింది లలిత...

బెంగ పెట్టుకోకండి—నేను చెడిపోను. అంతే లేచిపోను.. లేచి పోయేదాన్నయితే ఎప్పుడో లేచి పోయేదానిని—ఇన్నాళ్ళు ఆగటం దేనికి?"

ఆమాట నిజమే? లలిత అంతరంగంలోని అణువణువూ ఆ ఇంటినీ...ఆఐశ్వర్యాన్నీ... ఆ మొగుణ్ణీ వదిలి లేచిపోవాలని పరితపించిపోయిన రోజులు లేకపోలేదు...

బ్రతికి చెడిన కుటుంబంలోని పిల్ల లలిత ... బి. ఏ. పాస యింది. బి. ఏ. పాసయినా, రూపం వున్నా, గుణం వున్నా, కట్నం ఇచ్చుకోలేని కారణంగా సరి అయిన సంబంధమేదీ కుదర లేదు...సంస్కారాలూ...ఉన్నతాశయాలూ, మహత్తర ఆదర్శాలూ అన్నీ ఏమూల దాకున్నాయో....వచ్చిన సంబంధాలన్నీ ఏదో ఒక వంకపెట్టి తప్పుకుపోయాయి......

పిల్లకి పెళ్ళి కాదనే దిగులుతో తల్లి, లలిత ముందే "నా గుండెలమీద కుంపటిలా వున్నావు." అని విసుక్కునేది...తండ్రి దిగాలుగా కాళ్లీడ్చుకుంటూ ఏ పార్కుకో వెళ్ళిపోయేవాడు ... అన్న దిగజారిపోతున్న పాతకాలపు హోదాను పట్టుకు వేళ్ళాడలేక, వదలలేక నలిగిపోయేవాడు...చుట్టుపక్కల అమ్మలక్కలు "ఇంకా పెళ్ళికాలేదూ?" అని ముఖంమీదే అడిగేవారు...అందుకు లలిత లోనే ఏదో తప్పు ఉన్నట్లు వెటకారంగా నవ్వేవారు...

ఇలాంటి సందర్భంలోనే సాంబశివం సంబంధం వచ్చింది. లలిత అన్నకు ఎవరో మధ్యవర్తులు చెప్పారు ... "లలితా అతడు ఏ థర్డుఫారమో చదువుకున్నాడు. అయితేనేం? హోటల్ నడి పిస్తున్నాడు. డబ్బుంది ... చేసుకుంటావా?" అన్నాడు అన్న కొంచెం బాధపడుతూనే...లలిత ఏమీ ఆలోచించలేదు. వెంటనే ఒప్పేసుకుంది. ఆవిడ మనస్సు అప్పట్లో పెళ్ళిగురించీ, వైవాహిక జీవితం గురించీ ఆలోచించే స్థితిలో లేదు. తల్లి చిరాకు మాటలూ...అన్న ఆవేదన...అమ్మలక్కల వంకరటింకర వ్యాఖ్యానాలూ...వీటన్నిటి నుండి తప్పించుకునిపోతే చాలని మాత్రమే అనుకుంది......

పెళ్ళి జరుగుతుండగనే సాంబశివాన్ని చూసి హడలి పోయింది లలిత...అనుక్షణం తన గొప్పతనం చూపించుకోవాలనే ఆరాటమే! మీ అందరికంటె నేను ఎక్కువ సుమా! అన్నట్లు మాట్లాడటమే...

మొదటి రాత్రి భర్త విశ్వరుపాన్ని చూడ గలిగింది లలిత...

బాగా తాగి వచ్చాడు సాంబశివం...తాగి కాని, అతడు ఆడదాని దగ్గరకు రాడు...రాక్షసుల నిజస్వరూపం నిద్రలో కనిపించినట్లు ఆత్రాగుడు మత్తులో అతి కష్టంమీద కల్పించు కున్నపై పొరలన్నీ కరిగి పోయి అసలు స్వరూపం సాక్షాత్కరించింది...

బండ బూతులు...ఏస మాటలు...పశువులాంటి మొరటు ప్రవర్తన......

భయంతో, జుగుప్సతో జలదరించిపోయింది లలిత ... ఆక్షణంలోనే అక్కడి నుంచి పారిపోవాలనిపించింది. కానీ ఏమార్గమూ లేదు..ఏమంటారుదీన్ని? రేపింగా? వ్యభిచారమా? ఏమో! ఏమంటారో? దీనికి తగిన పేరు ఇంత వరకు భాషలో లేదేమో! దానిని దాంపత్యమని అనరనీ దీనికి మరో పేరేదైనా కనిపెట్టాలనీ ఎవరికీ తట్ట లేదేమో...

వాసన...అనాగరీకపు వాసన ...మొరట పశుత్వపు వాసన మూర్ఖత్వపు వాసన...ఆ వాసన భరించ లేక పోయింది లలిత...

లలితలోని వ్యతిరిక్తత ఆవిడ శరీరంలోని అణువణువునా తెలుస్తోన్న కొద్దీ సాంబశివానికి మరింత సరదాగా ఉంది...హింసించి ఆనందించే అనాది మానవుల అంతరంగాలలోని క్రౌర్యమేదో అతనిలో పడగవిప్పి ఆడేది......

తన చదువుతో...సంస్కారంతో...సౌకుమార్యంతో జీవితాన్ని గురించి లలిత కన్నకలలకు...ఈ జీవితానికి సామ్యమే లేకుండా పోయింది......

శక్తివంతా కూడదీసుకుని సహనంతో సంసారం చెయ్యాలని ఎంత ప్రయత్నించినా లలిత వల్ల కాలేదు— ఆ ఐశ్వర్యమూ— ఆ మొగుడు.. అవన్నీ తను అనుభవించే నరకం నుండి విముక్తి పొందటానికి అతి తేలిగ్గా వదులు కోగలనని అనిపించింది.

ఏమయితే అయిందని లేచిపోవటానికి నిర్ణయించుకుంది... ఈ నిర్ణయానికి లలిత కాస్త ఆలస్యంగా వచ్చింది...ఎందుకంటే దృఢంగా వెళ్ళిపోవాలని అనుకున్నాక తాను గర్భవతినని తెలుసు కుంది లలిత...నెత్తిమీద పిడుగు పడినట్లయింది. నవనాడులూ, కృంగి పోయాయి.

పుట్టిన పాప తన బంధంతో లలితను బంధీ చేసేసింది. రోజులు గడచినకొద్దీ సాంబశివం రంగులన్నీ ఒక్కొక్కటే అర్థం కాసాగాయి లలితకు – ఆరని కసితో రగులుకు పోవటం తప్ప ఏమీ చెయ్యలేని అశక్తురాలయి పోయింది...

ఏ విధంగానూ లలితను జయించలేని సాంబశివానికి తన చేతిలో వున్న ఒకే ఒక ఆయుధం సుశీల అని తెలుసు–

చెప్పులు తొడుక్కుంటూన్న లలిత దగ్గరకు వచ్చింది సుశీల.

" ఎక్కడికైనా వెళ్తున్నావా అమ్మా!" అంది.

" అవును. నా ఫ్రెండ్ దగ్గరికి– — "

" ఇవాళ ఇంటి కెవరో వస్తున్నారట! నాన్న నన్ను ఉండమన్నాడు– నేను ఒక్కదాన్నీ వాళ్ళమధ్య ఎలా ఉండగలనమ్మా! మవ్వూ ఉండవూ?"

" నువ్వు కూడా ఉండకు -- మీనాన్నను ఎదిరించు -- "
అనలేక పోయింది లలిత తండ్రిని ఎదిరించమని కూతురికి చెప్ప గలిగే శక్తి లేకపోయింది. అడుగడుగునా లలిత కాళ్ళకు అడ్డు పడుతున్నది ఈ సంస్కారమే!

వయస్సులో ఉన్న కూతుర్ని సాంబశివం పోగు చేసే స్నేహితులమధ్య వదిలి వెళ్ళలేక పోయింది లలిత ఆగిపోయింది-

సాంబశివం లలిత దగ్గరకొచ్చి వెటకారంగా నవ్వుతూ " వెళ్ళటం లేదా ? " అన్నాడు.

సుశీల కెలాగో అనిపించింది — తల్లిని ఆపు చెయ్యమని తండ్రి పంపితేనే వచ్చింది- ఇప్పుడు తల్లిని వెటకారం చేస్తున్నాడు- ఎవ్వరి మాటా లక్ష్యపెట్టకుండా తల్లి వెళ్ళి పోతే బాగుండునని అనిపించింది.

ఎర్రగా చూసింది లలిత — ఆ చూపులు బోనులో ఉన్న మృగరాజు చూపుల్లా వున్నాయి. చటుక్కున తల్లిదగ్గరగా వచ్చి ఆప్యాయంగా చెయ్యి పట్టుకుంది సుశీల లలిత కూతురివైపు చూసింది. కళ్ళలో ఎరుపు కరిగి పోయింది పేలవంగా నవ్వింది.

(సశేషం)

చిరంజీవి



ఎదపై ధరియించెనతడు, ఎఱ్ఱగులాబీ పూవును
ఎదలో వాంఛించెనతడు భరత జాతి అభ్యుదయము
పెదవులపై చిందించును, ఎఱ్ఱటి దరహాసమునెప్పుడు
కన్నులలో వెలిగించును, కాంతి తోరణములనెపుడు

అతని హృదయమున రగిలె, అరని ఒక అభ్యుదయజ్వాల
ఆ జ్వాలా మాలికల ఘనతోరణాలె మనకు బాట
అతని మనసు వాంఛించెను అన్నిట నభ్యుదయమ్మును
అతని ధ్యేయ మొకటెసుమ్మా! విశ్వమానవాభ్యుదయము

అతడుగోరె భరతదేశ అత్యున్నత ప్రగతినెపుడు
ఆతడె నిర్మించె నేటి అధునాతన భరతజాతి
నవభారత నిర్మాతగ, నవసమాజ నిర్ణేతగ
నవజీవన సంధాతగ, నాతడు నిర్మించె చరిత

అతని హృదయ మమృతకలశ మతని రూప మద్భుతమ్ము
అతని నోట జలద స్వనగంభీరత వెడలు రవము
పీడిత జనబాంధవుండు పేదల పాలిట పెన్నిధి
సామాన్యుని బాగుగోరు సమతా సిద్ధాంత వేత్త

భరతమాత ప్రియ పుత్రుడు, భరతజాతి ప్రియనేతయు
విశ్వశాంతి సంస్థాపన విభవోజ్వల మానసుండు
శాంతిదూత యనెడిపేరు సార్థకమొనర్చిన వీరుడు
కర్మయోగియౌచు దేశాభ్యున్నతి సాధించెనతడు

అతని చరిత అజరామర, మతని జన్మసార్థకంబు
అతనిబోలు మేటినేత లరుదు నేటి వసుధయందు

ఎవరాతడు? ఎవరాతడు? ఎవరా ఘనత్యాగశీలి
ఎవని పేరు విన్నమాత్ర ముప్పొంగును భరతజాతి,

ఆతడు ఉత్తాల తరంగ, సంకుల సుమనస్పందువు
గంభీరముద్ర ధరియించిన గగనచుంబితుషారాద్రి
ధీరత్వము మూర్తిగొన్న మహిమాన్విత మేరునగము,
శూరత్వము, రూపుగొన్న, సురరాజాతని రూపము.

మానవ కల్యాణమునకై మహినిశాంతి వెలయించిన
బుద్ధుని ప్రతిరూపమె, తానుగ, సంకల్పసిద్ధుడైన ఘనుడు
భరతమాత కంఠమందు మెరసిన, కంఠాభరణము
భరతజాతి జీవనమున మరుగువడని కాంతిరేఖ

ఆతడె మన ప్రియజవహరు డతని మరువ నెవరితరము
ఆతని కాతండెగాక, అతని బోల నెవరితరము?
వసుధపైన భరతజాతి వరలు నంతదనుక నతడు,
చిరంజీవియౌచు జాతి ఎదలో జీవించియుండు

—శ్రీయర్రమిల్లి చలపతిరావు శ్రీవత్సవ

పాఠక లేఖలు

శ్రీకాకుళం జిల్లాలో సన్నకారురైతుల అభివృద్ధికి ఎంతగానో కృషి జరుగుతున్నది. ఈ జిల్లాలో తాళ్ళవలస గ్రామవాసి శ్రీ సింకా నారాయుడు జీవితాన్ని సన్నకారు రైతుసంస్థ ప్రగతి మార్గాన నడిపింపగా, ఆ ప్రగతిని సెప్టెంబరు "ఆంధ్రప్రదేశ్" 'వెలుగులోకి' తీసుకు వచ్చినందుకు మీకూ, ఫొటోలతో ప్రచురించిన రచయిత శ్రీ టి ప్రకాశరావు గారికి మా అభినందనలు.

ఆనందరావు
రణస్థలం

ఆగస్టు మాసం "ఆంధ్రప్రదేశ్" పత్రిక ప్రధాని ముఖచిత్రంతో ప్రగతికి ప్రతీకగా వెలుగు కిరణాలు వెదజల్లింది. కవితలు పసందుగా వున్నాయి. "నిరాశలో నిండుగుండె" సీరియల్ నవల మాకు చాలా నచ్చింది. ఇంకనూ తదితర శీర్షికలన్నీ కూడా పఠనావశ్యకంగా వున్నాయి.

బి. చంద్రకాంత్
జహీరాబాద్

సెప్టెంబరు నెల "ఆంధ్రప్రదేశ్" ను చూడగానే నాకెందుకో అనిర్వచనీయమైన ఆనందం కలిగింది. రెండో కవరు పేజీలోని విషయాలు పోటీపరీక్షలకు వెళ్ళేఅభ్యర్థులకు పనికివస్తాయి "తెలుగుతల్లి" గేయం బాగుంది. "నవచైతన్యం" ద్వారా ఆంధ్రావనిలోనే నవ చైతన్యాన్ని తెచ్చారు. "తెలుగు సాహిత్య చరిత్ర" నాకెంతో యిష్టం. గ్రంథసమీక్ష నాఅభిమానపాత్రం. ఆనందారామంగారి నవల చాలా బావుంది. నిజంచెప్పాలంటే శీర్షికలన్నీ విలువకట్టలేనివే.

ఎ. నాగరాజశర్మ
పీలేరు

"నూతనకార్యక్రమావళితో నవచైతన్యం" ముఖచిత్రంతో విరాజిల్లిన "ఆంధ్రప్రదేశ్" సెప్టెంబరు సంచిక నూతన సందేశాన్ని అందించింది. శ్రీ కె. వి. కేశవులు గారు "చేనేతకు చేయూత" వ్యాసంలో ఎన్నో విషయాలను యథాతథంగా చిత్రించారు. వారన్నట్లుగా నూతనమైన ఎక్కువ వుత్పత్తినిచ్చే మగ్గాలను త్వరగా చేయించినట్లయితే ఎక్కువ వుత్పత్తి జరుగును శ్రీమతి సి. ఆనందారామం గారి "నిరాశలో నిండుగుండె" బాగా సాగుతూంది.

లతీఫొద్దీన్ అహమ్మద్
సుల్తానాబాద్

ఆగస్టు మాసంలో అచ్చయిన "సోమశిల ప్రాజెక్టు", ఆదే సంచికలోని "దక్షిణ మధ్య రైల్వే" తెలుగు ప్రజలు గర్వించతగిన ప్రచురణలు. సెప్టెంబరు మాసంలో 20-సూత్రల వివరణ ఒక తరగతి విజ్ఞత కలిగిన పాఠకుల్ని ఆకట్టుకుంటుంది. "వార్తావాహిని" వ్రాస్తున్న శ్రీమతి స్వరాజ్యలక్ష్మికి అభినందనలు ఇది ప్రభుత్వ పత్రిక కనుక ప్రభుత్వం తరఫున ప్రజలకు, ముఖ్యంగా కొంత సమంజసమైన ప్రశ్నలు వేసేవారికి సమాధానాలిచ్చే శీర్షిక ప్రవేశపెడితే బాగుండును. ఇకపోతే "రాజధాని విశేషాలు" వ్రాస్తున్న రామచంద్రగారు, ఆంధ్ర పత్రికకు వ్రాసేవారు ఒకరేనా ?

పున్నమనేని కామేశ్వరి
ఖైరతాబాద్

[ఒకరే. (సం)]

"ఆంధ్రప్రదేశ్" పత్రికకు నేను గత ఎనిమిది ఏళ్ళుగా అభిమానిని. ఆంధ్ర రాష్ట్రాభివృద్ధిని, ఆంధ్రుల సంస్కృతిని విశదపర్చి తెలియజేసే ఒకే ఒక్క మాస పత్రిక యిది. ఈమధ్య క్రమం తప్పక సకాలంలో ప్రచురించడం కూడా అభినందనీయం.

బలివాడ విశ్వనాథం
జబల్‌పూర్, మధ్యప్రదేశ్

సెప్టెంబరు నెల "ఆంధ్రప్రదేశ్" 'నూతన కార్యక్రమావళితో నవచైతన్యం' ముఖచిత్రంతో మాడముచ్చటగా వుంది. ఇకముందు గూడా మంచి ముఖచిత్రాలు వేస్తారని ఆశిస్తాను. 'తెలుగుతల్లి' కవిత, 'నిరాశలో నిండుగుండె' సీరియల్ నవల బాగున్నాయి కార్టూన్లు ఎక్కువగా వేస్తారని ఆశిస్తాను.

అరువపల్లి లక్ష్మీరాజ్యం
కమాన్‌పూర్

ఈ మధ్య "ఆంధ్రప్రదేశ్" ను చాలా చక్కని వ్యాసాలతో, విశేషాలతో వెలువరిస్తున్నందుకు మీకు నా అభివందనలు. మహిళల కంటూ ప్రత్యేకంగా ఒక శీర్షికను, పిల్లలకు ఒక శీర్షికను నిర్వహిస్తే బాగుంటుందని నా అభిప్రాయం.

(మీ సూచన గురించి ఆలోచిస్తాం—సం.)

కె. ప్రభాకరదేవ్
శ్రీకాకుళం

సెప్టెంబరు పత్రికలో వ్యాసాలన్నీ బాగున్నాయి. శ్రీ సోమశర్మ సూరి 'విందు' వంటి పేలవమైన కవిత ఈ మధ్య "ఆంధ్రప్రదేశ్" లో మరొకటి ప్రచురితం కాలేదనుకుంటాను. ఈ కవితను ఎన్ని మారులు చదివినా అందులో కవిగారిచ్చే సందేశమేమిటో బోధపడలేదు.

లింగంపల్లి రామచంద్ర
జనగామ


సెప్టెంబరు మాసం ముఖచిత్రం వర్ణనాతీతం. "తెలుగుతల్లి", "సమైక్యాంధ్ర సందేశం" కవితలు బాగున్నాయి. గ్రంథసమీక్ష శీర్షిక వలన కొన్ని గ్రంథములను గురించి తెలుసుకునేందుకు అవకాశమున్నందుకు కృతజ్ఞతలు. ధారావాహికంగా వెలువడుతోన్న "సంక్షిప్త తెలుగు సాహిత్య చరిత్ర", "నిరాశలో నిండు గుండె" యీ పత్రికకు ఆణిముత్యాలు.

గొట్టిముకుల మనోహర్‌శర్మ
పెద్ద అడిచర్లపల్లి

ఆగస్టు సంచిక స్వాతంత్ర్యోత్సవ ప్రత్యేక సంచికగా పాఠకులను అలరించింది ఈ మాసమే ప్రారంభమైన "నిరాశలో నిండుగుండె" అనుభూతుల్ని పెంచింది. "ఊరో పెపంచం" ముగింపు బాగుంది. మీ పత్రికలో గ్రామాల వార్తలు కూడా వేయడానికి ఓశీర్షిక పెట్టవలసి" నదిగా కోరుతున్నాను.

మందలపు రోశయ్య
బండ్లవారిపాలెం

[మా 'జిల్లావార్తలు' శీర్షిక దానికి ఉద్దేశించినదేగదా. (సం)]



మహాభారతము

శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రి

90

"దేవా ! నీవు దేవేంద్రుడవని యింతకు ముందే నాకు తెలియును. నీవు కోరిన వరమును నేనిచ్చుట న్యాయము కాదు. నీకోరిక వ్యర్థమైనది. నీవు సాక్షాత్తు దేవేంద్రుడవు. నావంటి వారలకు వరము లీయవలసిన వాడవు. త్రిలోకములందలి సమస్త జంతు జాలమునకు నీవు ఈశ్వరుడవు. కవచకుండలములను నీకిచ్చిన యెడల నేను వధ్యుడనగుట మాత్రమే కాక, త్రిలోకాధిపతివై నావంటి అల్పుని యాచించినావని ప్రపంచము నందు నీవు పరిహాసము పాలగుదువు. కాబట్టి ఈ కవచ కుండలములకు బదులుగా నీవేదైన నాకిచ్చి యథేష్టముగా వీటిని తీసికొనుము. లేకున్న నేను నీకు ఇవి యీయను." ఆ తరువాత ఆ యిరువురకు ఇట్లు సంవాదము జరిగెను.

ఇంద్రుడు.— కర్ణా ! నీకడకు నేను వచ్చునప్పుడు అంతకు పూర్వమే సూర్యుడు నీకడకు వచ్చినట్లు నాకు తెలియును. అతడే నీకు ఈ సంగతి చెప్పి యుండుననుటలో సంశయము లేదు. నీయిష్టప్రకారమే యగుగాక. నాయనా ! నా వజ్రాయుధము దప్ప మరియేదైనను కోరుకొనుము ఇచ్చెదను.

కర్ణుడు :— (మిక్కిలి సంతుష్టుడై) మహాత్మా ! కర్ణకుండలములను తీసికొని నాకు నీవు, యుద్ధములందు శత్రు సంహారిణియగు నీయమోఘ 'శక్తి' ని ఇమ్ము.

ఇంద్రుడు:— (మనస్సు నందు శక్తిని స్మరించి) సరియే. నీకవచ కుండలములను ఇమ్ము. నా 'శక్తిని' తీసికొనుము. ఈ యొడంబడికకు నేను అంగీకరించినాను. కాని, ఒక ముఖ్య విషయమును చెప్పెదను. నా చేతినుండి ప్రయోగింప బడు ఈ 'శక్తి' యాయుధము అమోఘముగా నూర్లకొలది శత్రువులను సంహరించి, నాచేతికి తిరిగివచ్చి చేరును. అట్లు నీకు కాదు. ఇది నీచేతికి వచ్చిన తరువాత, బొబ్బలిడుచు, తపించుచున్న నీశత్రువును ఒక్కనిని మాత్రమే సంహరించి తిరిగి నాచేతికి వచ్చి చేరును. తరువాత ఆ 'శక్తి' నీవద్ద ఉండదు.

కర్ణుడు:— దేవేంద్రా ! మహాయుద్ధమునందు, ఎక్కువగా బొబ్బలిడుచు, తపించుచు, నాకు మిక్కిలి భయము గూర్చెడు ఒక్క శత్రువును మాత్రమే సంహరించగోరుచున్నాను!

ఇంద్రుడు :— కర్ణా ! అలాగేయగును గాక ! కాని, యేశత్రువును నీవు దీనిచేత సంహరించవలెనని యిప్పుడు ఊహించుచున్నావో ఆ యర్జునుడు, సాక్షాత్తు పరమాత్ముడై నారాయణ స్వరూపుడగు కృష్ణునిచేత సంరక్షింపబడుచున్నాడు. కనుక అతని యెడల ఇది వ్యర్థమైపోవును.

కర్ణుడు :— భగవన్ ! అట్లే కానిమ్ము. మహా ప్రతాపశాలియగు ఎవనినో ఒక్క వీరుని ఈ 'శక్తి'తో సంహరించెదను. 'శక్తి'ని ఇమ్ము. నా శరీరమును ఛేదించి యీ కవచ కుండలములను నీకు ఇచ్చిన యెడల, నా శరీరము కత్తి కాట్లచేత వికృతమై అతి భయంకరమగును. అట్లు కాకుండ నుండునట్లు చేయుము.

ఇంద్రుడు :— కర్ణా ! నీ వెప్పుడుగూడ అసత్యమును తలచవు కనుక నీ శరీరము గాయపడి భయంకరమై యుండదు. నీ తండ్రియగు సూర్యుని శరీరము వలెనే నీ శరీరము గూడ కవచకుండలముల తరువాత గూడ ప్రకాశించుచు తేజోవంతమై విరాజిల్లుచుండగలదు. నీ వద్ద ఇతర శస్త్రములేవియులేకుండ, నీకు ప్రాణాపాయస్థితి ఏర్పడినప్పుడే యీ శక్తిని ప్రయోగించవలెను. అన్యథా, యిది తిరిగివచ్చి నీపైననే పడగలదుసుమా ! అటువంటి పొరపాటు యెప్పుడుగూడ చేయకుము. జాగ్రత్తతో మెలగుము.

కర్ణుడు :— "దేవేంద్రా నీ యుపదేశము ప్రకారమే నాకు ప్రాణ సంకటావస్థ వచ్చినప్పుడే నేను నీవు ప్రసాదించిన యీ 'శక్తి' యాయుధమును ఉపయోగించెదను. నేను నిజము చెప్పుచున్నాను. నమ్ముము."

"జనమేజయ మహారాజా ! ఆ తరువాత కర్ణుడు జ్వలించుచున్న 'శక్తి' యాయుధమును ఇంద్రునినుండి తీసికొని, పదునైన కత్తియెత్తి, కవచకుండలములను తీయుటకుగాను తన అవయవములను ఛేదించెను. ఆ కర్ణుని కృత్యమును ఆకాశము నుండి చూచుచున్న దేవదానవులు చూచి పెద్దగా సింహనాదములను చేసిరి. కర్ణుని ముఖమునందు కొంచెముగూడ వికారము కలుగలేదు. దేవతలు దుందుభులు మ్రోగించిరి. దివ్యములైన పుష్పములను గురిసిరి. కర్ణుడు నెత్తుట దోగుచున్న కవచకుండలములను ఇంద్రునకు ఇచ్చెను.

"ఈ విధముగా ఇంద్రుడు కర్ణునకు కవచకుండలములు లేకుండజేసి, అతనికి లోకమునందు అజరామరమైన కీర్తిని కలుగజేసి, 'పాండవుల కార్యము నెరవేరిన' దని తలచి, స్వర్గమునకు పోయెను.

"ఈ విధముగా కర్ణుడు ఇంద్రునిచేత కవచకుండలములు లేకుండ చేయబడినాడని తెలిసి దుర్యోధనాదులు అతి దీనులై, దర్పము ఊడినవారివలెనైరి. కర్ణునకు అట్టి యవస్థ మూడినదని తెలిసి అరణ్యవాసులైన పాండవులు హర్షించిరి"

ఇట్లు వైశంపాయన మహాముని చెప్పగా విని జనమేజయ మహారాజు "మహాత్మా! పాండవు లాసమయమునందు ఎక్కడ ఉండి తమకు ప్రియమైన యీ విషయమును వినిరి? వారు అరణ్యవాసపు పన్నెండవ సంవత్సరము గడచిన తరువాత ఏమి చేసిరి? అంతయు సవిస్తరముగ తెలుప గోరెదను" అని యడుగగా వైశంపాయనుడు, జనమేజయా! పాండవులు ద్రౌపదిని తిరిగి సైంధవుని నుండి పొంది, సైంధవుని తరిమి వేసి, బ్రాహ్మణులతో పాటు, మార్కండేయ మహాముని వలన ప్రాచీన దేవర్షుల చరిత్రమును సవిస్తరముగా వినుచు, కామ్యకవనము నుండి వెడలి ద్వైతవనమును చేరిరి. ఇట్లు పాండవులు సంపూర్ణముగా పన్నెండేండ్లు వనవాసమును గడచిరి.'' అని జనమేజయ మహారాజునకు చెప్పి తరువాతి వృత్తాంతమునిట్లు చెప్పదొడగెను.

పాండవులు అరణిని అన్వేషించుట

"రాజా! యుధిష్ఠిరుడు రుచికరములైన కంద-మూల ఫలములు, విచిత్రములైనయనేక వృక్షములు, గల ద్వైతవనమును చేరిన తరువాత అందరు గూడ ఫలాహారమును చేసిరి. అచ్చటనే పాండవులు భార్యతో నివసించిరి.

"ఒకనాడు పరాక్రమవంతులైన పాండవులు ఒక బ్రాహ్మణుని కొరకు తమ శౌర్యమును ప్రదర్శించి మిక్కిలి కష్టములను అనుభవించిరి. కాని, చివరకు ఆక్లేశములు భవిష్యత్తు నందు సుఖమయములు గానే పరిణమించెను. జనమేజయా! ఆ వృత్తాంతమును వినుము.

"ఒకనాడొక బ్రాహ్మణుని యొక్క అరణి (యజ్ఞము కొరకు అగ్నిని చిలుకుటకు ఉపయోగించు రోలువంటి కొయ్య) తో పాటు మంథము (అట్టి రోటి యందు చిలుకుటకు కవ్వము వంటిది). చెట్టునకు త్రాటితో కట్టబడి యుండెను. ఒక మృగము చెట్టునకు శరీరమును రాచుకొనుచుండగా ఆ అరణి మంథములు ఆ లేడి కొమ్ములకు తగులు కొనెను. వాటితో పాటు ఆ మృగమే త్వరగా గంతులు వేయుచు ఆశ్రమము దాటి కనపడకుండ పరుగెత్తి పోయెను. అప్పుడా బ్రహ్మణుడు తన హోమాగ్ని సాధనము పోయినందుకు మిగుల దుఃఖించి, సహాయార్థమై ఆ వనమునందు తమ్ములతో నున్న ధర్మరాజు వద్దకు వచ్చి మిక్కిలి వ్యాకులపడుచు నతనితో నిట్లనెను;—

"మహారాజా! నా యరణిమంథములను మృగము తీసికొని పోయెను. నా యగ్నిహోత్రవిధి లోపించిపోయెను. కనుక మీరు ఆ మృగము కాలి గుర్తులు బట్టి పోయి దానిని పట్టుకొని నా యరణి మంథములను తెచ్చి యిండు.''

"బ్రహ్మణుని మాటలు విని యుధిష్ఠిరుడు మిగుల పరితాపము చెంది ధనస్సును తీసికొని ధనుర్ధారులైన తమ్ములతో ఆ మృగము వెన్నంటి పరుగెత్తి పోయెను. కొంత దూరము పోయిన తరువాత ఆ మృగమును వారు సమీపించిరి. పాండవులు ఆ మృగముపైన వివిధ బాణములను ప్రయోగించిరి కాని అవి దానికి తగులక పోయెను. ఇట్లు వారు ప్రయత్నము చేయుచుండగనే మృగము వారికి కనపడకుండ పోయెను. అప్పుడా వీరులు నిరుత్సాహులై దుఃఖించిరి. చల్లని నీడ గల యొక్క మఱ్ఱి చెట్టు క్రింద చేరి యిట్లు మాట్లాడు కొనిరి :—

పాండవుల ధర్మ సంశయము

"అప్పుడు నకులుడు కోపము, విచారము కల వాడై సోదరులతో 'మన కులము నందు ఎప్పుడు గూడ సోమరి తనముతో ధర్మ లోపము జరుగలేదు. అర్థలోపము గూడా సంప్రాప్తించలేదు మనను కోరిన యెవరికి గూడ కినుకతో ఉత్తరము చెప్పియుండ లేదు. ఇట్లుండగా. మనకు నేడు ఈ ధర్మసంకటమేల కలిగినది? అని ప్రశ్నింపగా ధర్మజాదులు ఇట్లు చెప్పిరి :—

యుధి :—సోదరా! ఆపదలకు ఒక సమయముండదు. అవి మూడుటకు నిమిత్తముగానీ, లౌకికమైన విశేష కారణముగాని యుండదు. మనము పూర్వజన్మమునందు చేసిన పుణ్య పాపకర్మములే మనను అంటియుండి ఆరెంటికి అనుగుణములైన ధర్మార్థములను మనకు పంచియిచ్చుచుండును.

భీము :—సభయందు దుశ్శాసనుడు 'ప్రాతికామి' (దుర్యోధనుని దూతలలో నొకడు) యను దూతకు బదులుగా తానే పోయి ద్రౌపదిని దాసినివలె కౌరవ సభకు బలాత్కారముగా ఈడ్చుకొని వచ్చినప్పుడు నేను అతనిని వధించలేదు. ఈ దోషము కారణముగానే మనకీనాడు ఇట్టి ధర్మ సంకటము కలిగినది.

అర్జు :—కర్ణుడు, కఠినములైన యెముకలను గూడ చీల్చునట్టి అతి కటువచనములు సభయందు పలికినప్పుడు, అవి విని కూడ మనము ఓర్చుకొనియుంటిమి. ఆకారణము చేతనే మనకు నేడు ఈ ధర్మ సంకటావస్థ మూడినది.

సహదే :—శకుని, జూదము నందు జయమును పొందినపుడు, అతనిని నేను సంహరించలేదు. దాని ఫలమే నేడు మనకీలాటి ధర్మ సంకటమును కలిగించినది.

"తరువాత ధర్మరాజు, నకులునితో: "ఈ చెట్టుపైన ఎక్కి నలువైపుల చూడుము. ఎక్కడనైన జలము ఉన్నదేమో లేదా. జలాశయ తీరములందున్న వృక్షములనైన కనిపెట్టిచూడుము. మనమందరము అలసిపోయి దప్పిగొన్నాము. అలసట తీర్చుకొనవలెను.

(సశేషం)

బహుముఖ శ్రేయోదాయకమైన
పంచాయతీరాజ్ వ్యవస్థ

శ్రీ పుతుంబాక శ్రీరాములు



19 వ శతాబ్దంలో లార్డ రిప్పను కాలాన, స్వపరిపాలనా వ్యవస్థలో కొంతమార్పు తీసుకురాబడింది. పంచాయతీ అనేది గ్రామ స్థాయిలో ఒక చట్టబద్ధమైన సంస్థగా రూపొందించబడింది. పంచాయతీ కేవలం తగాయిదాలు తీర్చే వ్యవస్థగా కాకుండా దానికి కొన్ని విధులు, బాధ్యతలు నిర్ణయింపబడినవి అయినప్పటికీ ఆ పంచాయతీలు గ్రామీణ ప్రజల జీవితంలో ఎటువంటి చైతన్యం కల్గించ లేకపోయినవి బ్రిటిషు ప్రభుత్వపు కాలంలోని పంచాయతీలలో ప్రజల ప్రాతినిధ్యం నామమాత్రంగానే ఉంటూ వచ్చింది పాలక వర్గానికి అనుకూలమయిన వ్యక్తులకు మాత్రమే పంచాయతీ పాలన అప్పగించబడేది. ప్రజల శ్రేయస్సు కాని, గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాలు కాని అంత ముఖ్యమైనవిగా పరిగణింపబడేవికావు.

మనదేశ జనాభాలో మూడువంతులపైగా నివశిస్తున్నది గ్రామాల్లోనే. గ్రామ సీమలు సర్వతోముఖాభివృద్ధి చెందిన నాడే దేశం సౌభాగ్యవంతమౌతుందన్న విషయం అందరూ ఎరిగినదే.

జాతిపిత అహర్నిశలూ కోరుకున్నది గ్రామసీమల సౌభాగ్యమే

జాతి పిత గాంధీజీ అహర్నిశలూ ఆశించినదీ, కోరుకొన్నదీ గ్రామ సీమల సౌభాగ్యమే గ్రామరాజ్యం తద్వారా రామరాజ్యం స్థాపించాలనే జాతిపిత ఆశయం, దేశ స్వాతంత్ర్యానంతరం కార్య రూపంలో పెట్టబడింది.

రాజ్యాంగ చట్టరీత్యా...

స్వతంత్ర భారతావని 1950 లో సర్వసత్తాక ప్రతిపత్తి కల్గిన ప్రజాప్రభుత్వంగా రూపొంది తనదిగా ఒక రాజ్యాంగ చట్టాన్ని రచించుకుంది. ఈ రాజ్యాంగ చట్టంలో గ్రామ పంచాయతీల నిర్మాణమై, వాటి ద్వారా గ్రామసీమల్లో స్వపరిపాలనకు ప్రత్యేకమైన ప్రాముఖ్యం కల్పించబడింది. గ్రామ పంచాయితీలు ఏర్పాటుచేసి స్వపరిపాలనా సంస్థలుగా వ్యవహరించుటకు కావలసిన అధికారములు వాటికి అప్పగించవలసినదిగా ప్రభుత్వమును ఆదేశిస్తూ రాజ్యాంగ చట్టంలో 41 వ నిబంధన పొందుపరచబడినది.

ఈ మేరకు సంయుక్త మద్రాసు రాష్ట్ర ప్రభుత్వం 1950లో పంచాయతీల చట్టం రూపొందించి అమలు పరిచింది. అంతకు ముందున్న పంచాయతీలు పునఃనిర్మింపబడినవి. పంచాయతీలుగా లేని గ్రామాలు పంచాయతీలుగా ఏర్పాటు చేయబడినవి రాష్ట్రంలోని అన్ని గ్రామాలు పంచాయతీ పాలన క్రిందకు తీసుకొని రాబడినవి. వయోజన ఓటింగు పద్ధతిన ప్రతి పంచాయతీకి ఎన్నికలు జరుపబడి, ప్రజా ప్రతినిధులకు పంచాయతీ పాలన అప్పగించబడింది.

మెహతా కమిటీ

స్వాతంత్ర్యానికి పూర్వం మన గ్రామాల్లో పరిస్థితి ఎంత దయనీయంగా వుండేదో తెలియని విషయంకాదు. దారిద్ర్యం, నిరక్షరాస్యత, అనారోగ్యం తాండవిస్తూ వుండేవి. రాకపోకల సౌకర్యాలు లేవు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు తెలియవు. రైతులకు కావలసిన సలహా, సంప్రదింపులు శూన్యం. ఈ విషయంలో వెంటనే తగుచర్య తీసికొనవలసిన బాధ్యత మన జాతీయ ప్రభుత్వం గుర్తించి, శ్రీ బల్వంతరాయ్ మెహతా అధ్యక్షతన ఒక కమిటీ నియమించింది. ప్రజల్లో, ముఖ్యంగా గ్రామ ప్రజల యొక్క జీవనస్థాయి పెంచుటకు వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, రోడ్ల నిర్మాణం—యీ రంగాల్లో క్రమానుగతమైన అభివృద్ధిని సాధించుటకు తీసికొనవలసిన చర్యలను సూచించవలసినదిగా పై కమిటీవారిని కోరటం జరిగింది

శ్రీ బల్వంతరాయ్ మెహతా కమిటీ సిఫార్సుల ననుసరించి, అధికార వికేంద్రీకరణ ప్రాతిపదికగా 1959 లో మూడంతస్తుల పంచాయతీ రాజ్య సంస్థలు రూపొందించబడినవి గ్రామస్థాయిలో గ్రామపంచాయతీలు అప్పటికి కలవు బ్లాకు స్థాయిలో పంచాయతీ సమితులు, జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్తులు 1959 లో ఏర్పాటు చేయబడినవి పంచాయతీ సమితులు, జిల్లా పరిషత్తుల చట్టం 1959 లో అమలులోనికి తేబడింది. తెలంగాణా, ఆంధ్ర ప్రాంతాలకు వేర్వేరుగావున్న పంచాయతీ చట్టాలు 1964 లో ఒకే చట్టంగా

సమగ్ర పరుపబడి అనేకమైన సవరణలతో అమలులోనికి తేబడింది రహస్యఓటింగు పద్ధతిన ఎన్నికలు జరుపడం, సర్పంచిపై, ఉపసర్పంచిపై అవిశ్వాస తీర్మానములకు అవకాశం కల్పించడం, ఎన్నికకాబడిన ప్రజా ప్రతినిధుల పదవీకాలం 2నుండి 5 సంవత్సరములకు పొడిగించడం యివి సమగ్ర పంచాయతీ చట్టంలో తీసుకరాబడిన ముఖ్యమైన మార్పులు. మనరాష్ట్రంలో యిప్పుడు మనకు 21 జిల్లా పరిషత్తులు, 324 పంచాయతీ సమితులు. 15,60 గ్రామ పంచాయతీలు కలవు.

పంచాయతీరాజ్ సంస్థలకు శాశ్వతమైన ఆర్థిక వనరులు సమకూర్చాలి. వేయగలిగినన్ని పన్నులు అన్ని వేసినా పంచాయతీలు రాబట్ట గలిగిన ఆదాయం చాలా స్వల్పం. దేశ జనాభాలో అత్యధిక సంఖ్యాకులు నివశిస్తున్నది గ్రామాల్లో. గ్రామాలు అభివృద్ధి చెంది, గ్రామ ప్రజల జీవన ప్రమాణం పెరిగిననాడే దేశాభివృద్ధి కలుగుతుంది. గ్రామీణ ప్రజల అభివృద్ధికి తోడ్పడవలసిన బాధ్యత ప్రభుత్వానిదేనన్న విషయం నిర్వివాదాంశం. సంతానం కమిటీ వారు అభిప్రాయ పడినట్లుగా ప్రపంచంలో ప్రభుత్వ సంపూర్ణ సహకారం లేకుండా ఎక్కడా స్థానిక సంస్థలు మనుగడ సాధించలేవు. గ్రామ స్థాయిలో వసూళ్ళు చేయబడుచున్న భూమి శిస్తు వగైరా పన్నులలో అధిక భాగం గ్రామాల వున్నతికి వుపయోగించవలసిన బాధ్యత ప్రభుత్వానికి వున్నది. వసూళ్ళు చేయబడుచున్న పన్నుల ప్రాతిపదిక మీదగాని, లేదా జనాభా ప్రాతి పదిక మీదగాని గ్రామాలకు నిధుల పంపకం జరగాలి. ఆ నిధులు పంచాయతీరాజ్ సంస్థలకు జమ చేయబడి వాటి ద్వారా అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించబడాలి. వెనుక బడిన ప్రాంతాలకు ప్రత్యేకమైన గ్రాంటులు యివ్వాలి. ఈ విషయంలో పంచాయతీ రాజ్‌పై హైపవర్ కమిటీ వారి సిఫార్సులు తూచా తప్పకుండా అనుసరించుట ప్రభుత్వం వారి విధి. ఆ కమిటీ వారి సూచన మేరకు పంచాయతీ రాజ్ ఫైనాన్స్ కార్పోరేషన్ వెంటనే నెలకొల్పాలి.

వివిధ ప్రభుత్వ శాఖలలో అనవసర వుత్తర ప్రత్యుత్తరాలకు తావు లేకుండా పంచాయతీరాజ్ సంస్థలు తమ వంతు నిధులు పొందే ఏర్పాటు జరగాలి. వివిధ పన్నులలో పంచాయతీ రాజ్ సంస్థలకు రావలసిన మొత్తములను ఒకే మొత్తముగా ఆయా సంస్థలకు ప్రభుత్వ ఖజానా నుండి డ్రా చేసుకునే ఏర్పాటు కల్గించాలి.

పంచాయతీ ఏరియాలోగల చెరువులు, పొరంబోకులు, తోపులు, కాలువ గట్లు- వీటి మీద వచ్చే ఆదాయం పంచాయతీలకు చెందాలని చట్టం చెబుతున్నప్పటికి ఆచరణలో మాత్రం వాటి మీద యాజమాన్యం రెవెన్యూ శాఖకే ఉంది. చట్టంలో సమకూర్చబడిన అన్ని వనరులపై పూర్తి అజమాయిషీ పంచాయతీ సంస్థలకే చెందేటట్లు చేయాలి.

కేంద్ర ప్రభుత్వం నడుపుతున్నదీ యిటు రాష్ట్ర ప్రభుత్వాలు నడుపుతున్నదీ, ప్రజా ప్రతినిధులే, ప్రజలచేత ఎన్నుకోబడినవారే. వీరూ ప్రజల చేత ఎన్నుకోబడినవారే. ప్రజల విశ్వాసానికి అందరూ సమాన పాత్రులే.

పంచాయతీరాజ్ సంస్థలయొక్క విధులు, బాధ్యతలు, అధికారములు చట్టరీత్యా ఒకసారి నిర్దేశింపబడిన తరువాత నిర్ణయింపబడిన పరిధిలో ఆ సంస్థలు స్వతంత్రముగా వ్యవవహరించే స్వేచ్ఛ కలిగి వుండవినాడు అవి సాధించ కలిగిన ప్రయోజనాలు కూడా ఏమీ వుండవు. దైనందిన వ్యవహారాలలో ద్వంద్వ పరిపాలన ఆ సంస్థల అభివృద్ధికి ఏమాత్రం దోహదం కాదు.

పంచాయతీరాజ్ సంస్థలపైన ప్రభుత్వ అజమాయిషీ వుండాలన్న విషయం ఎవరూ కాదన గలిగిన విషయం కాదు. అయితే అజమాయిషీ పేర అనవసర జోక్యం కల్పించుకున్ననాడు పరిపాలనా సౌలభ్యం చెడక మానదు. అధికార దుర్వినియోగం జరిగిన సందర్భాలలోనూ, అవినీతికి పాల్పడినప్పుడూ ఆయా సంస్థల మీదగాని అందుకు బాధ్యులైన వ్యక్తుల మీదగాని, కఠినమైన చర్య తీసుకొనే అధికారం ప్రభుత్వానికి వుండవలసిందే. ఆయా సందర్భాలలో ప్రజా శ్రేయస్సు దృష్ట్యా తీవ్రమైన చర్య తీసికొనవలసినదే.

ఏదో ఒక సంస్థలో లేక ఎవరో ఒకవ్యక్తి వల్ల జరిగిన పొరపాట్లకు సంస్థలన్నిటినీ గురిచేయడం సమంజసమైన చర్య కాదు. శిక్ష ననుభవించవలసినది నేరానికి బాధ్యులైన వ్యక్తులేకాని సంస్థలు కాకూడదు.

స్వపరిపాలనా సిద్ధాంతానికి పట్టుగొమ్మలు పంచాయతీ రాజ్ సంస్థలు. అవి క్షీణించిననాడు దేశంలో ప్రజాస్వామ్యానికి భవిష్యత్తు లేదు.

పంచాయతీ రాజ్ సంస్థలు పటిష్ఠం చేసే వుద్దేశ్యంతో ప్రభుత్వం వారు పంచాయతీ వ్యవస్థల చట్టాలలో తగు సవరణలు సూచించుట కొరకు 1969 లో శ్రీ వెంగళరావు కమిటీని 1971 లో శ్రీ నరసింహం కమిటీని నియమించింది.

సంస్కరణలు అమల్లోకి రావాలి

శ్రీ వెంగళరావు కమిటీ నివేదికలో సూచించబడిన విధంగా పరిపాలనా సంస్కరణల సంఘం సిఫార్సుల మేరకు బ్లాకులను, రెవిన్యూ తాలూకాలను ఒకే హద్దులోనికి తీసుకురావడం సమంజసం. ఇప్పుడున్న 195 రెవిన్యూ తాలూకాలను 284 తాలూకాలుగా మార్చి బ్లాకు కేంద్ర స్థానాలనే క్రొత్త తాలూకా కేంద్ర స్థానాలుగా మార్చాలి. ఇట్లు చేయుటవలన అదనపు ఖర్చు ఏ మాత్రము కాదు. సమితులలో పనిచేసే సిబ్బందిలో లోగడ జిల్లా బోర్డుల నుండి వచ్చినవారు తప్ప మిగతా విస్తరణాధికారులు, గ్రామ వికాసోద్యోగులు అందరూ ప్రభుత్వ వుద్యోగులే. సమితి ఒక్కంటికి 10 మంది లోపున వుండే నాన్-గవర్నమెంటు వుద్యోగులను కూడా ప్రభుత్వ వుద్యోగులుగా పరిగణించుతూ తాలూకా ఆఫీసులలో పనిచేయుచున్నవారిని పంచాయతీరాజ్ శాఖలో

విలీనం చేసిన యెడల ఏ మాత్రమూ ఖర్చు పెరగదు. సమితులలోను, జిల్లా పరిషత్తులలోనూ పనిచేసే వారిని ప్రభుత్వ వుద్యోగులుగా పరిగణించే పక్షంలో హైపవర్ కమిటీవారు సూచించిన మేరకు యితర శాఖల నాన్-గజిటెడ్ వుద్యోగులు జిల్లా పరిషత్తులోను పంచాయతీ సమితులలోను పంచాయతీరాజ్‌శాఖ నియంత్రణ క్రింద పనిచేయుటకు ఎట్టి ఆటంకము ప్రతికూలత వుండబోదు. పై రెండు కమిటీలవారు అభిప్రాయపడినట్లు రివిన్యూ శాఖ వుద్యోగులను యీ సంస్థలలో కొనసాగించు అవసరం వుండదు. ఈ సంస్థలలో పనిచేయు వుద్యోగులు ఎప్పుడైతే ప్రభుత్వ వుద్యోగులుగా పరిగణింపబడెదరో అప్పుడే రివిన్యూ శాఖనుండి యితర శాఖలనుండి వుద్యోగులు శాశ్వత ప్రాతిపదికపై యీ శాఖలో పని చేయుటకు అభ్యంతరము తెలుపరు.

తాలూకాలను సమితి పరిధులకు తెచ్చిన పిమ్మట ఆ సమితులలో పనిచేసే రెవిన్యూ సిబ్బంది జిల్లాకలక్టరు, తహసిల్‌దారు పర్యవేక్షణక్రింద శిస్తు వసూలు వగైరా పనులు చూసుకుంటూ ఆదే సమితులలో పనిచేయుచున్న పంచాయతీరాజ్ సిబ్బంది స్థానిక స్వపరిపాలనా కార్యక్రమము నిర్వహిస్తూ వుంటుంది. అందుకనే బ్లాకు డెవలప్‌మెంటు ఆఫీసరు హోదాను పెంచి రెవిన్యూ డివిజనులు అధికారి హోదా యివ్వవలసి వుంటుంది. తహసిల్‌దారును, యితర రివిన్యూ సిబ్బందిని సమితి నియంత్రణ క్రింద వుంచే పనిలేదు.

ఇప్పుడు సమితులలో, జిల్లా పరిషత్తులలో పనిచేయుచున్న ఎక్కౌంట్స్ బ్రాంచి వుద్యోగులను లోకల్ ఫండ్ ఎగ్జామినర్ సిబ్బందిని ట్రెజరీ మరియు ఎక్కౌంట్స్ సిబ్బందితో కలిపి క్రొత్తగా ఏర్పాటు చేయబడే ప్రతి తాలూకా కేంద్రంలోను ఒక సబ్ ట్రెజరీ ప్రారంభించి పంచాయితీల, సమితుల, జిల్లా పరిషత్తుల ఎక్కౌంటులు వారికి అప్పగించే యీ సంస్థలలో నిధుల దుర్వినియోగాన్ని అరికట్టి వాటిపై వున్న అపోహలను తొలగించవచ్చు. ఎప్పుడైతే యీ పని జరుగుతుందో ఆడిట్ అక్కౌంటెంట్ జనరల్ చేయవలసివుంటుంది. ఆ విషయంలో యిప్పుడున్న వివాదం తొలగిపోతుంది.

ఇంకొక్క సూచన ప్రభుత్వంవారి దృష్టికి తేవలసివుంది. పంచాయతీ రాజ్ శాఖ అనేపదం తెలుగుదనానికి దూరంగావున్నట్లు ధ్వనిస్తుంది. దానికి 'గ్రామీణాభివృద్ధి శాఖ' అని గాని 'స్థానిక స్వపరిపాలనా శాఖ' అనిగాని నామకరణం చేయడం సమంజసంగా వుంటుంది.

1959 పంచాయతీ సమితుల, జిల్లా పరిషత్తుల చట్టంలో సవరణలు తీసికొని రాబోతున్న యీ తరుణంలో రెవిన్యూ తాలూకాలను సమితుల పరిధికి పెంచటం, పంచాయతీలకు, పంచాయతీ సమితులకు, జిల్లా పరిషత్తులకు ప్రజా ప్రతినిధులను శ్రీ వెంగళరావు కమిటీ చేసిన సిఫార్సుల ననుసరించి ఎన్నుకొనుటకు అవకాశం కల్పించటం, శ్రీ నరసింహం కమిటీ చేసిన సిఫార్సుల ననుసరించి పంచాయతీ రాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ నెలకొల్పడం వారు సూచించిన ప్రాతిపదికపై పంచాయతీలు, పంచాయతీ సమితులు, జిల్లా పరిషత్తులయొక్క ఆర్థిక వనరులు పెంచడం, పంచాయతీ రాజ్ ఎకౌంట్స్ పని ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ డైరెక్టరుకు, ఆడిటు వ్యవహారం అకౌంటెంట్ జనరల్‌కు అప్పగించడంవంటి ఆచరణ యోగ్యము, నిర్మాణాత్మకము, అత్యంత వుపయోగమైన మార్పులను తీసుకొని రావటం అత్యంతావసరం.

—వార్తావాహిని

(19 వ పేజీనుండి)

నవంబరునుండి ప్రారంభమయ్యే పంటకాలంలో రు. 281 లక్షల అంచనా ఖర్చుతో 12 లిఫ్టు ఇరిగేషన్ పథకాలను ఈ కార్పొరేషన్ రూపొందించింది. ఈ పథకాలు అమలు పూర్తి అయిన తరువాత 23 వేల ఎకరాల మాగాణికీ, 30 వేల ఎకరాల మెట్టభూమికీ నీటిపారుదల సౌకర్యం లభిస్తుంది. ఈ పథకాలలో ప్రాగళ్లపల్లి కుమరందేవ వద్ద గోదావరిపైన, కృష్ణ ఉపనదిపెన్న నదిపైన తంగేడుపైన కుముదులూరువద్ద, నాగార్జునసాగర్ ఎడమ కాలువ మామిడావద్ద ఏలేరు నదిపైన, నరసాపూరు వద్ద సుద్దవాగుపైన, మోతుపల్లి కర్లపాలెంవద్ద మురుగునీటిపైన లిఫ్టు ఇరిగేషన్ పథకాలు అమలుచేస్తారు.

పశ్చిమ గోదావరి జిల్లా వేగేశ్వరపురం వద్ద గోదావరి నదిపై రు. 38 లక్షల ఖర్చుతో లిఫ్టు ఇరిగేషన్ పథకం అమలు జరిపారు. 1975 ఆగస్టు మొదటివారం నుండి పనిప్రారంభమైంది. ఈ పథకం ద్వారా 3 వేల ఎకరాల మాగాణి, 3 వేల ఎకరాల మెట్ట భూమికి నీటిపారుదల సౌకర్యం లభిస్తుంది.

కేంద్ర భూగర్భజలాల మండలి ఆదివరకే త్రవ్విన గొట్టపు బావులకు ఈ సంస్థ విద్యుచ్ఛక్తి సరఫరాచేసింది. ఇవి ఖమ్మం, నెల్లూరు, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, చిత్తూరు జిల్లాలలో వున్నాయి. దీనికి 21 లక్షల రూపాయలఖర్చు అవుతుంది ఈ సంస్థ ఖమ్మం జిల్లాలో 3 గొట్టపు బావులను త్రవ్వించి ఇతర జిల్లాలో మరో 10 గొట్టపు బావులపని చేపట్టారు. నవంబరు నుండి ప్రారంభమయ్యే పంటకాలంలో ఈ గొట్టపుబావుల త్రవ్వకానికి రు. 21 లక్షలు ఖర్చుచేయాలని ఈ సంస్థ తీర్మానించింది. ఆరు సూత్రాల పథకం క్రింద రాయలసీమ సత్వరాభివృద్ధికి 12 లక్షల ఖర్చుతో గొట్టపుబావుల త్రవ్వకపు పనిని చేపట్టింది. ఈ సంస్థ చేపట్టిన మొత్తం పథకాల అమలుద్వారా రు. 340 లక్షల ఖర్చుతో 27 వేల ఎకరాల మాగాణికీ, 49 వేల ఎకరాల మెట్టభూమికీ నీటి పారుదల సౌకర్యం లభిస్తుంది.

గ్రంథ సమీక్ష

తిమిరంలో సమరం-కాంతికవాటం-ఆలోచనాలోచనాలు

1. తిమిరంతో సమరం. కవితాసంపుటి; కర్త: డా. దాశరథి ప్రచురణ: మహాంధ్ర ప్రచురణలు, 90-సి వెంకటాచల మొదలి వీధి, మైలాపూర్, మద్రాసు-4. 1/8 డెమ్మీసైజు. 120 పుటలు. (రెండవ ముద్రణ) మూల్యం రూ. 5 00.

2. కాంతి కవాటం-సమీక్షాగ్రంథము డా. దాశరథి గారి తిమిరంతో సమరం పై సమీక్షలు ప్రచురణ: మహాంధ్ర ప్రచురణలు; 1/8 డెమ్మీసైజు 108 పుటలు. మూల్యం రూ. 5 00.

3. ఆలోచనాలోచనాలు. కవితా సంపుటి-కర్త డా. దాశరథి. ప్రచురణ: మహాంధ్ర ప్రచురణలు. 1/8 డెమ్మీసైజు. పుటలు 112 మూల్యం రూ. 5 00.

'తిమిరంతో సమరం' మహాకవి దాశరథి జీవితానికీ, కవితా జీవితానికీ ప్రతీకాత్మకంగా నిలిచే పేరు. మాన్యశ్రీ జలగం వెంగళరావు గారన్నట్లు ముప్పై అయిదేళ్ళుగా దాశరథి తిమిరంతో సమరం చేయని దెప్పుడు; తెల్లదొరల పరిపాలనకు వ్యతిరేకంగాను నిజాం నిరంకుశ పరిపాలనను ఎదిరిస్తూనూ, రెండు ప్రాంతాల తెలుగువారు ఏకం కావాలని ఉద్బోధిస్తూనూ, స్వాతంత్ర్యాన్ని దొంగిలించజూచే వారికి వ్యతిరేకంగా ప్రజలను సమీకరిస్తూనూ, స్నేహహస్తం చాచి చాటుగా వెన్నుపోటు పొడిచిన వారి కుట్రను బట్టబయలు చేస్తూనూ, ఆంధ్రప్రదేశ్‌ను ముక్కలు చేయాలనే రెండు వేర్పాటు ఉద్యమాలలోనూ ఐకమత్యం కోసం బలమైన కంఠంతో ప్రజలను ప్రబోధిస్తూనూ, బంగ్లాదేశ్ ఉదయానికి వైతాళిక గీతం పాడుతూనూ దక్షిణవియత్నాం కంబోడియాలలో ప్రజాశక్తులకు కలిగిన ఘనవిజయాన్ని కీర్తిస్తూనూ, భారతీయ శాస్త్రజ్ఞులు శాంతియుత ప్రయోజనాల కోసం అణువును భేదించి నప్పుడునూ దాశరథి కంఠం కవితను కాహళిగా మ్రోయించింది. నేటికీ ప్రపంచంలో వర్గభేదం, వర్ణభేదం మతోన్మాదం, ధనిక వాదం, ప్రజాఖేదం నశించాలని శాంతి విప్లవశంఖాన్ని పూరిస్తూనే ఉంది. రాష్ట్రానికీ, దేశానికి, ప్రపంచానికీ, సంబంధించిన సమస్యలకు స్పందించి ప్రజావాణికి, ప్రతినిధిగా రుద్రవీణను మ్రోగించారు, అగ్నిధారలు కురిపించారు డా. దాశరథి "తెలంగాణాలోని కోటి వీరుల గళధ్వనియె కాక ఇలా గోళమందుండెడి ఎల్లరి శబ్దాన్ని నేను నాపేరు ప్రజాకోటి: నావూరు ప్రజావాణి" అని విశ్వకంఠం తెలుగు సాహిత్యంలో వినిపించారు డా. దాశరథి.

దాశరథి కవితా పయోనిధి. ఓజస్సు, తేజస్సు, వాడిదనం, వేడిదనం, పదను కదను ఆయన కవితా గుణాలు. దేశభక్తిలో నుండి ఆయన కవితావేశం పుట్టింది. కటకటాలను తెగ తెంచుకొని జలపాతంగా దూకింది. ప్రజా హృదయాలు ప్రతిబింబించే ప్రబోధం చేసింది. తెలంగాణా రచయితల సంఘవేదిక ద్వారా చైతన్యాన్నీ సమన్వయ సౌజన్యాన్నీ సాధించింది. నార్లవంటి ప్రసిద్ధరచయిత పత్రికా సంపాదకీయాలకు పతాక గీతంగా నిలిచింది, విశాలాంధ్ర ఉద్యమానికి వెన్నెముకగా నిలిచింది గాంధీ దృక్పథంతో ప్రపంచ సమస్యలకు పరిష్కారం చెప్పింది. మానవతా వాదం లోని మహిమ నెత్తి చాటింది.

ఆధునికాంధ్ర కవిత్వ ప్రస్థానంలో భావ చైతన్యం మూడు పాయలుగా చీలి ప్రవహిస్తోంది. ఒకటి : సంప్రదాయ చైతన్యధార. దీనికి నాయకుడు కవి సమ్రాట్ విశ్వనాథ. రెండు: సాయుధ విప్లవ చైతన్యధార దీనికినాయకుడు మహాకవి శ్రీశ్రీ. మూడు : శాంతి విప్లవచైతన్యధార. దీనికి నాయకుడు మహాకవి దాశరథి. ఇందులో మొదటి రెండూ రెండు తీవ్రవాదాలు. వాటిని సమన్వయిస్తూ అభ్యుదయాన్ని వరించే మధ్యేమార్గం దాశరథిది. ఆయన మధ్యేమార్గానికి మాగ్నకార్టాలు 'తిమిరంతో సమరం' 'ఆలోచనాలోచనాలు' దేశభద్రత కోసం పెన్ను జేబులో పెట్టి గన్ను చేతపట్టమంటాడు "నవకవితా పతాకతో యువతా శశిరేఖతో- అజ్ఞానాంధకారాన్ని అణగిస్తూ అమాయకుల ఆక్రందన తొలగిస్తూ- పదవీ దాహ దావానలాన్ని చల్లారుస్తూ- అవకాశవాదపిశాచాన్ని హతమారుస్తూ- అపరిపక్వమైన విప్లవాండాన్ని అవియింప జూచే వినతల్ని అనాదరిస్తూ- కాలచక్రాన్ని వెనక్కి తిప్పాలని కదుప్రయత్నం చేసే కాలాంతకుల్ని కాలరాస్తూ- రావాలి భవిష్యత్తు" అని ఆక్రోశిస్తాడు దాశరథి. "హింసనుండి సమసమాజ హంస ఉద్భవించుననే- అసత్యాన్ని నమ్మకు- హంతకుడవు కాబోకని" హెచ్చరిస్తాడు యువశక్తిని. నిన్ను నీవు తెలుసుకొని నీ కన్నులు తెరుచుకొని విజృంభించినప్పుడే విప్లవమని నేనంటానని నమ్మినసత్యాన్ని నిర్మొగమాటంగా అంటాడు దాశరథి కవితా చైతన్యం సంప్రదాయంలో నుంచి విప్లవ జ్యోతిని వెలిగిస్తుంది. నవసమాజ నిర్మాణయజ్ఞానికి త్రేతాగ్నులు అవసరమంటాడాయన. ఆ త్రేతాగ్నుల్లో కవిశక్తి ఒకటంటాడాయన.

"నేను త్రేతాగ్నిలో ఒక అగ్నిని
కర్షక కార్మిక కవిశక్తులు
కలసి, వెరసి త్రేతాగ్ని అనుకునే వాణ్ణి.
ఈ నగ్నోద్విగ్న త్రేతాగ్నికి
నవసమాజ నిర్మాణ ధర్మ కర్మ నిష్ఠాపర
అనేకానేక మహాప్రజా హృదయ రుధిరధార
ఆజ్యధార!
అమ్మా! భారతీ!
నేను మరో దేశాన్ని అనుసరించి, అనుకరించి
అడుగు ముందుకు వేయలేను.

అని తాను పుట్టిన మట్టికి మన్నిక తెచ్చే మహావిప్లవం మానవత్వం రావాలంటాడు దాశరథి. ఆ మహావిప్లవంతో ముందుకు నడిచేది క్రాంతిపథం, శాంతి దానికి మూలసూత్రం.

"రక్తం నదులై పారక పోతే రాదా రెవల్యూషన్
బుర్రలు బుర్రలు పగులక సమస్యకు లేదా సొల్యూషన్
హింసా యుద్ధం ఔట్ డేటెడ్ అని నేనంటాను
శాంతి ఒక్కటే మానవ జాతికి సరియగు సాల్వేషన్"

ఒకనాడు వీరశంఖం పూరించిన దాశరథి నేడు విప్లవ శంఖం పూరిస్తున్నాడు। కానీ నాడూ నేడూ కూడా ఆయన మహాకవితా వేశాన్ని అనుశాసించింది మహాత్ముని మహనీయ సందేశం. ధరిత్రి కంతా తరణోపాయం ఆ మహాత్ముని ధర్మమే అంటాడు దాశరథి.

"ప్రతి యెదలో మహాత్ముడే-ప్రతిష్ఠితుడు కావాలి
అతని అడుగు జాడలందు-అఖిల జగం నడవాలి
నేటి క్లిష్ట సమస్యలకు—సూటి జవాబతడు
నేటి అస్థిరత్వమునకు-మేటి సవాలతడు
అతడొకడే ఈ జగతికి-ఆశాజ్యోతి
అతడే ఈ కవిగళమున-ఆనంద గీతి".

ఈ గాంధేయ విప్లవవాది—విప్లవం హింసతో కంటె త్యాగంతోనే వస్తుందని నమ్ముతాడు. విప్లవాని కందుకనే తన నిర్వచనం ఇస్తున్నాడు.

"విప్లవ మంటే అర్థం తెనియని వారికి
పిస్తోలు పట్టిన వాడే విప్లవ వాది
విప్లవం అంటే అర్థం తెలిసిన వారికి
పిస్తోలుకు గురియైన వాడే విప్లవవాది."


పై రెండు కవితా సంపుటాల్లో దాశరథి శాంతి విప్లవ దృక్పథం సమగ్రంగా స్ఫురిస్తుంది తిమిరంతో సమరంచేసే విప్లవ వీరుడికి ఆలోచనాలోచనాలు అంటే అహింసా మార్గంతో అభ్యుదయాన్ని సాధించవచ్చునని దాశరథి యిస్తున్న కవితా సందేశం। ఈ సందేశం ప్రపంచానికేకాక రాష్ట్రంలోవేర్పాటు ధోరణులు విజృంభించినప్పుడు విప్లవ జ్వాలలు చెలరేగినప్పుడూ ప్రజాకోటికి వినిపించాడు దాశరథి. ఒకనాడు ప్రజాకంఠానికి ప్రతిధ్వనిగా పలికిన దాశరథి ఈరోజు ప్రజానాయకుడుగా కవితాక్షేత్రంలో ప్రబోధిస్తున్నాడు సైన్యంతో నడుస్తూనే అగ్రభాగంలో నిలిచి ఆదేశాలిస్తున్న అగ్రనాయకుడుగా ఈ కవితా సంపుటాల్లో దాశరథి కనిపిస్తాడు ; వినిపిస్తాడు. ఇందులోని తిమిరంతో సమరానికి అఖిల భారత సాహిత్య అకాడమీ అవార్డురావటం ఎంత సముచితమో ఆలోచనాలోచనాలను అఖిలాంధ్ర ప్రియతమ ముఖ్యమంత్రి అయిన మాన్యశ్రీ జలగం వెంగళరావు గారికి అంకితమివ్వడం అంత ఉచితంగా ఉంది. ప్రపంచ తెలుగు మహాసభలద్వారా తెలుగుజాతి సమైక్యతను కాపాడిన శ్రీ జలగం, మహాంధ్ర సమైక్యాన్ని ముక్తకంఠంతో సమాహ్వానించే దాశరథి కృతిని చిరకాల స్నేహ చిహ్నంగా స్వీకరించినందుకు నిజంగా అభినందనీయులౌతున్నారు.

ఆధునిక సాహిత్యంలో ఒక ఆధునిక కృతిని సమగ్ర, సమీక్ష చేసే విమర్శ గ్రంథాలు తక్కువ. ఈ మధ్యనే 'నవోదయం' సంస్థ ఈ మార్గంలో ఒక ప్రయత్నంగా చైతన్యశిఖరాన్ని ఆవిష్కరించింది. దాశరధి గారి తిమిరంతో సమరం పై వివిధ పత్రికల్లో వెలువడ్డ సమీక్షలతోనూ, కొందరు పండిత విమర్శకులు వ్రాసిన కవితలనూ, వ్యాసాలతోనూ, కలిపి ఒక సమీక్షా వ్యాస సంకలన గ్రంథంగా 'శాంతి కపోతం' వెలువడింది. ఇందులో దాదాపు 30 సమీక్షలున్నాయి. సమీక్షలన్నీ ఉదాత్త స్థాయిలో నడిచాయి. అందులో కొన్ని దాశరథి వ్యక్తిత్వాన్ని రూపు కట్టించేవి. దాశరథి చైతన్య సారథి అంటారు జస్టిస్ శ్రీ ఓ చిన్నపరెడ్డి గారు. ఇలాగే కవితాపయోనిధి అని శ్రీ తిరునగరి, మానవతావాది అని శ్రీ శివ లెంక ప్రకాశరావు, అభ్యుదయ కవి అని శ్రీ మద్దూరి చంద్రశేఖరరావు, సమవాద దీప స్తంభమని శ్రీరంధి సోమ రాజు, తిమిర సమరాంగణ సార్వభౌముడని డా. ఐ. పాండు రంగారావు, ప్రజాకవి అని శ్రీ పి. ఏ. రామారావు, విప్లవ కవి అని డా కేతవరపు రామకోటి శాస్త్రి. విప్లవ వైతాళికుడని శ్రీగులాంయాసిన్. ఉద్యమైకజీవి అని శ్రీ ఎ. పండరినాధ్, ప్రజ్ఞలో త్రివిక్రముడని డా. నాయని కృష్ణకుమారి గారలు సోదాహరణ సమీక్షల్లో ప్రస్తుతించారు. దాశరథి భావన బలాన్ని ప్రయోగ శిలాన్ని పరిశీలించి చక్కని వ్యాసం వ్రాసారు డా. సుప్రసన్న. శ్రీ పేర్వారం జగన్నాథం దాశరథి కవితా తత్వాన్ని సమీక్షించారు. ఈకృతి నవ్యకృతుల్లో అత్యున్నత స్థానమలంకరిస్తుందని ఆంధ్ర పత్రికలో శ్రీ ఆయాస్య పేర్కొన్నారు. ఇది అభ్యుదయ రచయితల మహాసంకల్పానికి రూపాంతరమని అభివర్ణించారు ఆంధ్రప్రభలో శ్రీ మిరియాల రామకృష్ణ డా కృష్ణకుమారి, శ్రీ 'తిరునగరి, శ్రీ పి. బి శ్రీనివాస్, శ్రీ రత్నం కవి గారికికపోతానీరాజనాలర్పించారు. ఇందులో రెండు ఆంగ్లసమీక్షలు కూడా ఉన్నాయి అందులో డి. ఆంజనేయులు గారు వ్రాసిన సమీక్ష ఆకర్షణీయంగా ఉంది. తెలుగు సాహిత్యపరులు దాశరథి కృతులపై చూపించే ఆదరాభిమానులకు ఇన్ని సమీక్షలొక తార్కాణం. అసలు తిమిరంతోసమరం, తొలిముద్రణ కొద్దిరోజుల్లో చెల్లిపోవటం అంతకంటెమంచి ఉదాహరణం.

అటు పద్యాన్నీ ఇటుగేయాన్ని వచన కవిత్వాన్నీ సమ సామర్థ్యంతో నడిపిస్తూ నవతేజాన్ని కుమ్మరిస్తున్న కళాప్రపూర్ణుడు డా. దాశరధి. అటు శృంగారాన్నీ ఇటు అంగారాన్నీ వెలిగింపగలిగిన సవ్యసాచి. పారశీక కవిత్వ పరిమళాలను తెలుగు వారికి పంచిపెట్టిన కవితా గంధవాహుడు దాశరధి. ఆయనకవిత నూరంచుల వజ్రాయుధం. దాశరధి కవితా వ్యక్తిత్వాన్ని, కళాతత్వాన్నీ. సమగ్రంగా సమీక్షించే గ్రంథం ఇంకారావాలి. 'నవోదయం' సాంఘిక సాంస్కృతిక సంస్థ దానికి రూపకల్పనం చేస్తున్నది. యువభారతి డా. దాశరధి సమగ్ర సాహిత్యాన్ని సంపుటిగా ప్రచురింప సన్నాహం చేస్తున్నది. దాశరధి సాహిత్యానికి సముచితగౌరవం జరగడం సమకాలీన శాంతి విప్లవ చైతన్యానికి సాహిత్య సమరాధనంచేయటం.

—జి. వి. సుబ్రహ్మణ్యం


జిల్లాల్లో వార్తా చిత్రాలు




విద్యామంత్రి శ్రీ మండలి వెంకటకృష్ణారావు తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో సెప్టెంబరు 19న ప్రభుత్వ సాంఘిక సంక్షేమ ఉన్నత పాఠశాల బాలికల హాస్టలుకు ప్రారంభోత్సవం చేసిన అనంతరం ప్రసంగిస్తున్న చిత్రం




స్పీకర్ శ్రీ రేబాల దశరథ రామిరెడ్డి సెప్టెంబరు 9న నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో ఏటూరి వెంకటరెడ్డి సమితి ప్రాథమిక పాఠశాల భవనానికి ప్రారంభోత్సవం చేశారు.



మునిసిపల్ పరిపాలన వ్యవహారాల మంత్రి శ్రీ చల్లా సుబ్బారాయుడు సెప్టెంబరు 5న అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఉపాధ్యాయుల దినోత్సవాలను ప్రారంభించారు ఆయన కుడిప్రక్కనున్న



మధ్యతరహా నీటి పారుదల శాఖమంత్రి శ్రీ ఆనం వెంకటరెడ్డి నెల్లూరు జిల్లా ముతుకూరు గ్రామంలో సెప్టెంబర్ 21న జరిగిన రైతు సమ్మేళనంలో ప్రసంగించారు జిల్లాకాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ ఆనం భక్తవత్సల రెడ్డి, సూపరింటెండింగ్ ఇంజనీర్ శ్రీ వి వి రెడ్డిలను కూడ చిత్రంలో చూడవచ్చు



రెవిన్యూమంత్రి శ్రీ పి. నరసారెడ్డి, చిన్నతరహా నీటి పారుదల శాఖమంత్రి శ్రీ ఆనం వెంకటరెడ్డి, జిల్లాపరిషద్ అధ్యక్షుడు శ్రీ ఎం గోపాలకృష్ణారెడ్డి నెల్లూరు జిల్లా నరుకూరులో వ్యవసాయ కార్మిక సంఘం తరపున బలహీనవర్గాలకు భూమి

జిల్లాల్లో..

కడప జిల్లాలో సంచారక గ్రామీణ ఆసుపత్రులు

లేడీ డాక్టర్లతో కూడిన సంచారక వైద్య బృందం ద్వారా మారుమూల గ్రామాలలోని గ్రామీణ మహిళలకు అక్కడికక్కడ వైద్య చికిత్స సౌకర్యం కల్పించాలని కడప జిల్లా అంతర్జాతీయ మహిళా సంవత్సర ఉత్సవ సంఘం నిర్ణయించింది. ప్రతి రెవిన్యూ డివిజనుకు ఇద్దరు లేడీ డాక్టర్లతో కూడిన 3 సంచారక వైద్య బృందాలను ఏర్పాటుచేస్తారు ఎంపికచేసిన గ్రామాలలో కొన్నిరోజులపాటు సంచారక ఆసుపత్రిని నిర్వహిస్తారు.

జిల్లా కలక్టరు శ్రీ పి. యల్. సంజీవరెడ్డి అధ్యక్షతన ఇటీవల కడపలో జరిగిన ఈ సంఘం సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు

జిల్లాపరిషత్తుకు చెందిన ఖర్చుకాకుండా మిగిలిపోయిన మహిళా సంక్షేమనిధి నుండి ప్రతి వైద్యబృందానికి రు 1000 లు విలువచేసే మందులు అందజేయడానికి జిల్లాపరిషత్తు అధ్యక్షుడు అంగీకరించారు. వైద్యశాఖవారు తమ డిస్పెన్సరీలనుండి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలనుండి కూడా మందులు సరఫరా చేస్తారు. మురికివాడలు, వెనకబడిన తరగతుల వారి నిమిత్తం సెప్టెంబరు 24 వ తేదీన జిల్లా కలక్టరు శ్రీ పి యల్ సంజీవరెడ్డి కడపలో సంచారక గ్రామీణ ఆసుపత్రి పథకానికి ప్రారంభోత్సవం చేశారు. అదేరోజున శాసనసభ్యురాలు శ్రీమతి కె. ప్రభావతమ్మ బెంగుళూరులో రాజమ్మపేట డివిజనుకు చెందిన గ్రామీణ వైద్య కేంద్రానికి ప్రారంభోత్సవం చేశారు. జమ్మలమడుగు డివిజన్‌లో పులివెందల తాలూకాలోని మారుమూల గ్రామం పైడిపాలెంలో శ్రీ కృష్ణారావు వైద్య కేంద్రానికి అదేరోజు ప్రారంభోత్సవం చేశారు.

మత్స్యపారిశ్రామికులకు చెరువులను కౌలుకు యిస్తారు

పంచాయతీరాజ్ శాఖా మంత్రి శ్రీ యల్. లక్ష్మణదాసు సెప్టెంబరు 21 న వరంగల్లులో జిల్లా మత్స్య పారిశ్రామికుల సంఘం సమావేశంలో ప్రసంగిస్తూ మత్స్య పారిశ్రామికులు తమ వృత్తులను కొనసాగించటానికి వీలుగా కొంతకాలంపాటు వారికి చెరువులను కౌలుకు ఇవ్వడానికి పంచాయతీరాజ్ చట్టంలో సౌకర్యం కల్పించబడుతుందని అన్నారు. మత్స్యపరిశ్రమకు మంచి భవిష్యత్తు ఉన్నదని ఆయన పేర్కొన్నారు. మత్స్యపరిశ్రమ శాఖా మంత్రి శ్రీ డి. మునిస్వామి ప్రసంగిస్తూ రిజర్వు బ్యాంకు అఫ్ ఇండియా మత్స్యపారిశ్రామికుల సహకార సంఘాలకు ఋణాలను అందజేస్తున్నదని అన్నారు.

వర్షాలు లేని కారణంగా కౌలుమొత్తాల రెమిషన్ గూర్చి పాత బకాయిలను రద్దుచేయటాన్ని గూర్చి పరిశీలిస్తామని మంత్రి హామీ యిచ్చారు. శ్రీమతి గాంధీ 20 సూత్రాల ఆర్థిక పథకాన్ని గూర్చి మంత్రులు వివరించారు.

అంతకుముందు వరంగల్లులోని ఇన్‌ల్యాండు మత్స్య పారిశ్రామికుల శిక్షణ కేంద్రాన్ని మంత్రి తనిఖీచేశారు

ఏలూరులో జూనియర్ కళాశాల

విద్యాశాఖామంత్రి శ్రీ ఎం వి. కృష్ణారావు సెప్టెంబరు 21న ఏలూరులో శ్రీమతి పన్నాదేవిభాటియా థియోసాఫికల్ జూనియర్ కళాశాలకు ప్రారంభోత్సవం చేస్తూ విద్యారంగంలో నైతికవిలువలు, క్రమశిక్షణ మొదలైన విషయాలను పెంపొందించడానికి కృషి చేసిన డా అనిబిసెంటుకు జోహార్లు అర్పించారు. క్రమశిక్షణ లేకుండా ఏదేశానికి భవిష్యత్తు ఉండదని చెప్పుతూ అంతర్జాతీయ మహిళా సంవత్సరం సందర్భంగా తణుకులో మహిళా కళాశాలను త్వరలోనే ప్రారంభిస్తారని తమ అభిప్రాయాన్ని వెల్లడించారు విద్యారంగంలో ప్రమాణాల తగ్గుదలను ఆయన నిరసిస్తూ ప్రమాణాల పెంపుదలకు యాజమాన్యం, సిబ్బంది, విద్యార్థులు కలిసికట్టుగా పని చేయాలని ఆయన సలహా యిచ్చారు. ఉత్సవానికి అధ్యక్షత వహించిన జిల్లా కలెక్టరు శ్రీ డి. కుమారస్వామిరెడ్డి ప్రసంగిస్తూ రాష్ట్రంలో మొదటిసారిగా ఏర్పాటు చేయబడిన బుక్ బ్యాంక్ నిర్వహణ తీరుతెన్నులను ఆయన ప్రశంసించారు. ఈ బుక్ బ్యాంక్ ఏర్పాటుకు శ్రీ బ్రిజ్ గోపాల్ లూనాని రు. 5000లు ఇచ్చారు. సంక్షేమ నిధికి రు. 5000లు విరాళంగా ఇస్తానని ప్రకటించారు. సంక్షేమనిధి నుండి ఈ మహిళా కళాశాలకు విరాళం అందుతుందని ఆయన ప్రకటించారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రు. 1100లకు సంబంధించిన చెక్కును సెయింట్ థెరెసెస్ బాలికల ఉన్నత పాఠశాల హెడ్‌మిస్ట్రిస్ రు. 1500లకు సంబంధించిన చెక్కును ప్రధాన మంత్రి వరదసహాయ నిధికి విరాళంగా మంత్రికి సమర్పించారు.

గుంటూరులో భూమిలేని పేదలకు ఇండ్లస్థలాలు

గుంటూరు జిల్లా పరిషత్తు స్థాయీ సంఘ సమావేశానికి అధ్యక్షత వహించిన గుంటూరు జిల్లా కలక్టరు శ్రీ కె చంద్రయ్య ప్రసంగిస్తూ హరిజనులకు ఇండ్లస్థలాలు కేటాయించాలని ఇటీవల జారీచేసిన ఉత్తర్వులో రైతులకు 5 వార్షిక వాయిదాలలో పరిహారం చెల్లించడానికి జిల్లా కలక్టరుకు అధికారమిచ్చారని అన్నారు. గుంటూరు జిల్లాకు ఇంతవరకు ఈ సంవత్సరం రు. 20 30 లక్షలు కేటాయించారు పేదవారికి ఇండ్లస్థలాలు కేటాయించే కార్యక్రమం క్రింద యింతవరకు రూ. 5,06,000లు ఖర్చు చేశారని అన్నారు.

బుట్టాయగూడెంలో గిరిజన సంక్షేమ హాస్టల్

సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి శ్రీ బాట్టం శ్రీరామమూర్తి సెప్టెంబరు 21న బుట్టాయగూడెంలో రు. 35,000 ఖర్చుతో నిర్మించబడిన గిరిజన హాస్టల్‌కు ప్రారంభోత్సవం చేస్తూ నిపుణుల సహా

యంతో గిరిజన ప్రాంతాలకు అనువైన విద్యా విధానాన్ని రూపొందించాలని చెప్పారు. పంచాయతీ సమితులు ఇందుకు శ్రద్ధ వహించాలని అన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుండి గిరిజన బ్లాకుల హెడ్‌క్వార్టర్స్‌లో ఉన్నత పాఠశాలలను ఏర్పాటు చేస్తారని ఆయన అన్నారు. వచ్చే ఆరు మాసాలలో గిరిజనులపై అభివృద్ధి కార్యక్రమాల ప్రభావం తప్పకుండా ఉంటుందని శ్రీ రామమూర్తి తమ ఆశాభావాన్ని వెల్లడించారు. గిరిజనేతరులు అక్రమంగా స్వాధీనం చేసుకున్న భూములకు సంబంధించిన కేసులను పరిష్కరించడంలో ఆలశ్యం చేయరాదని మంత్రి అన్నారు.

ప్రతి శాఖలోని బడ్జెట్‌లో గిరిజన సంక్షేమానికి 4 శాతం, హరిజన సంక్షేమానికి 15 శాతం కేటాయించే విధంగా చర్యలను తీసుకుంటారని మంత్రి వెల్లడించారు. ప్రస్తుత సంవత్సరంలో రు. 10 కోట్ల ఖర్చుతో బలహీనవర్గాలకు చెందిన 3 లక్షల కుటుంబాలకు ఇండ్ల స్థలాలను పంపిణీచేస్తారని మంత్రి చెప్పుతూ హరిజనుని జిల్లాపరిషత్తు అధ్యక్షునిగా చేయడంలో తోడ్పడినందుకు శ్రీ అల్లూరి బాపినీడును ఆయన అభినందించారు. గిరిజనులకు స్ప్రేయర్లను మంత్రి ఉచితంగా పంపిణీ చేశారు.

జిల్లా పరిషత్తు అధ్యక్షుడు శ్రీ అల్లూరి బాపినీడు ప్రసంగిస్తూ గిరిజన ప్రాంతాలలో పనిచేసేవారు సేవాభావంతో చిత్తశుద్ధితో తమ విధులను నిర్వహించాలని, ఏజన్సీ ప్రాంతాలలో స్వార్థపరులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. శాసనసభసభ్యుడు శ్రీ కణితి రాములు ప్రసంగిస్తూ గిరిజన సంక్షేమ పథకాలను త్వరితగతిని అమలు జరపాలని విజ్ఞప్తి చేశారు.

రామన్నపేట తాలూకాలో సమగ్ర నీటిపారుదల పథకాలు

న్యూఢిల్లీలోని గ్రామీణ విద్యుత్ సంస్థ అధికారులు యిటీవల నల్గొండ జిల్లాలోని అధికారులు, ప్రజా ప్రతినిధులతో రామన్నపేట తాలూకాలోని 50 గ్రామాలలో ప్రత్యేక నీటిపారుదల పథకాలను అమలుపరిచే సాధ్యాసాధ్యాలను గురించి చర్చలు జరిపారు. ఈ పథకం క్రింద రామన్నపేట తాలూకాలో 800 నీటి పారుదల బావులు 60 పారిశ్రామిక యూనిట్లు 3,350 ఇతర సర్వీసులను ఉపయోగంలోనికి తీసుకురావడానికి యోచింపబడింది.

శ్రీ సి. యం. కె రావు ఆధ్వర్యాన న్యూఢిల్లీ నుంచి వచ్చిన అధికార బృందం మునిపంపుల, తుమ్మలగూడెం, దాచారం, అనాజిపురం, మోతుకూరు గ్రామాలు దర్శించి ఈ ప్రాంతాలలో నీటి మట్టాన్ని, నీటి పారుదల సౌకర్యాలను తత్సంబంధమైన యితర విషయాలను పరిశీలన జరిపింది.

శ్రీ సి యం. కె. రావు ఈ క్రొత్త పథకం యొక్క ముఖ్య అంశాలను గురించి వివరిస్తూ ఎలక్ట్రిక్ మోటార్లను కొనడానికి ముందుగా భూగర్భ జలాల అవకాశాలను రైతులకు పరపతి సౌకర్యాలను గమనించవలసి వుంటుందని చెప్పారు. ఈ చర్చలలో జిల్లా కలక్టరు శ్రీ పి. పి. విలియమ్స్ జిల్లా పరిషత్తు అధ్యక్షులు శ్రీ కె రంగారెడ్డి, లోకసభ సభ్యులు శ్రీ రామకృష్ణారెడ్డి, శాసన సభ సభ్యులు శ్రీ పి. రాజరత్నం, మోతుకూరు సమితి అధ్యక్షులు శ్రీ రామచంద్రారెడ్డి జిల్లా కాంగ్రెసు కమిటీ కార్యదర్శి శ్రీ నరసింహారావు, యితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వ్యవసాయ అభివృద్ధి బ్యాంకు-అభివృద్ధి ఋణాలు

నెలూరు జిల్లా వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టరు శ్రీ టి. కోటేశ్వరరావు, కొవ్వూరు తాలూకా మిక్కిలింపేట రైతుల నుద్దేసించి ప్రసంగిస్తూ అధిక దిగుబడిని సాధించడానికి వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతులను అనుసరించాలని ఉద్బోధించారు. అధిక దిగుబడినిచ్చి అనుకూలము కాని పరిస్థితులనుకూడా తట్టుకో గలిగిన 9672-మొలగొలుకులు రకం కొత్త వంగడాలను చేపట్టాలని రైతులకు సలహాయిచ్చారు కొవ్వూరులోని వ్యవసాయ అభివృద్ధి బ్యాంకువారు యిచ్చిన ఋణాలను 70 మంది సన్నకారు, మధ్యతరహా రైతులకు ఒక లక్ష రూపాయల మేరకు పంపిణీ చేశారు. వ్యవసాయం, తత్సంబంధమైన సర్వతోముఖాభివృద్ధికి ఈ బ్యాంకువారు ఈ గ్రామాన్ని దత్తం చేసుకున్నారు.

బ్యాంకు బ్రాంచి మేనేజరు శ్రీ కె. వెంకటేశ్వరరావు యీ సందర్భంగా ప్రసంగిస్తూ జారీచేయబడిన ఋణాలను సద్వినియోగం చేసుకోవాలని తిరిగి ఈ మొత్తాలను సకాలంలో చెల్లించాలని రైతులకు విజ్ఞప్తిచేశారు.

నెల్లూరులో బ్రాంచి గ్రంథాలయం

చిన్నతరహా నీటి పారుదల శాఖా మంత్రి శ్రీ ఆనం వెంకటరెడ్డి, సెప్టెంబరు 22 న నెల్లూరుకు 24 మైళ్ల దూరంలోని చెన్నూరు గ్రామంలో బ్రాంచి గ్రంథాలయానికి ప్రారంభోత్సవం చేస్తూ ప్రజలుపాల్గొననిదే అభివృద్ధి పథకాలు అమలుచేయడం విజయవంతం కాదని అన్నారు. వెనుకబడిన తరగతుల సంక్షేమానికి తీవ్రమైన చర్యలు తీసుకోవడానికి వీలుగా ప్రధానమంత్రికి తమ సంపూర్ణ సహాయ సహకారాలను అందజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లాలో గ్రంథాలయ ఉద్యమాన్ని ముమ్మరంగా సాగిస్తున్నందుకు జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు శ్రీ ఎన్. హరిశ్చంద్రా రెడ్డిని మంత్రి అభినందించారు సమావేశానికి అధ్యక్షత వహించిన మాజీ మంత్రి శ్రీ ఆనం సంజీవరెడ్డి ప్రసంగిస్తూ గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాలలో రాజకీయాల్ని ప్రవేశింపనీయరాదని ప్రజలకు సూచించారు. విరాళాల ప్రాతిపదికపైగాక అవసరాలను అనుసరించి కళాశాలలు, ఆస్పత్రులు మొదలైనటువంటి ప్రజాసంస్థలను మంజూరు చేయాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. రూ 10,000 లు విలువచేసే గ్రంథాలయ భవనాన్ని విరాళంగా ఇచ్చినందుకు శ్రీ చదలవాడ వెంకట శేషయ్యను ఆయన అభినందించారు. ★

"ఆంధ్రప్రదేశ్" 19వ సంపుటి వ్యాస సూచిక

("ఆంధ్రప్రదేశ్"లో 1974 నవంబరు సంచిక నుండి 1975 అక్టోబరు వరకు
ప్రచురింపబడిన అంశాల వివరాలు)

జనరల్

టూరిజం

చైతన్యమూర్తులు

కథలు

గ్రంథ సమీక్షలు

కవితలు

PRINTED BY THE DIRECTOR OF PRINTING, GOVT OF ANDHRA PRADESH, AT GOVT CENTRAL PRESS, HYDERABAD
PUBLISH BY THE DIRECTOR OF INFORMATION & PUBLIC RELATIONS ANDHRA PRADESH, HYDERABAD.

ఆంధ్ర ప్రదేశ్‌లో

జనాభా	4,35,03,000
షెడ్యూలు కులాలవారు	57,75,000
షెడ్యూలు జాతులవారు	16,58,000
విస్తీర్ణం (చ.కి మీ.)	2,76,754
జిల్లాలు	21
తాలూకాలు	195
పట్టణాలు, నగరాలు	224
పల్లెలు	27,221
పంచాయతీలు	15,920
పంచాయతీ సమితులు	324
పార్లమెంటు సభ్యులు	59
శాసన సభ సభ్యులు (ఒకనామినేటెడ్ సభ్యునితోసహా)	288
శాసన పరిషత్తు సభ్యులు	90
విశ్వవిద్యాలయాలు	5
అక్షరాస్యులు	1,06,90,000

రిజిస్టరు నెం. హెచ్/హెచ్ డి. 81

విజయేందిర

ఏ దేశమున పుట్టె యీ దీపకళిక
ఏ ఇంట ఏ జంట దీ మచ్చుతునక
తల్లి పేరె క్రాంతి తండ్రి పేరె శాంతి
తనయ ఇందిరగాంధి మరల పుట్టిన గాంధి

స్త్రీ రత్నమీరోజు భరత ప్రధాని
స్త్రీ సుగతికి దేశమిక రాజధాని
మా వరం ఇందిరమణి పంచశీల
పావురమ్ముల మెడల ఓ పూలమాల

పుణ్య భారతస్త్రీలకీమె ప్రతిబింబం
పుడమిపై పుట్టిన పూర్ణ శశిబింబం
భరత ప్రధాని మన ఇందిరాగాంధి
ప్రపంచ మహిళా ప్రగతికిది గొప్ప నాంది

విజయేందిరకు సదా విజయమౌగాక
విశ్వశాంతికి ఆమె విడిదియౌగాక
వీర జవహరు గీతి విలసిల్లుగాక
విజ్ఞానమె విజయ ధ్వజమెత్తుగాక!

—శ్రీ సి హెచ్. రాజలింగం